ESTD: 1999
www.voodayam.com

# ఉదయం

ఖమ్మం | 17-09-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక : 293 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal

Follow us on







## సెమీకండక్టర్, పారిశ్రామిక రంగానికి
# తెలంగాణ అడ్డా

**ఫ్యూచర్ సిటీలో సింగపూర్ పెట్టుబడులకు ఆహ్వానం**
**సింగపూర్ కంపెనీల భాగస్వామ్యానికి విజ్ఞప్తి**
**రాష్ట్రాన్ని 'అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రం'గా తీర్చిదిద్దడమే లక్ష్యం**
**తెలంగాణ అంతర్జాతీయ సదస్సుకు రావాలని సింగపూర్ ప్రభుత్వానికి ఆహ్వానం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఉదయం) :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా శరవేగంగా అభివృద్ధి చేస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో బుధవారం సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా సెమీకండక్టర్ రంగంలో సింగపూర్ కలిగిన సుదీర్ఘ సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణకు అనుసంధానించాలని కోరారు. రాష్ట్రంలో ఫ్యాబ్ ఉత్పత్తులతో పాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థల బలోపేతానికి సింగపూర్ సంస్థల భాగస్వామ్యాన్ని మరింత పెంచేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలను ప్రతినిధుల బృందానికి వివరించారు.

అధిక విలువున్న పరిశ్రమలు, పరిశోధనఅభివృద్ధి, సాంకేతిక ఆధారిత రంగాలకు అవసరమైన మెరుగైన వాతావరణాన్ని రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా కల్పిస్తున్నామని మంత్రి తెలియజేశారు. సమాచార సాంకేతికత, నూతన సాంకేతికతలు, ఎలక్ట్రానిక్స్, ముందస్తు ఉత్పత్తి రంగాలు, జీవశాస్త్రాలు, జీవసాంకేతికత, ఆకాశయాన రంగం, హరిత సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, రవాణాసరఫరా వ్యవస్థ, పట్టణ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి వంటి అనేక రంగాల్లో సింగపూర్ వ్యాపార వర్గాలకు తెలంగాణలో విస్తృతమైన అవకాశాలు లభ్యమవుతున్నాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న అనుకూలతలు, పెట్టుబడి అవకాశాలపై ఆ దేశ సంస్థలకు అవగాహన కల్పించాలని ప్రతినిధులను అభ్యర్థించారు. ప్రభుత్వం డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించబోయే 'తెలంగాణ సమగ్ర అభివృద్ధి అంతర్జాతీయ సదస్సు2026'లో సింగపూర్ ప్రభుత్వం మరియు అక్కడి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు విశేషంగా పాల్గొనేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహణ సంచాలకులు శశాంకతో పాటు సింగపూర్ ఉన్నతాధికారులు డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, జీన్ యా, ఆటీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకే
# 'భూ భారతి'



**రూ.లక్ష కోట్ల భూ దోపిడీని ఉపేక్షించం - సీఎం రేవంత్**
**ధరణి దోపిడీపై 'సిట్' విచారణ**
**12 రకాల భూ సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ**
**విదేశీ కంపెనీల చేతుల్లో రైతుల సమాచారంపై సీఎం ఆగ్రహం**
**22ఏ నిషేధిత భూముల చిక్కుముళ్లకు 30 రోజుల్లో పరిష్కారం**
**ధరణి రికార్డుల కబ్జాపై సుదీర్ఘ విచారణ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఉదయం) :** రాష్ట్రంలో ధరణి పోర్టల్ రూపంలో జరిగిన భూ దోపిడీపై మరియు అక్రమాలపై ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు శాసనసభ వేదికగా సంచలన ప్రకటన చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత భూముల జాబితాపై జరిగిన స్వల్పకాలిక చర్చకు సీఎం సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. నిజాం నవాబుల కాలం నాటి నుంచి నేటి వరకు అమల్లోకి వచ్చిన భూ చట్టాలు, వాటి వల్ల ఉత్పన్నమైన సమస్యలను సభకు వివరించారు. 1908 నాటి రికార్డుల నుంచి కాస్రా పహానీ, ఇనాం భూముల రద్దు, భూదానోద్యమం, 1/70 యాక్ట్, ఆర్వోఆర్ చట్టం, ల్యాండ్ సీలింగ్ మరియు 1977 అసైన్డ్ భూముల చట్టాల ప్రాధాన్యతను ప్రస్తావించారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ నిర్వహణను విదేశీ కంపెనీలకు కట్టబెట్టి, కోట్ల మంది తెలంగాణ రైతుల బ్యాంక్, ఆధార్, ఫోన్ వివరాల వంటి సున్నితమైన రికార్డులను విదేశీ శక్తుల చేతిలో పెట్టిందని తీవ్రంగా ఆరోపించారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని రద్దు చేయడం వెనుక ఉన్న కుట్రలను ప్రశ్నించిన సీఎం, రూ.లక్ష కోట్ల విలువైన నిరుపేదల భూములను దోచుకున్న వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ప్రజల ఆస్తుల రక్షణ కోసమే తమ ప్రభుత్వం 2025లో నూతన భూ భారతి చట్టాన్ని రూపకల్పన చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. 22ఏ నిషేధిత జాబితా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే అమల్లో ఉందని, గత ప్రభుత్వ హయాంలో ఒకే సర్వే నంబరులోని వివాదం వల్ల మొత్తం భూమిని నిషేధంలో పెట్టడంతో వివాదాస్పద విస్తీర్ణం 30 లక్షల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ విస్తీర్ణాన్ని 3,73,930 ఎకరాలకు తగ్గించిందని వివరించారు. ఇకపై భూములను నిషేధిత జాబితాలోకి చేర్చే అధికారం కేవలం జిల్లా కలెక్టర్లకే ఉంటుందని, అభ్యంతరాలు ఉంటే అప్పీల్, రివిజన్ పిటిషన్లు దాఖలు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ రికార్డు డిమాండ్, ఉచిత రీయింబర్స్మెంట్ వంటి ప్రజా సమస్యలపై అసెంబ్లీలో సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదల భూ సమస్యలకు 30 రోజుల్లోగా పరిష్కారం చూపేలా ఒక ఉన్నతస్థాయి అధికారుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. సభలో గుర్తించిన 12 రకాల ప్రధాన సమస్యలకు త్వరలోనే పరిష్కార మార్గాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ మిగులు భూముల క్రమబద్ధీకరణకు కొత్త విధానం తెచ్చి దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తామని చెప్పారు. అనుమతి ఉన్న లేఅవుట్లు, కోల్ బెల్ట్ ప్రాంతాలు, జీవో 59, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 దరఖాస్తులను ప్రత్యేక కమిటీల ద్వారా పరిష్కరించి 22ఏ జాబితా నుంచి తొలగిస్తామన్నారు. అనధికార లేఅవుట్లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి నూతన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.

అసైన్డ్ భూములు, ఉచిత ఇందిరమ్మ ఇండ్ల స్థలాల సమస్యలపై న్యాయ సమీక్ష, విస్తృత సంప్రదింపుల అనంతరం తగిన నిర్ణయాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారుల సొంత స్థలాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు 5 ఏళ్ల గడువు ముగిసిన తర్వాత విక్రయాలకు అనుమతిస్తామన్నారు. నాలా రుసుము చెల్లించని ప్రైవేటు భూములకు స్టాంప్ డ్యూటీతో కలిపి రిజిస్ట్రేషన్ల సదుపాయం కల్పిస్తామని, సికింద్రాబాద్ లీజ్ హోల్డ్ ఆస్తులను ఫ్రీహోల్డ్‌గా మార్చే ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు, భూదాన్ భూములను ల్యాండ్ పూలింగ్ కిందకు తెచ్చి, ఆ వనరులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పేదల గృహ నిర్మాణ పథకాలకు ఉపయోగిస్తామని వివరించారు.

# నకిలీ పత్రాలతో
# భూముల నమోదు

**బీఆర్ఎస్ నేతలపై రెవెన్యూ మంత్రి తీవ్ర ఆరోపణలు**
**22ఏ నిషేధిత భూముల్లో 4 లక్షల ఎకరాలే పట్టా భూములు**
**చట్టాన్ని ఉల్లంఘించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు**
**మాజీ మంత్రులపై పొంగులేటి ధ్వజం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఉదయం) :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు ఏ ప్రభుత్వం అనుమతులు ఇచ్చినప్పటికీ అది చట్టరీత్యా తప్పేనని స్పష్టం చేసిన ఆయన, అలాంటప్పుడు తన మామగారి భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా సాధ్యమైందో సమాధానం చెప్పాలని హరీశ్‌రావును డిమాండ్ చేశారు. శాసనసభ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడిన పొంగులేటి, గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఆ భూములకు ముందస్తు అనుమతి పత్రాలు ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను తిరస్కరించారు. చట్టవ్యతిరేక చర్యలను సమర్థించుకోవడం సరికాదని, ఆనాడు ఈ వ్యవహారంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి నకిలీ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా భూదాన్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలో సైతం అత్యున్నత న్యాయస్థానాల యథాతథ స్థితి ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ నిషేధిత భూముల నమోదు జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ మంత్రి కీలక వివరాలను వెల్లడించారు. ఈ జాబితాలోని భూముల్లో కేవలం నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే ప్రైవేటు పట్టా భూములని, మిగిలిన విస్తీర్ణమంతా ప్రభుత్వ పరిధిలోనిదేనని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితా నుంచి ఇప్పటికే 47,440 ఎకరాల భూమిని మినహాయించినట్లు సభ వేదికగా వెల్లడించామన్నారు. గత పాలకుల హయాంలో జరిగిన భూ దోపిడీ, అక్రమాలపై సమగ్ర వివరాలను త్వరలోనే ప్రజల ముందుకు తెస్తామని, 22ఏ భూముల చిక్కుముళ్లను విప్పేందుకు ప్రభుత్వం త్వరలోనే కీలక నిర్ణయాలు తీసుకోబోతోందని వివరించారు.

## యూపీఐ పన్నును వెంటనే
# రద్దు చేయాలి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (ఎఎంస్) :** యూపీఐ లావాదేవీలపై విధించిన కొత్త రుసుములను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానాన్ని ఆయన యూపీఐ పన్నుగా అభివర్ణించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసిన ఆయన, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి భారతీయుడిపై పన్ను భారం మోపుతూ, ఆ నిధులను అమెరికాకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. యూపీఐ పన్నును ప్రధాని వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**కొత్త విధానం మరియు విమర్శలు**


కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విధానం ప్రకారం, రెండు వేల రూపాయలకు పైబడిన నిర్ణీత వ్యాపార లావాదేవీలపై సున్నాపాయింట్ నాలుగు శాతంగా మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎమ్‌డీఆర్) విధిస్తారు. ఈ రుసుము గరిష్ఠంగా డెబ్బై ఐదు వేల రూపాయలు మరియు అంతకంటే ఎక్కువ లావాదేవీలకు మూడు వందల రూపాయలుగా పరిమితి విధించారు. ఈ రుసుములు కేవలం వ్యాపారులకు మాత్రమే వర్తిస్తాయని, వినియోగదారులపై ఎలాంటి భారం పడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే వ్యాపారులు ఈదనపు భారాలను అంతిమంగా వస్తువుల ధరల పెంపు ద్వారా వినియోగదారులపైనే మోపే అవకాశం ఉందని విమర్శకులు భావిస్తున్నారు.

**ఇందిరా గాంధీతో పోలిక - ప్రధానిపై ఘాటు వ్యాఖ్యలు**

ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు లొంగిపోయిందని రాహుల్ గాంధీ విమర్శించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాలనా శైలిని గుర్తుచేస్తూ, గతంలో ఇందిరా గాంధీని మీరు ఎడమవైపు మొగ్గుతారా లేక కుడివైపు నిలుస్తారా అని అడిగినప్పుడు, తాను ఎటు వంగనని, నిటారుగా నిలబడతానని చెప్పారని రాహుల్ పేర్కొన్నారు. కానీ ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ శైలి పూర్తి భిన్నంగా ఉందని, ఆయన ఎడమ లేదా కుడి వైపు నిలబడకుండా డొనాల్డ్ ట్రంప్ ముందు సాష్టాంగ పడుతున్నారని వ్యాఖ్యానించారు.

## రాజీనామా రాజకీయం - విచిత్ర పరిస్థితి

**చెన్నై:** తమిళనాడు రాష్ట్రంలో కొందరు శాసనసభ్యులు ఎన్నికైన కొద్దికాలానికే రాజీనామా చేసి తిరిగి అదే నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలవడంపై మద్రాస్ ఉన్నత న్యాయస్థానం తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. ఈ తరహా రాజకీయ క్రీడ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడంతో పాటు ఓటర్లను కించపరచడమేనని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఎన్నికైన వెంటనే స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసి మరలా ఉప ఎన్నికల్లో పోటీ చేసే ప్రజాప్రతినిధుల వ్యవహారంపై తక్షణమే దృష్టి సారించాలని, ఇలాంటి ధోరణులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠినమైన మార్గదర్శకాలను రూపొందించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరపున పోటీ చేసి గెలుపొందిన కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని రోజులకే రాజీనామా చేసి అధికార పార్టీలో చేరడంతో ఈ వివాదం మొదలైంది.




## ఇంతే కదా...!




# అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి

**వాషింగ్టన్ :** సౌదీ అరేబియాలోని ఒక అగ్రరాజ్య మిలిటరీ స్థావరంపై ఇటీవల ఇరాన్ దళాలు అత్యంత ఖచ్చితత్వంతో విరుచుకుపడటం వెనుక రష్యా నిఘా రంగానికి చెందిన కీలక హస్తం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా సమాచారం వెల్లడించింది. అమెరికా నిఘా వర్గాలను ఉటంకిస్తూ వెలువడిన కథనాల ప్రకారం, అగ్రరాజ్య సైనిక స్థావరాల సమాచార సేకరణ కోసం రష్యాకు చెందిన పద్నాలుగు ఉపగ్రహాలు నిరంతరం పనిచేసాయి. రష్యా అందించిన అత్యాధునిక ఉపగ్రహ సమాచారాన్ని వినియోగించుకుని టెహ్రాన్ మిలిటరీ స్థావరాల ఖచ్చితమైన స్థానాలను, అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను ముందస్తుగానే గుర్తించగలిగింది. ఈ ఉపగ్రహ డేటా ఆధారంగానే ఇరాన్ దళాలు అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలిగాయని తెలుస్తోంది. భవిష్యత్తులోనూ పశ్చిమాసియాలో ఉన్న అమెరికా బేస్‌లు, సైనిక నియంత్రణ కేంద్రాలు మరియు నావికాదళ మౌలిక సదుపాయాలపై ఇటువంటి దాడులు మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలు ఉన్నాయని రక్షణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న సుదీర్ఘ పోరాటంలో కీవ్ బలగాలకు అగ్రరాజ్యం సహా పశ్చిమ దేశాలు పెద్దఎత్తున ఆయుధ సహాయం అందిస్తున్నాయి. దానికి ప్రతీకారంగానే మాస్కో ఇరాన్‌తో తన రక్షణ అనుబంధాన్ని మరింత బలపరుచుకుంటోందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. రెండు దేశాల మధ్య సైనిక సంబంధాలు గడిచిన కొన్నేళ్లుగా బలపడుతుండగా, ఇరాన్ తయారుచేసిన తక్కువ ధర షాహెద్ డ్రోన్లను రష్యా కొనుగోలు చేయడంతో ఈ మైత్రి కొత్త మలుపు తిరిగింది. ఉక్రెయిన్ యుద్ధంలో ఈ డ్రోన్లు మాస్కోకు ఎంతో ఉపయోగపడటంతో ఆ డ్రోన్ల తయారీ హక్కులను కూడా రష్యా దక్కించుకుంది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో టెహ్రాన్‌కు రష్యా సాంకేతిక సాయాన్ని విస్తరించింది.

# పర్శపల్లి గ్రామం లో వృథాగా పోతున్న తాగునీరు

కోహీర్ సెప్టెంబర్ 16
(వుదయం ప్రతినిధి)



కోహీర్ మండల పరిధిలోని పర్శపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకర్ నిర్వహణ లోపంతో దర్శనమిస్తోంది. ట్యాంకర్ నిండినప్పటికీ మోటార్ బంద్ చేయకపోవడంతో నీరు వృథాగా కిందకు ప్రవహిస్తోంది. లీకేజీలు, ఓవర్‌ఫ్లో వల్ల రోజూ వేలాది లీటర్ల విలువైన మంచి నీరు వృథాగా నేలపాలవుతోంది. గ్రామ వీధుల్లోకి నీరు చేరి చుట్టుపక్కల ప్రాంతాలు బురదమయంగా మారుతున్నాయి. రోడ్డుపై నీరు నిలవడంతో దోమలు వ్యాపించి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అనేక గ్రామాల్లో నీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే, ఇక్కడ నీటిని వృథా చేయడం విచారకరం. ట్యాంకర్ వద్ద సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటి వృథాను అరికట్టడంలో గ్రామ పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రజాప్రతినిధులు రోజూ ఈ మార్గం నుంచే వెళ్తున్నా పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. నీటిని పొదుపుగా వాడాలని ప్రచారం చేసే అధికారులే ఇలా ఉదాసీనంగా ఉండటం సరికాదంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మినీ ట్యాంకర్‌కు కంట్రోల్ వాల్వ్ ఏర్పాటు చేయాలని, లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. పర్శపల్లి గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# 22ఏ నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ భూములను తొలగించాలి



సంగారెడ్డి వుదయం :

22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను వెంటనే జాబితా నుంచి తొలగించి, వాటి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరుతూ మెదక్ పార్లమెంట్ టీడీపీ అడహాక్ కమిటీ కన్వీనర్ ఇల్లెందుల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు 22ఏ నిషేధిత జాబితా ఏర్పాటు చేయడం సమంజసమేనని, అయితే రెవెన్యూ రికార్డుల్లోని లోపాలు, పొరపాట్ల కారణంగా ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా సంగారెడ్డి, పఠాన్‌చెరు నియోజకవర్గాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని డీఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి భూములను అనుభవిస్తూ పట్టాదారు పాస్‌బుక్కు, హక్కు పత్రాలు కలిగి ఉన్నప్పటికీ 22ఏ జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, దీంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ భూములు కాని ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓను కోరారు.
ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ టీడీపీ అడహాక్ కమిటీ నాయకులు బందెన్న గౌడ్, మల్లేశం యాదవ్, ప్రకాష్, బాబ్జి, హరిశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి యువకుల ఆపన్నహస్తం



- రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

దౌల్తాబాద్ సెప్టెంబర్ 16(వుదయం):

అనారోగ్యంతో అప్పాయిపల్లి గ్రామానికి చెందిన డాకి కీర్తన మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామ యువకులు చలించిపోయారు. ఆపదలో ఉన్న ఆమె కుటుంబానికి తమవంతు అండగా నిలవాలని నిర్ణయించుకుని రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి తోడుగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ.. కీర్తన మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో ఉందని, ఇలాంటి సమయంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తమ వంతు సహాయం అందించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి గ్రామస్తులంతా అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు, మాజీ ఉపసర్పంచ్ కేశబోయిన ప్రభాకర్, వార్డు సభ్యుడు బాను, స్వామి, రమేష్, సాయిలు, మల్లేష్, అనిల్, సాయి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్ లబ్ధిదారుల ధృవీకరణ

సంగారెడ్డి వుదయం :

మండలంలోని గౌడ్ చర్ల గ్రామంలో చేయూత పింఛన్ లబ్ధిదారుల ధృవీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాలను అధికారులు పరిశీలించి, అర్హతలను ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి రవీందర్ గౌడ్, ధృవీకరణ అధికారి ఝాన్సీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాణి పాల్గొన్నారు. లబ్ధిదారుల వివరాలు, సంబంధిత పత్రాలను పరిశీలించి ధృవీకరణ ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన సంబంధిత పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



# కోహీర్ మండలంలో పగటిపూటా వెలుగుతున్న వీధిదీపాలు

- "విద్యుత్ వృథాపై వెల్లువెత్తుతున్న నిరసనలు!"

"వార్త కథనాలు రాసినా మారని తీరు" కోహీర్ సెప్టెంబర్ 16
(వుదయం ప్రతినిధి)



కోహీర్ మండల వ్యాప్తంగా పగటి పూట కూడా వీధిదీపాలు నిరంతరం వెలుగుతూ విద్యుత్ తీవ్రంగా వృథా అవుతోంది. వార్తా మాధ్యమాల్లో వరుస కథనాలు ప్రచురితమవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సమస్యను పదేపదే లేవనెత్తినా అధికారుల్లో ఎలాంటి చలనం రాకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల నాగార్జునసాగర్, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు క్షీణించాయి.
నీటి కొరత వల్ల రాష్ట్రంలో జలవిద్యుత్ ఉత్పత్తి దాదాపు శూన్యస్థాయికి పడిపోయింది. రాష్ట్రంలో తీవ్ర విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ప్రతి ఒక్కరూ కరెంట్‌ను ఆదా చేయాలని టిజిఎస్‌పిడిసిఎల్ (TGSPDCL) అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో బాధ్యతారాహిత్యంగా పగటివేళల్లో కూడా విద్యుత్ వృథా అవుతోంది.
గోటిగార్పల్లి, సిద్దాపూర్ తండా, పర్శపల్లి, బడంపేట్ లలో ఈ సమస్య ఉంది. బిలల్పూర్, పైడిగుమ్మల్, నాగిరెడ్డి పల్లి, పోతిరెడ్డి పల్లి లలో పగటిపూటే లైట్లు వెలుగుతున్నాయి. వెంకపూర్, కవెలి, దిగ్వాల్, మద్రి లలో కూడా దీపాలు నిరంతరం ఆన్‌లోనే ఉంటున్నాయి. గుర్జివాడ, రాజనెల్లి, కొత్తూరు, ఖానాపూర్, పిచ్చరాగాడి. మండలం లో ఇతర గ్రామాలలోనూ విద్యుత్ నిత్యం వేలాది యూనిట్ల విద్యుత్ మండుటెండలో వృథాగా మండిపోతోంది. గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలకు కనీసం ఆన్/ఆఫ్ (On/Off) స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడమే ప్రధాన కారణం. కొన్ని ప్రాంతాల్లో అమర్చిన టైమర్ వ్యవస్థలు పాడైపోయినా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సాయంత్రం వేలల్లో వెలగాల్సిన దీపాలు మరుసటి రోజు మధ్యాహ్నం వరకు వెలుగుతున్నా పంచాయతీ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. ప్రజాధనం, అత్యంత విలువైన విద్యుత్ శక్తి కళ్ల ముందే వృథా అవుతుంటే ఊరుకోవడం తగదు. అంటున్నారు. ఓట్లు అడిగేందుకు వచ్చే నాయకులు గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. కరెంట్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలి. మండలంలోని ప్రతి వీధి స్తంభానికి నాణ్యమైన స్విచ్‌లను లేదా ఆటోమేటిక్ టైమర్లను వెంటనే అమర్చాలి. పగటిపూట దీపాలు ఆర్పని పంచాయతీ సిబ్బందిపై, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి విద్యుత్ వృథాను అరికట్టాలని కోహీర్ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సెప్టెంబర్ 17.. నాటి పోరాటం.. నేటి రాజకీయం

- విలీనమా.. విమోచనమా.. ప్రజా పాలన దినోత్సవమా?
- చరిత్రను మతం, రాజకీయాల కళ్లద్దాల్లో కాకుండా.. ప్రజల పోరాటాల కోణంలో చూడాల్సిందే

దౌల్తాబాద్ సెప్టెంబర్ 17(వుదయం):
తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిన రోజు. ఒకవైపు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజా, రైతాంగ ఉద్యమాలు. మరోవైపు హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో చేర్చేందుకు జరిగిన రాజకీయ, సైనిక పరిణామాలు. వీటన్నింటి కూడలిలో నిలిచిన చారిత్రక ఘట్టం ఇది. అందుకే ప్రతి ఏడాది సెప్టెంబర్ 17 వచ్చిందంటే విలీనమా?, విమోచనమా?, సమైక్యతా దినమా? అనే చర్చ తెరపైకి వస్తోంది.

**మత పోరాటమా.. ప్రజా పోరాటమా?**
నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం ముస్లిం పాలకుడు కావడం, జనాభాలో మెజార్టీ హిందువులు ఉండటం చారిత్రక వాస్తవమే. కానీ మొత్తం పోరాటాన్ని కేవలం హిందూ ముస్లిం ఘర్షణగా నిర్వచించడం చరిత్రలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను కుదించే ప్రమాదం ఉంది. నిజాం పాలనలో ప్రజాస్వామ్య హక్కుల కొరత, భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరీ, దొరల ఆధిపత్యం, రైతుల సమస్యలు వంటి అంశాలు తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రధాన నేపథ్యంగా నిలిచాయి. తెలంగాణ ప్రభుత్వ పాఠ్యాంశాల్లోనూ రైతాంగ పోరాటం రజాకార్లకు మాత్రమే వ్యతిరేకం కాదని, దొరల ఆధిపత్యం, భూసంబంధిత సమస్యలతోనూ ముడిపడి ఉందని వివరించారు. అదే సమయంలో రజాకార్ల హింస, గ్రామాలపై దాడులు, ప్రజలపై జరిగిన దౌర్జన్యాలు కూడా నాటి చరిత్రలో కీలక భాగమే. అందువల్ల సెప్టెంబర్ 17ను అర్థం చేసుకోవాలంటే నిజాం పాలన, రజాకార్ల పాత్ర, భూస్వామ్య వ్యవస్థ, రైతాంగ సాయుధ పోరాటం, భారత ప్రభుత్వ సైనిక చర్య. అన్నింటినీ కలిపి చూడాల్సి ఉంటుంది.

**పోరాటంలో మతాలకు అతీతంగా భాగస్వామ్యం**
తెలంగాణ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు నాయకత్వం, ఆంధ్ర మహాసభ వంటి సంస్థల పాత్ర ఉంది. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి నాయకులతో పాటు మఖ్దూం మొహియుద్దీన్ వంటి ముస్లిం నాయకులు కూడా నిజాం వ్యతిరేక ఉద్యమంలో భాగమయ్యారు. అధికారిక తెలంగాణ విద్యా పాఠ్యాంశాలు కూడా మఖ్దూం మొహియుద్దీన్ పాత్రను ప్రస్తావిస్తున్నాయి. అందువల్ల నాటి పోరాటాన్ని కేవలం ఒక మతానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంగా ముద్ర వేయడం కంటే. ప్రజల హక్కులు, భూమి, భుక్తి, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వంటి అంశాల నేపథ్యంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ఆపరేషన్ పోలో ఏం జరిగింది?**
1947 ఆగస్టు 15న భారత్ స్వతంత్రం పొందినప్పటికీ హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో చేరలేదు. రాజ్యాంగ సభ చర్చల్లోనూ 1947 ఆగస్టు నాటికి హైదరాబాద్ భారత్‌లో చేరని ప్రధాన సంస్థానాల్లో ఒకటిగా నమోదైంది. ఈ పరిస్థితుల్లో రాజకీయ చర్చలు, ఉద్రిక్తతలు, రజాకార్ల కార్యకలాపాలు కొనసాగాయి. చివరకు 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్య ప్రారంభించింది. సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటుకు అంగీకరించడంతో సైనిక చర్య ముగిసింది. తెలంగాణ ప్రభుత్వ చరిత్ర పాఠ్యాంశాలు సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొంటున్నాయి. అయితే భారత సైన్యం ఎక్కడా నిజాం సేనతో యుద్ధం చేయలేదు అనే వాదన చారిత్రక రికార్డుతో సరిపోలదు. ఆపరేషన్ పోలో ఐదు రోజుల సైనిక చర్య కాగా, కొన్ని ప్రాంతాల్లో హైదరాబాద్ దళాల నుంచి ప్రతిఘటన చోటుచేసుకుంది. కాబట్టి దీనిని కేవలం రాజకీయ ఒత్తిడితో జరిగిన లొంగుబాటుగా మాత్రమే చెప్పడం కూడా పూర్తి చిత్రాన్ని ఇవ్వదు.

**సెప్టెంబర్ 17తో నిజాం పాలన పూర్తిగా ముగిసిందా?**
ఇక్కడే మరో చారిత్రక సంక్లిష్టత ఉంది. సెప్టెంబర్ 17 తర్వాత హైదరాబాద్ సంస్థానం భారత ఆధీనంలోకి వచ్చినప్పటికీ, నిజాం వెంటనే సాధారణ అర్థంలో పాలకుడుగా పూర్తిగా అంతరించిపోలేదు. భారత ప్రభుత్వ ఆధీనంలోని మార్పిడి వ్యవస్థలో ఆయన రాజ్‌ప్రముఖ్‌గా కొనసాగారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ భారత రాజ్యాంగ వ్యవస్థలో భాగమైంది. 1952లో ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడింది. అందువల్ల సెప్టెంబర్ 17ను ఒకే ఒక్క కోణంలో నిర్వచించడం కంటే. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లోకి వచ్చిన కీలక తేదీగా, తెలంగాణ ప్రజా పోరాటాల చారిత్రక మలుపుగా చూడటం మరింత సమగ్ర దృక్పథం.

**విలీనమా... విమోచనమా?**
విలీనం అనే పదం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరిన రాజకీయ రాజ్యాంగ పరిణామాన్ని ముందుకు తెస్తుంది. విమోచనం అనే పదం నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలు బయటపడిన భావనను ప్రతిబింబిస్తుంది. రెండు పదాల వెనుకా వేర్వేరు చారిత్రక, రాజకీయ దృక్పథాలున్నాయి. ఇదే కారణంగా తెలంగాణలో సెప్టెంబర్ 17కు వేర్వేరు పేర్లు వచ్చాయి. 2024లో తెలంగాణ ప్రభుత్వం దీనిని ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించింది. ప్రభుత్వం వెల్లడించిన వివరణలో విలీనం, విమోచనం అనే వివాదాలకు బదులుగా ప్రజల పాత్రను కేంద్రంగా ఉంచాలనే ఉద్దేశాన్ని పేర్కొంది.

**చరిత్రకు రాజకీయ రంగు ఎందుకు?**
సెప్టెంబర్ 17 చరిత్ర కంటే దానికి పెట్టే పేరు ఇప్పుడు రాజకీయ చర్చగా మారుతోంది. ఒక వర్గం విమోచన అనే పదాన్ని ముందుకు తెస్తే, మరో వర్గం విలీనం లేదా ప్రజా పాలన అనే పదాలను ప్రాధాన్యంగా చూస్తోంది. ప్రతి రాజకీయ శక్తి తన భావజాలానికి అనుగుణంగా ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది. ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. చరిత్రను గుర్తు చేసుకుంటున్నామా? లేక చరిత్రను రాజకీయంగా ఉపయోగించుకుంటున్నామా? నాటి పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన రైతులు, ఉద్యమకారులు, సామాన్య ప్రజల త్యాగాలను గుర్తు చేసుకోవడం ఒక అంశం. ఆ త్యాగాలను ప్రస్తుత రాజకీయ పోరాటాలకు అనుగుణంగా అన్వయించుకోవడం మరో అంశం. ఈ రెండింటినీ కలిపేస్తే చరిత్రపై అవగాహన కంటే రాజకీయ వాదోపవాదాలే మిగిలే ప్రమాదం ఉంది.

**నిజాం మాత్రమేనా ? దొరల వ్యవస్థ సంగతేంటి ?**
తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను పరిశీలిస్తే నిజాం పాలనతోపాటు గ్రామీణ భూస్వామ్య వ్యవస్థ, దొరల ఆధిపత్యం, వెట్టిచాకిరీ, భూమి సమస్యలు కూడా ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. తెలంగాణ ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కూడా రజాకార్లకు మద్దతుగా కొందరు దొరలు వ్యవహరించారని, రైతాంగ పోరాటం భూసంబంధిత మార్పుల కోసం కూడా కొనసాగిందని పేర్కొంటున్నాయి.
అందుకే నాటి చరిత్రను కేవలం ఒక మతం పాలన మరో మతం విముక్తి అనే సరళమైన సమీకరణంలో పెట్టడం చరిత్రలోని వర్గ, కుల, భూసంబంధిత వాస్తవాలను పక్కన పెట్టే అవకాశం ఉంది.

**చరిత్ర నుంచి నేర్చుకోవాల్సింది ఏమిటి?**
సెప్టెంబర్ 17 ఒక తేదీ మాత్రమే కాదు. అది రాచరికం నుంచి ప్రజాస్వామ్యానికి జరిగిన పరివర్తనలో కీలక మలుపు. రైతాంగ పోరాటం, ప్రజా ఉద్యమాలు, రజాకార్ల హింస, భారత సైనిక చర్య, నిజాం లొంగుబాటు, అనంతర పరిపాలనా మార్పులు.. ఇవన్నీ కలిసిన సంక్లిష్ట చరిత్ర. చరిత్రలో మంచి చెడు రెండూ ఉంటాయి. మంచి నుంచి స్ఫూర్తి పొందడం. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం ప్రజాస్వామ్య సమాజానికి అవసరం. కానీ చరిత్రను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా మలచడం మాత్రం భవిష్యత్ తరాలకు అసంపూర్ణమైన చిత్రాన్ని అందించే ప్రమాదం ఉంది.

**ప్రజలే అసలు కేంద్రబిందువు....**
సెప్టెంబర్ 17ను ఎవరు తమ రాజకీయ కార్యక్రమానికి ఉపయోగించుకున్నారు అన్నదానికంటే. నాటి పోరాటంలో సామాన్య ప్రజలు ఏం కోల్పోయారు? ఏం సాధించారు? వారి భూమి, భుక్తి, స్వేచ్ఛ, గౌరవం ఎంతవరకు సాధ్యమయ్యాయి? అనే ప్రశ్నలు మరింత ప్రాధాన్యం కలిగినవి. చరిత్రను ఎవరికి అనుకూలంగా వారు చెప్పుకోవచ్చు. పేర్లు వేరైనా రాజకీయ భాష్యాలు మారినా సెప్టెంబర్ 17కు ఉన్న చారిత్రక ప్రాధాన్యం మాత్రం మారదు.
నాటి పోరాటానికి నిజమైన గౌరవం.. చరిత్రను వక్రీకరించకుండా చెప్పడంలోనే ఉంది. ప్రజల త్యాగాలను రాజకీయ లాభనష్టాల తూకంలో వేయకుండా గుర్తు చేసుకోవడంలోనే ఉంది. సెప్టెంబర్ 17ను రాజకీయ పోటీకి మరో అస్త్రంగా మార్చడం కంటే ఆ రోజు దిశగా సాగిన ప్రజా పోరాటం, రైతాంగ ఆకాంక్షలు, ప్రజాస్వామ్య స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి అంశాలను భావితరాలకు పరిచయం చేయడం చరిత్రకు ఇచ్చే అసలైన గౌరవం.



గణేష్ పంచమి
(జర్నలిస్ట్) 8106225117

# ప్రజాధనం వృథాపై విచారణకు ఎందుకు జాప్యం?

- సర్వారం పంచాయతీలో బిల్లులపై ఆరోపణలు.. నెలలు గడుస్తున్నా కొలిక్కిరాని విచారణ?
- జిల్లా పంచాయతీ అధికారి వైఖరిపై ప్రజల్లో అనుమానాలు.. కలెక్టర్ జోక్యానికి డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 16
(వుదయం ప్రతినిధి)

సుజాతనగర్ మండలం సర్వారం గ్రామపంచాయతీలో ప్రజాధనం వృథా అవుతోందంటూ గతంలో వెలువడిన కథనంపై ఇప్పటివరకు పూర్తిస్థాయిలో విచారణ ఎందుకు జరగలేదనే ప్రశ్నలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. పంచాయతీ నిధుల వినియోగం, పనులకు సంబంధించిన బిల్లులు, ఖర్చుల వివరాలపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.
గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించే నిధులు ప్రజల సొమ్ము కావడంతో వాటిని నిబంధనల ప్రకారం ఖర్చు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అయితే వాస్తవంగా చేసిన ఖర్చుకు సంబంధం లేకుండా తక్కువ మొత్తాలతో బిల్లులు సమర్పించారా? నిబంధనలకు విరుద్ధంగా ఖర్చులు జరిగాయా? బిల్లుల రూపకల్పనలో ఏమైనా అవకతవకలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**నెలలు గడుస్తున్నా విచారణ ఎందుకు పూర్తికాలేదు?**
ఈ వ్యవహారంపై సంబంధిత జిల్లా పంచాయతీ అధికారిని ప్రశ్నించిన ప్రతిసారీ ఏదో ఒక కారణంతో సమయం తీసుకుంటున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అసలు ఈ అంశంపై అధికారికంగా విచారణ ప్రారంభించారా? ప్రారంభించి ఉంటే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? విచారణ పూర్తయిందా? అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.
ప్రజాధనానికి సంబంధించిన ఆరోపణలపై విచారణలో జాప్యం ఎందుకు జరుగుతోంది? విచారణను ముందుకు తీసుకెళ్లడంలో ఏమైనా కారణాలు ఉన్నాయా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల అండదండలున్నాయా?**
బిల్లుల విషయంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు నిజమైతే, సంబంధిత వ్యక్తులకు అధికారుల అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు కూడా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవి ప్రస్తుతం ప్రజల్లో వినిపిస్తున్న ఆరోపణలు, అనుమానాలు మాత్రమేనని, వాటి వాస్తవికత సమగ్ర విచారణలోనే తేలాల్సి ఉందని పలువురు పేర్కొంటున్నారు.



బిల్లులు, పనుల వివరాలు, చెల్లింపుల పత్రాలు, సంబంధిత రికార్డులను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని ప్రజలు అంటున్నారు. విచారణ జరపకుండా జాప్యం చేయడం వల్ల అనుమానాలకు మరింత అవకాశం కలుగుతోందని వారు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజాధనంపై అధికారుల బాధ్యత ఏమిటి?**
ప్రజాధనం వృథా కాకుండా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత అని స్థానికులు పేర్కొంటున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని పక్కనపెట్టకుండా, సంబంధిత రికార్డులను పరిశీలించి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.. ఆరోపణలు నిరాధారమైతే విచారణ ద్వారా ఆ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలి అని ప్రజలు కోరుతున్నారు.

**కలెక్టర్ జోక్యానికి ప్రజల డిమాండ్**
సర్వారం గ్రామపంచాయతీకి సంబంధించిన ప్రజాధనం వినియోగంపై వచ్చిన ఆరోపణలను జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత అధికారుల నుంచి పూర్తి నివేదిక తెప్పించాలని ప్రజలు కోరుతున్నారు. బిల్లులు, పనుల వాస్తవ పరిస్థితి, ఖర్చుల వివరాలు, చెల్లింపుల ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారి ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచుతారా? లేక విచారణ పేరుతో మరింత జాప్యం చేస్తారా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.
ప్రజాధనం దుర్వినియోగం కాలేదని నిర్ధారణ అయితే ఆ విషయాన్ని స్పష్టంగా వెల్లడించాలని, ఏదైనా అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం విషయంలో పారదర్శకతే ముఖ్యమని, విచారణను ఇకనైనా త్వరితగతిన పూర్తి చేసి నిజానిజాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.

**డిపిఓ అనూష వివరణ చరవాణిలో కోరగా...**
సర్వారం గ్రామపంచాయతీ నిధులపై వచ్చిన కథనానికి విచారణ జరిగిందా అనే విషయాన్ని డిపిఓ అనూషను వివరణ కోరగా వారు మాట్లాడుతూ మీటింగ్ లో ఉన్నాను అంటూ సమాధానం ఇచ్చారు. గత కొన్ని రోజుల కిందట చరవాణిలో వివరణ కోసం ప్రయత్నించగా విచారణకు సమయం పడుతుందంటూ సమాధానం ఇవ్వడం నెల రోజులు గడిచిపోయిన విచారణ కొలికి రాకపోవడం గమనార్హం.



# జైబోలో గణేష్ మహారాజ్ కి జై

- పిప్రి గ్రామంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వినాయక పూజలో మున్సిపల్ చైర్మన్

నారాయణఖేడ్ సెప్టెంబర్ 16(వుదయం)

నారాయణఖేడ్ మండల పరిధిలోని పిప్రి గ్రామంలో గ్రామ సర్పంచ్ మారుతి పటేల్ ఆహ్వానం మేరకు వినాయక చవితి వేడుకల్లో నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్ షెట్కర్ పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున భార్యాభజంత్రీలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామంలోని హనుమాన్ మందిరంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తితో పూజలు నిర్వహించారు, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్, గ్రామ పెద్దలు కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జ్ఞాన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చందర్ నాయక్, ఉపసర్పంచ్ వెంకట్ నాయక్, వర్డ్ నెంబర్లు, గ్రామప్రజలు వడ్ల నాగయ్య, పలు మండపల నిర్వహికులు తదితరులు పాల్గొన్నారు.

# పురాణ ఘట్టాలతో ఆకట్టుకుంటున్న స్వకులశాలి సమాజ వినాయక మండపం



- 53 ఏళ్లుగా వినూత్న అలంకరణలు..
- చిన్నారులకు పురాణ పరిచయం

గద్వాల సెప్టెంబర్ 16
(వుదయం కరస్పాండెంట్)

గద్వాల పట్టణంలోని శ్రీ పాండురంగ స్వామి ఆలయ స్వకులశాలి సమాజం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని 53 ఏళ్లుగా వినూత్న రీతిలో వినాయక మండపాలను అలంకరిస్తున్నారు. 1971లో గద్వాల మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు పాగా పుల్లారెడ్డి ఆధ్వర్యంలో గద్వాలలో తొలిసారిగా వినాయక చవితి వేడుకలు ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. 1973 నుంచి శ్రీ పాండురంగ స్వామి ఆలయ స్వకులశాలి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విభిన్న పురాణ ఘట్టాలను ప్రతిబింబించేలా మండపాలను అలంకరిస్తున్నారు. మహాభారతం, భాగవతం తదితర ఇతిహాసాలు, పురాణాల్లోని ముఖ్యమైన ఘట్టాలను కళ్లకు కట్టినట్లు మండపాల్లో ఏర్పాటు చేస్తూ చిన్నారులు, యువతతో పాటు ప్రజలకు మన పురాణాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నారు. పురాణ కథలను అందరికీ సులభంగా అర్థమయ్యేలా సన్నివేశాలను రూపొందించడంలో నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఏడాది స్వకులశాలి యువజన సంఘం అధ్యక్షుడు కాంబ్లే శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'అమృత భాండం కోసం దేవతలు-దానవులు క్షీరసాగరాన్ని మథించిన ఘట్టం'ను వినూత్నంగా రూపొందించారు. ఆకట్టుకునే రీతిలో రూపొందించిన ఈ అలంకరణ గద్వాల పట్టణ ప్రజలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమంలో స్వకులశాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడు దేవుజి రాఘవేందర్, కార్యదర్శి సాక్రె శ్రీనివాస్, దోత్రే సురేంద్రబాబు, కార్యవర్గ సభ్యులు గణప నరేందర్, కాంబ్లే ప్రవీణ్, గచ్చి వీరన్న, దోత్రే ప్రమోద్, సఫారీ అజయ్, సఫారీ సురేష్, జిందే కార్తీక్ తదితర కుల బాంధవులు, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి NHAI హామీ

- భారత్‌మాల సిక్స్‌లైన్ హైవేలో ఎంట్రీ–ఎగ్జిట్ సదుపాయాలపై అధికారులకు వినతి

రాజోలి సెప్టెంబర్ 16
(వుదయం కరస్పాండెంట్)



భారత్‌మాల సిక్స్‌లైన్ హైవే నిర్మాణంతో రాజోలి గ్రామ రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముందడుగు పడింది. ఈ మేరకు రాజోలి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహబూబ్‌నగర్‌లో NHAI ప్రాజెక్టు డైరెక్టర్ బన్సల్‌ను కలిసి సమస్యలను వివరించారు. రాజోలి గ్రామం మీదుగా వెళ్తున్న భారత్‌మాల సిక్స్‌లైన్ హైవే కారణంగా రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఎంట్రీ, ఎగ్జిట్ సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. రైతుల సమస్యలను సానుకూలంగా విన్న ప్రాజెక్టు డైరెక్టర్ బన్సల్, త్వరలోనే సంబంధిత అధికారిని రాజోలి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజోలి గ్రామ సర్పంచ్ సి. గంగిరెడ్డి, జోగులాంబ గద్వాల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వై. ఎల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు దస్తగిరి, రాజోలి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. హసన్, శ్రీ వైకుంఠ నారాయణ స్వామి దేవాలయ ధర్మకర్త ఏ. గోపి తదితరులు పాల్గొన్నారు. రాజోలి రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు, గ్రామ ప్రజలకు సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

# సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ

గద్వాల సెప్టెంబర్ 16
(వుదయం కరస్పాండెంట్)



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిశిక పాత్రుడు ఆధ్వర్యంలో జిల్లా సైబర్ నేరాల నివారణ బృంద సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా "క్లిక్ చేసే ముందు ఆలోచించండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అనుమానాస్పద అంతర్జాల అనుసంధానాలు, సందేశాలు, ఫోన్ కాల్స్ లేదా అంతర్జాల ఆఫర్లకు స్పందించే ముందు వాటి నిజానిజాలను నిర్ధారించుకోవాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, రహస్య సంకేతాలు, ఒకసారి మాత్రమే ఉపయోగించే ధృవీకరణ సంకేతాలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. పిల్లలు, యువత సామాజిక మాధ్యమాలు మరియు అంతర్జాల ఆటలను బాధ్యతాయుతంగా వినియోగించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని సమావేశంలో పిలుపునిచ్చారు.
సురక్షితమైన, బాధ్యతాయుతమైన అంతర్జాల వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో జిల్లా సైబర్ నేరాల నివారణ బృంద సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సూచించారు.



# గ్రేటర్ హైదరాబాద్





## తల్లారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**చేవెళ్ల,సెప్టెంబర్ 16 (వుదయం)**
చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం గ్రామపంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మీ ప్రసన్న శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత సులభంగా రేషన్ సేవలు అందనున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామఉప సర్పంచ్ మొహమ్మద్ నవాజ్,సెక్రెటరీ మహమ్మద్ రోషన్,వార్డ్ నెంబర్ బోర్ర రమేష్,బోర్ర సంజీవ గ్రామ మహిళలు రేషన్ లబ్ధిదారులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన





**చేవెళ్ల,సెప్టెంబర్ 16 (వుదయం)**
వినాయక నిమజ్జనాలను పురస్కరించుకుని చేవెళ్లలో అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.ఇందులో భాగంగా చేవెళ్ల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పుష్కరిణిని డీసీపీ యోగేష్ గౌతమ్,చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి బుధవారం పరిశీలించారు.వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పుష్కరిణి వద్ద భక్తులు,
నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వారు దృష్టి సారించారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.పుష్కరిణి పరిసరాల్లో భద్రత, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భక్తుల రద్దీ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు పోలీసు శాఖ తరపున అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## TPCC–INTUC లేబర్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భానూరి శివశంకర్ గౌడ్

**చేవెళ్ల,సెప్టెంబర్ 16 (వుదయం)**
రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం TPCC-INTUC లేబర్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భానూరి శివశంకర్ గౌడ్ నియమితులయ్యారు.రాష్ట్ర TPCC-INTUC లేబర్ సెల్ చైర్మన్ రాంబ ప్రకాష్ గౌడ్, వైస్ చైర్మన్ నల్లా సంజీవరెడ్డి సంయుక్తంగా ఆయనను నియమించారు.ఈ నియామకంపై చేవెళ్ల ప్రాంత కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా భానూరి శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినాయకత్వానికి, TPCC-INTUC నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ప్రోత్సహించిన రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు,జిల్లా



INTUC నాయకురాలు జ్యోతి భీమ్ భరత్,రాంబ ప్రకాష్ గౌడ్, నల్లా సంజీవరెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెనా భీమ్ భరత్, తోలుకట్ట గ్రామ యూత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శివశంకర్ గౌడ్ తెలిపారు.

## రూ.80 లక్షల లాభాల్లో పాక్స్ సొసైటీ



**హైదరాబాద్ సెప్టెంబర్ 16 (వుదయం)**
గత ఆర్థిక సంవత్సరం సామాజిక ఆడిట్ లో నా వంద్గి పాక్స్ సొసైటీ రూ.80 లక్షల అభివృధి సాధించిందని పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాం రెడ్డి అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గంతో కలిసి సర్వసభ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల రైతులకు రాయితీలో విత్తనాలు, యూరియా, డీఎపి సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీఏ సీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సొసైటీ సీఈవో రాతపూర్వకంగా లేఖ అందించారు.
ఈ విషయంపై పాలకవర్గ డైరెక్టర్లతో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సీఈవో సిబ్బంది పాల్గొనడం జరిగింది

## ప్రజా మౌలిక వసతులకై ప్రాథమిక ప్రణాళిక

### తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ మరియు రోడ్లు అంశాలకు ప్రథమ ప్రాధాన్యత..

- **ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దు..**
- **ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు రూపకల్పన..**
- **పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి..**
- **క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి..**
- **త్వరలో నూతన సబ్ స్టేషన్లు ప్రారంభం**
- **ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయండి..**
- **పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **నియోజకవర్గస్థాయి ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం**

ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన తాగునీరు సరఫరా, నిరంతర విద్యుత్ పంపిణీ, పారిశుధ్యం, రోడ్లు తదితర అంశాల్లో అలసత్వం వహించవద్దని.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నత అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. బుధవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్, పటాన్చెరు బల్దియా డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్లు, విద్యుత్, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల శాఖల అధికారులతో వివిధ అంశాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో



అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో 345 కోట్ల రూపాయలతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కిష్టారెడ్డిపేట, అమీన్పూర్, తెల్లాపూర్ పరిధిలో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు తరగతులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధునిక వసతులు.. అత్యాధునిక సౌకర్యాలతో వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా పవర్ ట్రాన్స్ఫార్మర్లు, నూతన సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో పోచారం, లకడారం సబ్ స్టేషన్లు ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. నూతన కాలనీలలో పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరుకున్న స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని.. అవసరమైతే సొంత నిధులతో స్తంభాలు కొనుగోలు చేసి ఇస్తానని అధికారులకు తెలిపారు. అమీన్పూర్,పటాన్చెరు సర్కిళ్ల పరిధిలోని ప్రతి వార్డులో



ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. టెండర్లు పూర్తయి శంకుస్థాపన చేసిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు.. అవసరమైతే బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. పన్ను సవరణ అంశంలో ప్రజలకు భారం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసినప్పుడే ప్రజల నమ్మకాన్ని పొందుతామని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని.. అభివృద్ధిలో కలిసి పనిచేయాలని కోరారు.ప్రభుత్వ శాఖల అధికారులు ప్రతి నెలకు ఒకసారి అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహిస్తూ.. సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు.
ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని.. నిధుల కొరత ఉంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డు నిర్మాణం

- **ఆర్గానో విల్లా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి**
- **చేవెళ్ల ఆర్డీఓకు ఆలూరు గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధుల ఫిర్యాదు**

**చేవెళ్ల,సెప్టెంబర్ 16 (వుదయం)**
చేవెళ్ల మండలం పరిధిలోని ఆలూరు గ్రామ ఆర్గానో విల్లాస్ నిర్మాణం పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టారని గ్రామపంచాయతీ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు చేవెళ్ల ఆర్డీఓ పార్థసింహారెడ్డికి ఫిర్యాదు చేశారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆలూరు గ్రామంలోని సర్వే నంబర్లు 304, 305 306లో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఆర్గానో పేరుతో విల్లాల నిర్మాణం జరుగుతోందని, గ్రామపంచాయతీ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోలేదని తెలిపారు.ప్రభుత్వానికి, గ్రామపంచాయతీకి రావాల్సిన 10 శాతం ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేయకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో పంచాయతీ ఆదాయం కోల్పోతుందని తెలిపారు.అలాగే హెచ్ఎండీఏ నుంచి సుమారు 5 ఎకరాలకు మాత్రమే నాలా కన్వర్షన్ అనుమతులు తీసుకుని, 50 ఎకరాల్లో విల్లాల నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేశారు అని చెప్పారు. ఆర్గానో విల్లాస్ కోసం సుమారు ఎకరం ప్రభుత్వ భూమిని ఆక్రమించి,అందులో నుంచి అక్రమంగా రోడ్డు నిర్మించారని గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు తెలిపారు.అంతేకాకుండా కాలువలను సైతం ఆక్రమించి నీటి ప్రవాహాన్ని మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విషయంపై ప్రశ్నించినప్పుడు నిర్వాహకుల నుంచి బెదిరింపులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు.

తమ వెనుక పెద్ద వ్యక్తులు ఉన్నారని, ఆర్గానో వ్యవహారంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు.కాలువ మూసివేతపైనా ఫిర్యాదు ఆర్గానోకు సమీపంలోని ఐ గార్డెన్ వెంచర్ కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన శిలాఫలకాన్ని పక్కకు తొలగించిరోడ్డు విస్తరణ చేపట్టారు.అలాగే గ్రామపంచాయతీకి కేటాయించిన 10 శాతం భూమి నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు.మీర్జాగూడ



నుంచి ఆలూరు రెవెన్యూ పరిధిలో ఉన్న ఏళ్లనాటి కాలువను మూసివేసి సుమారు 40 అడుగుల రోడ్డు నిర్మించారని వారుతెలిపారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలు నిజమని తేలితే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఆర్డీఓను కోరారు.

## చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థుల మృతి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (వుదయం) :**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో పాల్గొనేందుకు నేరేడు చెరువు వద్దకు వెళ్లిన ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఉత్సాహంగా సాగిన నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన విద్యార్థులు చెరువు లోతు తెలియక నీటిలోకి దిగి గల్లంతయ్యారు. గమనించిన గ్రామస్థులు వెంటనే చెరువులోకి దిగి రక్షణ చర్యలు చేపట్టి, వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే వారు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతులను నరసింహ (21), తేజ (17), సిద్ధార్థ (17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)లుగా అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు మృత్యువాత పడటంతో ఆయా కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. ఈ ఘోర ప్రమాదంపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఘటన జరిగిన తీరుపై జిల్లా కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్‌లతో ఫోన్లో సమీక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న తరుణంలో పోలీస్, రెవెన్యూ యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. నిమజ్జన ఘాట్లు, నీటి వనరుల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, ముఖ్యంగా చిన్న పిల్లలు, విద్యార్థులు ప్రమాదకరమైన లోతు ప్రాంతాల్లోకి వెళ్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించారు.






## ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ గణనాథుడికి ప్రత్యేక పూజలు

**జిన్నారం సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి)**
గడ్డపోతారం మున్సిపల్ కేంద్రంలోనీ చెట్ల పోతారంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటుచేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గణేష్ మండపంలో యువకులు భక్తిశ్రద్ధలతో రాత్రి వేళల్లో భజన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. గణనాథుడిని స్థానిక నాయకులు పట్టణ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు చిన్నారులు పాల్గొన్నారు.




## బై బై 'ప్రతిభ' ఎకో ఫ్రెండ్లీ గణేశా

- **భక్తిశ్రద్ధలతో అక్కమ్మ చెరువులో నిమజ్జనం**

**జిన్నారం సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి)**
జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 'ప్రతిభ ఎకో ఫ్రెండ్లీ గణేశా' నిమజ్జనోత్సవాన్ని బుధవారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.
ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ నేతృత్వంలో విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ప్రధాన వీధుల గుండా ఆడుతూ పాడుతూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ పాఠశాలలో ఎకో ఫ్రెండ్లీ గణేశుడిని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఐక్యతకు నిదర్శనాలని పేర్కొన్నారు
. 'బై బై ఎకో ఫ్రెండ్లీ గణేశా', 'గణపతి బప్పా మోరియా.. అగలే బరస్ తూ జల్దీ ఆ' అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక అక్కమ్మ చెరువులో ప్రత్యేక పూజలు నిర్వహించి 'బై బై ప్రతిభ ఎకో ఫ్రెండ్లీ గణేశా' అంటూ గణనాథుడిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విభూది అలంకారంలో జిన్నారం సిద్ధి బుద్ధి గణపతి

**జిన్నారం సెప్టెంబర్ 16(వుదయం ప్రతినిధి)**
జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని మరకత జీవన జ్యోతిర్లింగంగా శివాలయం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ బుక్క శ్రీకాంత్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం సిద్ధి బుద్ధి గణపతి స్వామివారు విభూది అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కిటకిటలాడింది.



**IN THE COURT OF HON'BLE V-JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**OS.NO.641 OF 2026**
**Between :**
1. Mrs.Sunkara Kanaka Durga Rani, W/o. Late Mr. Sunkara Siva Rama Krishna Prasad, A/o. 65 years, R/o. 8-4-300/3 and 3/1, Flat No.3502, Vasavi Brindavanam, Fathe Nagar. Erragadda, Sanathnagar, Hyderabad Telangana-500018. 2. Mrs. Sunkara Suneetha, D/o. Late Mr. Sunkara Siva Rama Krishna Prasad, A/o. 46 years, R/o. 2-140, Plot No.16 &17, Bhavani Residency, Chinna Avutapalli,Gannavaram Mandal, Chinna Avutapalli, Krishna District, Andhra Pradesh-521286. Also presently residing at, 22325 Valencia Dr, Little Elm Texas - 75068 3. Mrs. Sunkara Sowmini, D/o. Late Mr. Sunkara Siva Rama Krishna Prasad, A/o. 45 years, R/o. 8-3-677/33 Sri Krishnadevaraya Nagar, HDFC Bank ATM, Yellareddyguda, Hyderabad, Telangana - 500073 4. Mrs. Kolasani Mallika, D/o Late Mr. Sunakara Siva Rama Krishna Prasad, A/o. 43 Years, R/o. 8-4-300/3, Tower-3, F.No-3604, Vasavi Brindavanam, Hydera bad,Telangana-500018. ...Plaintiffs
**AND**
1. The Tehsildar, Khairthabad Mandal, Hyderabad District.
2. ALL CONCERNED ...Defendants
To
The above named Plaintiffs have filed the above Original Suit bearing O.S.No.641 OF 2026 on the file of the HON'BLE COURT OF THE V-JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD for Declaration of Legal Heirs. Please take notice that the above O.S is stands posted to 21-09-2026 for your appearance in person or through Counsel, the above suit will be heard and determined accordingly.
**(BY ORDER OF THE HON'BLE COURT)**
Hyderabad
17-09-2026
**Sd/-**
**ADAPA V SUBBARAYUDU**
**ADAPA LAKSHMIKANTAM,**
**Advocates**
**FINNLEX LAW LLP**
**#403, 4TH Floor, Aaltos A&M Trade center, Himayath Nagar Hyderabad-29**
**Ph. No. 9908099555**

**IN THE COURT OF HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.No. 2547 OF 2026**
**Between :**
1. Smt.Moodi Blessy Johnson @ P.S. Blessy, W/o. Late Moodi Devadoss Johnson, D/o. Late P.E Solomon, Aged about 68 years, Occ: Rtd. BSNL Employee, R/o. H.No.1-1-461 to 465, Flat No. 202, Sravanthi Aprts., Gandhinagar, Hyderabad, Telangana State – 500080. Cell.No.9492849787. Adhaar No. 5578 4763 4367. 2. Smt. M.Evelyn Deepika Johnson @ Kaddi Evelyn Deepika Kesari, W/o. Kaddi Ravi Kesari, D/o. Late Moodi Devadoss johnson @ M D johnson, Aged about 45 years, Occ: House Wife, R/o. H.No.1-1-461 to 465, Flat No. 202, Sravanthi Aprts., Gandhinagar, Hyderabad, Telangana State – 500080 Present Residing At: Flat No. 610, F- Block, Shanta Sriram Satelite Township, Pipeline Road, Opp: Konark Hospital, Pet Basheerabad, Jeedimetla, K.V.Ranga Reddy, Telangana State – 500067. Adhaar No. 8824 6418 6722. 3. M.Avinash Johnson @ Moodi Avinash Johnson S/o. Late Moodi Devadoss Johnson @ M D Johnson, Aged about 43 years, Occ: Pvt. Employee R/o. H.No.1-1-461 to 465, Flat No. 202, Sravanthi Aprts., Gandhinagar, Hyderabad, Telangana State – 500080 Cell.No.9885699214, Adhaar No. 7916 7583 9817. ....Plaintiffs
**AND**
1. The Tahasildar,
Musheerabad Mandal, Hyderabad.
2. ALL CONCERNED ...Defendants
To
All Concerned
Please take Notice that, the above said Plaintiffs have filed the Suit for Declaration to declare the Plaintiffs are the Legal Heirs of Late Moodi Devadoss Johnson @ M D Johnson in which if any person or persons having any claim, interest or objections they may appear before the above said court on 21/9/2026, at 10.30 a.m., as such please make it convenient to attend either in person or through an Advocate, failing which, the matter will be decided Ex-parte.
// BY ORDER OF THE COURT //
Hyderabad,
Date: 17-09-2026
**Sd/- M/s. N.NISHIKANTH VARMA, TS/1489/2013 (22565), ADVOCATE.**
**Office at: H.No.2-2-1108/1 & 1/A, Flat No.305, 3rd Floor, Sagacity Heights Aprts., Tilaknagar 'X' Road, Nallakunta, Hyderabad-500044,**
**Cell No. 9550294502, 9398215982,**
**Email Id: nishikanth219@gmail.com.**
**Counsel for Plaintiffs**




అతడు నాకో అదృష్టం.. వరం...

"సూర్యతో ఇరవై ఏండ్ల వైవాహిక జీవితం ఎంతో ఆనందంగా, సంతృప్తిగా ఉంది. ఈ సమయంలో త్యాగాలు, సర్దుబాట్లు, నిస్వార్థంగా ప్రేమించుకునేందుకు.. ఒకరికోసం మరొకరు మారిన వ్యక్తిత్వాలకు ప్రతీకగా వేడుక చేసుకుంటున్నాం. రెండు దశాబ్దాల ప్రేమ, గిల్లికజ్జాలకు గుర్తుగా మేం గతంలో చేసుకున్న వాగ్దానాలను పునరుద్ధరించుకుంటున్నాం. మనం ప్రేమించే వ్యక్తి మనకంటే ఎక్కువగా మనల్ని గౌరవించటమనేది జీవితంలోనే ఓ గొప్ప బహుమతి."

**- జ్యోతిక, ప్రముఖ నటి**

## వే'మన' పద్యం



**వేరుపురుగుచేరి వృక్షంబుజెఱచును**
**చీడ పురుగు జేరి చెట్టుఁజెఱచుఁ**
**కుత్సితుండు చేరి గుణవంతుఁజెఱచురా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

# సంపాదకీయం

## భారతరత్నకే నోటీసులా...?

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పౌర పురస్కారం భారతరత్న. దేశానికి, సమాజానికి వివిధ రంగాల్లో అందించిన అసాధారణ సేవలకు ఇచ్చే అత్యున్నత గుర్తింపు. అలాంటి గౌరవాన్ని అందుకున్న ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావుకు 'సర్' నోటీసులు రావడం దిగ్భ్రాంతికరం. తొంభై రెండేళ్ల వయసులో భారత శాస్త్ర రంగానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన మహోన్నత శాస్త్రవేత్త పేరు ఓటర్ల జాబితాలోని పాత రికార్డుతో సరిపోలలేదనే కారణంతో సమస్యాత్మకంగా మారడం ఎన్నికల సంఘం పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. దేశవ్యాప్తంగా చర్చకు దారితీయడంతో కర్ణాటక ఎన్నికల సంఘం తప్పును ఎలా సరిచేయాలో మల్లగుల్లాలు పడుతోంది. మొదట ఆయన పేరు తప్పుగా ఉందని చెప్పి, ఇప్పుడు నోటీసులే ఇవ్వలేదని బుకాయిస్తోంది. కానీ ఆయన పేరు 'డిస్క్రెపెన్సీ' జాబితాలోకి ఎలా వచ్చిందన్న ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. సి.ఎన్.ఆర్.రావు 'నేను భారత పౌరుడినే' అని నిరూపించుకోవాలా? 'నాకు భారతరత్న కూడా ఇచ్చారు, నన్ను గుర్తించండి' అంటూ వేడుకోవాలా? అసలు 'సర్' పేరుతో ఏం జరుగుతోంది దేశంలో? సి.ఎన్.ఆర్.రావు ఒక వ్యక్తి మాత్రమే కాదు. నిర్మాణాత్మక రసాయన శాస్త్రం, పదార్థాల శాస్త్రంలో ఆయన చేసిన పరిశోధనలు భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చాయి.

దేశంలో శాస్త్ర పరిశోధనా సంస్థల అభివృద్ధికి, కొత్త తరాల శాస్త్రవేత్తల తయారీకి ఆయన చేసిన సేవలు అపారం. అందుకే దేశం 2014లో ఆయనను భారతరత్నతో గౌరవించింది. అలాంటి వ్యక్తి పేరు ఒక చిన్నపాటి రికార్డు తేడాతో అనుమానాల జాబితాలోకి రావడం భారతరత్న గౌరవానికే అవమానం. ఇక్కడ ప్రముఖులు, చిన్నవారు, పెద్దవారు అందరూ సమానమే కదా అన్న ప్రశ్న వస్తుంది. కానీ, అస్సాంలో 'సర్' చేపట్టిన ప్పుడు మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యాలను ఏరివేయడానికేనని కేంద్రం చెప్పింది. పద్మశ్రీ గ్రహీత హరేకళ హజబ్బా, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకణి కుటుంబం, జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ తదితర ప్రముఖుల పేర్లు కూడా 'సర్'లోని డిస్క్రెపెన్సీ లేదా మ్యాపింగ్ సమస్య ల్లో చిక్కుకున్నాయి. హైదరాబాద్‌లో మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, నటుడు మహేశ్ బాబు, తదితరులకు 'సర్' నోటీసులు వచ్చినట్లు తాజా సమాచారం. ప్రముఖుల పేర్లు బయటకు రావడంతో ఈ వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది.

ఇదంతా 'సర్' దుశ్చర్యలో ఓ భాగం మాత్రమే. అసలు సమస్య సామాన్య ఓటర్లది. కర్నాటకలోనే 43.81 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. పేరు మారడం, పాత రికార్డుతో వివరాలు సరిపోకపోవడం వంటి కారణాలతో పౌరులు తమ గుర్తింపును పదేపదే నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పత్రాలు అందజేసినా రశీదు ఇవ్వడం లేదని పలువురి ఆందోళనగా ఉంది. తెలంగాణలోనూ భారీ స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం, ఇప్పటికే లక్షలాది పేర్లు తొలగింపు, మరికొందరికి నోటీసుల ప్రక్రియ ప్రజల్లో అను మానాలకు తావిస్తోంది. ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయడం అవసరమే. నకిలీ ఓట్లను తొలగించాల్సిందే. కానీ ఆ పేరుతో అసలైన ఓటర్లను తొలగించడం లేదా తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పౌరులే అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి తలెత్తడం మాత్రం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. 'సర్' ప్రారంభానికి ముందే ఢిల్లీ ఎన్నికల సమయంలో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారన్నది ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నది. ఇప్పుడు వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలపై తలెత్తుతున్న వివాదాలు చూస్తే 'సర్'ను కేవలం సాంకేతిక ప్రక్రియగా కొట్టిపారేయలేం. ముస్లింలు, దళితులు, గిరిజనులు, వలస కార్మికులు, పేదలు, బీజేపీ వ్యతిరేకులను లక్ష్యంగా చేసుకుని ఓట్లను ఏరి మరీ తీసేస్తున్నట్టు తెలుస్తోంది. కారణంగా ఏదో ఒక తప్పును వెతికి, దానికి కావాల్సిన ఆధారాలు చూపించమనడం వారిని ఓటుకు దూరం చేసే ఎత్తుగడనే! ఎన్నికల సంఘం కూడా దీనికి వంతపాడే విధానాలే అవలంభిస్తోందన్నవి 'సర్' ప్రారంభం నుంచి వస్తున్న విమర్శలే. దాని చర్యలు, నిర్ణయాలు ప్రతిపక్షాల్లోనే కాదు, ప్రజల్లోనూ అనుమానాలు కలిగిస్తున్నాయి. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా, ఒక తొత్తులా వ్యవహరిస్తోందన్న విమర్శలకు తావివ్వకుండా తన స్వతంత్రతను నిరూపించుకోవడంలో అది విఫలమవుతోంది. అందుకే రాజ్యాంగబద్ధ సంస్థగా ఈసీపై ఉన్న విశ్వాసాన్ని కాపాడుకోవడం, ఓటర్లలో అభద్రతను తొలగించడం అత్యంత అవసరం. 'సర్' ప్రజాస్వామ్యాన్ని మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చే ప్రక్రియ కావాలి. కానీ అదే ప్రక్రియలో ఓటరే తన పౌరసత్వాన్ని, తన ఉనికిని, తన ఓటు హక్కును నిరూపించుకోవాల్సి వస్తే అది ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. భారతరత్న పొందిన శాస్త్రవేత్తకే తన పేరు నిరూపించుకోవాల్సిన పరిస్థితి వస్తే, సామాన్య ఓటరు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తప్పక తలెత్తుతుంది. ఓటరు జాబితాను శుద్ధి చేయడమే కాదు, ఓటు హక్కును కాపాడటమే ఎన్నికల సంఘం మొదటి బాధ్యత.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# వ్యక్తిగత స్వేచ్ఛ భద్రత

చట్టం మారుతున్న సమాజంతో పాటు నడుస్తుందా.. లేక సమాజం ముందుకు పరిగెడుతుంటే చట్టం ఇంకా పాత ప్రశ్నల దగ్గరే ఆగిపోతుందా? వ్యక్తిగత స్వేచ్ఛ నుంచి ప్రభుత్వ అధికారాల వరకు.. సాంకేతికత నుంచి ప్రజా భద్రత వరకు చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈ ప్రశ్నను బలంగా ముందుకు తెస్తున్నాయి. వివాహంలో సమ్మతి హక్కుపై సుప్రీంకోర్టు విచారణ వ్యక్తిగత గౌరవం, స్వేచ్ఛకు సంబంధించిన రాజ్యాంగ విలువలను చర్చకు తెస్తోంది. నిరోధక నిర్బంధంపై అలహాబాద్ హైకోర్టు తీర్పు ప్రభుత్వ అధికార వినియోగంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఎర్రకోట పేలుడు దర్యాప్తులో సాంకేతిక వేదికల వినియోగం భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లను చూపిస్తోంది. అంశాలు వేర్వేరు అయినా ముందున్న ప్రశ్న ఒక్కటే. చట్టం ఇచ్చిన అధికారం ఎంతవరకు.. పౌరుడి హక్కుకు రక్షణ ఎక్కడివరకు?

వివాహ బంధంలో వ్యక్తిగత స్వేచ్ఛకు, సమ్మతి హక్కుకు ఎలాంటి స్థానం కల్పించాలి అనేది దేశవ్యాప్తంగా ప్రాధాన్యం పొందుతున్న న్యాయ ప్రశ్న. 2026 సెప్టెంబర్ 9న ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వైవాహిక అత్యాచారానికి సంబంధించిన చట్టపరమైన మినహాయింపు సవాలు చేసిన పిటిషన్లను విచారించింది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 63 మినహాయింపు 2 ప్రకారం 18 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సున్న భార్యతో భర్తచేసే లైంగిక చర్యను ఆ నిర్వచనం నుంచి మినహాయించారు. ఈ నిబంధన రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు ఇంకా తుది తీర్పు ఇవ్వలేదు. కేంద్రం వాదన ప్రకారం ఇది ప్రధానంగా శాసన విధానానికి సంబంధించిన అంశం. పిటిషనర్లు వ్యక్తిగత గౌరవం, స్వేచ్ఛ, సమ్మతి హక్కులను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. చట్టం సమాజ మార్పులను అందుకోవాలంటే ఈ చర్చలో స్పష్టత రావాలి.

దేశ భద్రత, ప్రజా క్రమం వంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి నిరోధక నిర్బంధ అధికారం చట్టం కల్పిస్తుంది. అయితే కారణాలు, ఆధారాలు, ప్రక్రియ బలంగా ఉండటం కీలకం. 2026 ఏప్రిల్ 11న కార్మికుల నిరసనకు సంబంధించిన ఘటనలో అదుపులోకి తీసుకున్న ఢిల్లీ విశ్వవిద్యాలయ పట్టభద్రురాలు అకృతి చౌదరిపై మే 13న జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 2న అలహాబాద్ హైకోర్టు ఆ నిర్బంధాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వుల విధానం, కారణాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసి, రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేయనున్నట్లు సెప్టెంబర్ 9న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తెలిపారు. జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3 నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్బంధానికి అధికారం ఇస్తుంది.

దేశ భద్రత, ప్రజా క్రమం వంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి నిరోధక నిర్బంధ అధికారం చట్టం కల్పిస్తుంది. అయితే కారణాలు, ఆధారాలు, ప్రక్రియ బలంగా ఉండటం కీలకం. 2026 ఏప్రిల్ 11న కార్మికుల నిరసనకు సంబంధించిన ఘటనలో అదుపులోకి తీసుకున్న ఢిల్లీ విశ్వవిద్యాలయ పట్టభద్రురాలు అకృతి చౌదరిపై మే 13న జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 2న అలహాబాద్ హైకోర్టు ఆ నిర్బంధాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వుల విధానం, కారణాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసి, రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేయనున్నట్లు సెప్టెంబర్ 9న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తెలిపారు. జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3 నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్బంధానికి అధికారం ఇస్తుంది. సెక్షన్ 13 ప్రకారం గరిష్ఠ కాలం 12 నెలలు. అధికారం ఉన్న చోట బాధ్యత మరింత కఠినంగా ఉండాలి.




సాంకేతికత దుర్వినియోగం భద్రతా వ్యవస్థలకు కొత్త సవాలుగా మారుతోంది. ఎర్రకోట పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ 2026 మే 14న 10 మంది నిందితులపై 7,500 పేజీల అభియోగ పత్రం దాఖలు చేసింది. జూన్ 27న మరో ముగ్గురిపై అభియోగపత్రం దాఖలు చేసినట్లు ప్రకటించింది. దర్యాప్తు వివరాల ప్రకారం నిందితుల్లో ఒకరు యూట్యూబ్, చాట్‌జీపీటీ వంటి వేదికలను పేలుడు పరికరాలకు సంబంధించిన సమాచార సేకరణకు ఉపయోగించినట్లు అభియోగపత్రంలో పేర్కొన్నారు. ఇది దర్యాప్తు సంస్థ ఆరోపణ మాత్రమే; నేరం నిర్ధారితమైందని భావించడానికి వీలులేదు. తుది నిర్ణయం న్యాయస్థాన పరిధిలో ఉంటుంది. సాంకేతికతను అడ్డుకోవడం పరిష్కారం కాదు. ప్రమాదకర వినియోగాన్ని గుర్తించే సామర్థ్యం, డిజిటల్ ఆధారాలను శాస్త్రీయంగా పరిశీలించే దర్యాప్తు వ్యవస్థలు, సమాచార వేదికల బాధ్యత బలోపేతం కావాలి. పౌరుల సమాచార వినియోగ స్వేచ్ఛకు భంగం కలగకుండా భద్రతను పెంచడం అసలు సవాలు. ఇటీవల పరిణామాలు సమాజం మారుతున్న వేగానికి అనుగుణంగా చట్టాలు, విధానాలు కూడా మారాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించే న్యాయ వ్యవస్థతో పాటు ప్రజా భద్రతను కాపాడే బలమైన వ్యవస్థ అవసరం. ప్రభుత్వానికి చట్టబద్ధమైన అధికారం ఉండాలి. ఆ అధికార వినియోగానికి స్పష్టమైన హద్దులు ఉండాలి. న్యాయపరమైన పర్యవేక్షణ, కారణబద్ధమైన నిర్ణయాలు, పారదర్శక ప్రక్రియ, బాధ్యతాయుతమైన దర్యాప్తు ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తాయి. సాంకేతికత కొత్త ప్రమాదాలకు కారణమైనా స్వేచ్ఛాయుత సమాచార వినియోగాన్ని అనవసరంగా పరిమితం చేయడం సరైన మార్గం కాదు. హక్కుల రక్షణ పేరుతో భద్రతను నిర్లక్ష్యం చేయడం కూడా సమర్థనీయం కాదు. అధికారం హద్దు ఎక్కడ ముగుస్తుంది.. పౌరుడి హక్కు ఎక్కడ మొదలవుతుంది అనే ప్రశ్నకు చట్టం, న్యాయం, బాధ్యత అనే మూడు మార్గాల్లో సమాధానం వెతకాలి. కేసులు ముగిసి పోవచ్చు.. కానీ అవి లేవనెత్తిన ప్రశ్నలకు వ్యవస్థ ఇచ్చే సమా ధానమే ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

## హైదరాబాదు విలీనం అయిన విధంబు ఎట్టి దనిన"

భారతదేశ చరిత్రలో సెప్టెంబర్ 17 1948 చిర స్మరణీయమైన దినం. భారత్ సేనాధిపతుల వ్యూహరచన చాతుర్యానికి, సేనల అసమాన పరాక్రమానికి ప్రతిష్ట చేకూర్చిన రోజు. కోటిన్నర ప్రజల చిర వాంఛ ఫలప్రదమైన రోజు. హైదరాబాద్ పై భారత ప్రభుత్వ పోలీసు చర్య విజయ వంతంగా ముగిసిన సంఘటనకు సాక్ష్యం అయిన రోజు. దక్షిణ ప్రాంత భారత సర్వ సేనాని లెఫ్టినెంట్ జనరల్ మహారాజా రాజేంద్ర సింహ్ జీ సాటిలేని మేటి వ్యూహ రచనకు నిలువు టద్దంగా నిలిచిన రోజు. సెప్టెంబర్ 13 వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు భారత సేనలు



సంస్థానం నలువైపుల నుండి "చలో సికింద్రాబాద్" అని ముందు అడుగు వేశాయి. సికింద్రాబాద్ చేరవలసిన ప్రధాన సేనా వాహిని మేజర్ జనరల్ జయంత్ నాథ్ చౌదరి నాయకత్వంలో షోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాదుకు బయల్దేరింది. ఈ సేనలో ఒక దళం నల్ దుర్గ్ నుండి ఉత్తరంగా జాల్నా మీదికి సాగింది. దక్షిణాన హోస్పేట వద్ద, మైసూర్ సేనకు సంబంధించిన బ్రిగేడియర్ బాల్, మధ్య ప్రాంతం డి ఐ జి పార్థసారథి అయ్యంగార్ నేతృత్వంలో మైసూర్ సేన, కొంత మద్రాస్ ప్రత్యేక పోలీసు దళం, మరికొంత మునీరాబాద్ వద్ద తుంగభద్ర పై గల వంతెనను స్వాధీన పరచుకొని ముందుకు సాగాయి. కొంచెం తూర్పుగా కర్నూల్ వద్ద మైసూర్ అశ్వికదళం జాతీయ పోలీసు బలగం తుంగభద్ర రైలు వంతెన స్వాధీన పరచుకొని గద్వాల్ దిశగా సాగాయి. విజయ వాడ వద్ద నుండి బ్రిగేడియర్ మదన్ సింగ్ ఆధ్వర్యంలో ఒక సేనా దళం ఉత్తర ప్రాంత డిఐజి సుబ్బరాయన్ ఆద్వర్యంలో కొంత పోలీసు బలగంతో బయలు దేరాయి. సేవాదళం రెండు భాగాలుగా విడివడి... ఒకటి రైలు మార్గం వెంట ఖమ్మం మీదుగా వరంగల్, రెండవది సూర్యాపేట మీదుగా సికింద్రాబాద్ లక్ష్యాలుగా పురోగమించాయి. ఉత్తరాన కొంత సేన, కొంత పోలీసు బలగం బాలార్ష ను ఆక్రమించాయి. ఆ సమీపంలో గోదావరి పై గల రైలు వంతెనకు ప్రమాదం లేకుండా చేశాయి. పడమరగా కానేర్గాం వద్ద నుండి కొంత పోలీసు బృందం, హింగోలి దిశగా బయలు దేరగా, వాయవ్యంగా తాల్వాద్ నుండి ఒక సైనిక దళం ఔరంగాబాద్ కు సాగింది. షోలాపూర్, విజయవాడ, తాల్వాద్ నుండి బయల్దేరిన ప్రధాన సేన దళాలు... ఎలాంటి ప్రతిఘటనలు కేంద్రీకృతం కాకుండా చేసేందుకు, స్వాధీనమైన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు, సంఘ విద్రోహ శక్తులను మట్టుపెట్టే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. హోస్పేట, కర్నూలు, విజయవాడ నుండి బయలు దేరిన బలగాలు మద్రాస్ ప్రాంత సేనాని మేజర్ జనరల్ రుద్ర పర్యవేక్షణ కింద పని చేశాయి. ఈ దండయాత్రలో సిక్కులు గూర్ఖాలు మద్రాసు బొంబాయి తదితర పోలీసులు పాల్గొన్నారు. సేనాధిపతులలో ఇరువురు ఆంగ్లోఇండియన్లు కూడా ఉన్నారు. 13వ తేదీ సూర్యోదయం వేళ భారత వైమానిక దళాలు విజయవాడ ప్రాంతం నుండి ఎయిర్ వైస్ మార్షల్ ముఖర్జీ నాయకత్వంలో, నిజాం సంస్థానం లోని వరంగల్ బీదర్, ఔరంగబాద్ విమానాశ్రయాలను ఆనవాళ్లు లేకుండా చేశాయి. వాస్తవానికి భారత సేనలు సంస్థానం లోకి తరలి వస్తున్న విషయం 13వ తేదీ ఉదయం 11గంటలకు కానీ బయటకు తెలియనే లేదు. ఢిల్లీలో ఈ విషయాన్ని భారత ప్రభుత్వం బహిర్గతం చేసింది. భారత సైన్యం మెరుపు వేగంతో అన్నివైపుల నుండి సికింద్రాబాద్ వైపు, హైదరాబాద్ వైపు బలగాలు అవిశ్రాంతంగా ముందుకు సాగాయి. 14న మధిర అలంపూరు; 15న వనపర్తి, దౌలతాబాద్, సూర్యాపేట, ఖమ్మం మెట్టు, హోమ్నాబాదు, ఔరంగాబాదు భారత సేనల వశమైనాయి. హోమ్నాబాదు పతనంతో, భారత సేనలు సికింద్రాబాదుకు 10 మైళ్ళ పరిధిలోకి వచ్చాయి. అలా ముందుకు వెళ్లి ఆ రాత్రికి జహీరాబాద్ చేరాయి. నిజాం నవాబుకు దిక్కు తోచని స్థితి ఎదురయింది. ఇలాంటి స్థితిలో జార్జి రాజుకు, ట్రూమన్ కు విజ్ఞప్తులు పంపు కున్నాడు. అయినా ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. 16వ తేదీన వరంగల్, బీదర్, జాల్నా, సిర్పూగు, నారేటుపల్లి, సదాశివపేట సేనల వశమయ్యాయి. ఆరోజున అటు సోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాద్ వెళ్తున్న దళము, ఇటు విజయవాడ నుండి సూర్యాపేట సికింద్రాబాద్ రహదారిపై వెళుతున్న దళము నువ్వా నేనా అంటూ పోటీపడి ముందుకు సాగాయి. 17వ తేదీన హింగోలి సేనల వశమైంది. ప్రధాన దళాలు రెండు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల శివార్లకు చేరుకున్నాయి. దక్షిణ ప్రాంత సర్వ సేనాధిపతి రాజేంద్ర సింహ్ జీ నిజాంను ఉద్దేశించి... "ఇక లాభం లేదు. లొంగి పోయి అనవసర అయాచిత ప్రాణ నష్టం లేకుండా చూసుకోండి" అంటూ హితవు పలికారు. ఇక గత్యంతరం లేదని గ్రహించిన 17వ తేదీ సాయంత్రమే దాసోహం అన్నాడు. హైదరాబాదును ప్రత్యేక దేశంగా ఉంచాలని, కనీసం పాకిస్తాన్‌లో నైనా విలీనం చేయాలని విశ్వ ప్రయత్నం చేసిన నిజాం పన్నాగాలను ఉక్కుమనిషి పటేల్ బద్దలు కొట్టాడు. నిజాం ఐక్యరాజ్య సమితికి భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను కూడా పంపాడు. భారత దేశంపై పోరాటానికి విదేశాల నుంచి ఆయుధ దిగుమతికి ప్రయత్నాలు చేశాడు. అయినా అతని ఆటలు, నిజాం ప్రధాని లాయక్‌అలీ నాటకాలు, పటేల్ ఎదుట పనిచేయ లేదు. పోలీసు చర్యలో భాగంగా నలువైపులా నుంచి వస్తున్న భారత బలగాలను చూసి నిజాం కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చి భారత ప్రతినిధి కె.ఎం.మున్షీని కలిశాడు. అప్పటికే సమాచార సాధనాలు తెగి పోవడంతో ఎటూ అర్థంకాక కాళ్ళ బేరానికి దిగాడు. లొంగుబాటుకు మించిన తరుణోపాయం లేదని మున్షీ చెప్పడంతో నిజాం ఒప్పుకోక తప్పలేదు. బొల్లారం వద్ద నిజాం నవాబు సర్దార్ పటేల్ ఎదుట తలవంచి లొంగి పోవడంతో 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## ప్రగతి బాటలో ప్రజాస్వామ్యం

(సెప్టెంబర్ 17వ తేదీన
(1948 సెప్టెంబర్ 17)
78 వ తెలంగాణ విమోచన దినోత్సవం
(ఆపరేషన్ పోలో)
(హైదరాబాద్ సంస్థాన
విముక్తి దినోత్సవం)
సందర్భంగా)

తెలంగాణ నేలతల్లి స్వేచ్ఛా
గీతం విన్న రోజిది
కోటి రత్నాల వీణా పరిధి
దాటి పాడిన రోజిది
నిజాం కోరల నుండి భారతదేశ
ఐక్యతా నినాదమై బానిసబంధాలు
తెంచుకున్న జెండా ఎగిరిన రోజిది

ఆనాడు సాగింది ప్రజల
సాయుధ పోరాటం
రజాకార్ల గుండెల్లో
పుట్టింది వణుకు
చాకలి ఐలమ్మ వీరత్వం
కొమరం భీమ్ గర్జన
తెలంగాణ బిడ్డల రక్తం
రాసింది ఈరంగుల చరిత్ర
ఓ యువతా
నేటి నీబాధ్యతను
మరవకు ఆనాటి త్యాగాల
వెలుగును నువ్వు వీడకు

లంచాల సంకెళ్లను తెంచే
సైనికుడివి కావాలి
అభివృద్ధికి సారథివి కావాలి
అన్యాయాన్ని అక్రమాలను
అరికట్టే శక్తివి కావాల
పేదల బతుకుల్లో చీకట్లను
చీల్చే సూర్యుడివి కావాలి

సమసమాజ స్థాపన
నీ ఆశయం కావాలి
బంగారు తెలంగాణ వైపు
నీఅడుగులు పడాలి
నాటి పోరాటం స్ఫూర్తిగా
స్వేచ్ఛా రక్షణ కోసం
సాగాలి ముందుకు
నీ పోరాటం సాగాలి పేదల
సంక్షేమం కోసం ప్రగతి కోసం!

ప్రభుత్వ పాలనలో పారదర్శకత
జవాబుదారీతనం పెరగాలి
ప్రతి ఇంటికి అందాలి స్వేచ్ఛా
ఫలాలు సమాన అవకాశాలు
అధికార కేంద్రీకరణతో పాలనలో
ప్రజా భాగస్వామ్యం పెరగాలి

అధికారం అంటే కేవలం
కుర్చీల ఆట కాదు
పేదరిక నిర్మూలనే ప్రభుత్వ
పాలన ధ్యేయం కావాలి
ప్రజలారా ప్రశ్నించే హక్కును
వాడండి ప్రగతిని భుజాన
వేసుకోండి అభివృద్ధికి శక్తిగా
నిలవండి అన్యాయాన్ని



ద్వేషాలు పక్కన బెట్టి
అభివృద్ధికై పోటీ పడి బంగారు
తెలంగాణ నిర్మాణానికి
పునరంకి తమ కావాలి

త్యాగధనుల స్ఫూర్తితో
కొత్త తెలంగాణను నిర్మిద్దాం
సామాజిక తెలంగాణ సాధన
దిశగా అడుగులు వేద్దాం
బడుగు బలహీన వర్గాల
సంక్షేమం కోసం తాడిత
పీడిత జన సామాజిక ఆర్థిక
వికాసానికి కృషి చేస్తూ
ప్రగతి బాటలో పయనిద్దాం

సర్దార్ పటేల్ చూపిన
ధృఢ సంకల్పంతో
కొమరం భీమ్ గర్జించిన
ఆత్మ గౌరవంతో
కాళోజీ ప్రబోధించిన
సామాజిక బాధ్యతతో
భవిష్యత్తు కార్యాచరణకు
కర దీపికగా మారుదాం
మహాకవి దాశరథి కృష్ణమాచార్య కలల సాకారానికి
ఎలుగెత్తి నినదిస్తూ
నా తెలంగాణ కోటి రత్నాల
వీణ అంటూ తెలంగాణను
ప్రజాస్వామ్య సామాజిక ప్రగతి
శీల ప్రాంతంగా అభివృద్ధి చేద్దాం



నేదునూరి కనకయ్య
9440245771

## బ్రిక్స్.. ఓ ఆశాకిరణం...

బహుళ ధ్రువప్రపంచం కోసం బ్రిక్స్ 18వ శిఖరాగ్ర మావేశం పిలుపునివ్వడం హర్షణీయం. అగ్రరాజ్యం అమెరికా ఏకపక్ష ఆంక్షలు, యుద్ధాలతో నష్టపోతున్న ప్రపంచానికి ఊరట. సమావేశాల ముందురోజునే 'స్థిరత్వం, నవకల్పన, సహకారం, సుస్థిరత' లక్ష్యంగా ఢిల్లీ డిక్లరేషన్‌ను రూపొందించడం, సభ్యదేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించడం శుభపరిణామం. న్యూఢిల్లీ వేదికగా సాగిన ఈ సమావేశం ఏకధ్రువ ప్రపంచాన్నీ, డాలర్ ఆధిపత్యాన్నీ సవాల్ చేయడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇంతకాలం అమెరికా, ఇజ్రాయిల్ అడుగులకు మడుగులొత్తి, ఏకపక్ష సుంకాలు, బెదిరింపులపై కనీసం నోరుమెదపని మోడీ ప్రభుత్వం... తాజా డిక్లరేషన్‌లో వాటి పేరెత్తకుండానైనా వాటి చర్యలను ఖండించింది.

బహుపాక్షికవాదం (మల్టీలేటరిలిజమ్) ప్రాముఖ్యతను ఈ సమావేశాలు ముందుకు తేవడం మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అద్దంపడుతోంది. 2009లో భారత్, చైనా, రష్యా, బ్రెజిల్ దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్‌లో ఆ తరువాత దక్షిణాఫ్రికా చేరింది. ప్రస్తుతం 11 దేశాలతో, ప్రపంచంలో దాదాపు 50 శాతం జనాభాతో, 40 శాతం జిడిపితో ఉన్న ఈ కూటమి ఐక్యత అత్యవసరం. సోవియట్ యూనియన్ పతనానంతరం ప్రపంచంపై ఏకపక్ష ఆధిపత్యానికి తెగబడుతున్న అమెరికా దురాక్రమణ వాద, దుశ్చర్యలను అడ్డుకునేందుకు ప్రజాస్వామ్యయుతమైన, విస్తృత భాగస్వామ్యం కలిగిన అంతర్జాతీయ కూటమి అత్యవసరం.

ఏకధ్రువ ప్రపంచానికి బదులుగా మరింత ప్రజాస్వామ్యయుతమైన ప్రపంచ వ్యవస్థ ఉండాలని ఈ సమావేశం పిలుపునివ్వడం సముచితం. ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ ప్రజల అభిప్రాయాలను, ప్రయోజనాలను ప్రతిబింబించేలా వ్యవహరించాలన్న సభ్యదేశాల డిమాండ్ వాటి వైఖరులను సరిచేసుకోవాలన్న హెచ్చరిక. అమెరికా ఏకపక్ష ఆంక్షలను, సుంకాలను ఖండించడం అగ్రరాజ్యానికి మింగుడుపడనిదే. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యాన్ని మెరుగుపరచాలని, స్థానిక కరెన్సీలలో మరింత ఎక్కువ లావాదేవీలు జరపాలని చేసిన తీర్మానం ప్రత్యామ్నాయ కరెన్సీకి ఊపునివ్వడంతోపాటు డాలర్ గట్టి సవాల్‌ను విసిరేదే! మనదేశంలో పహల్గామ్‌లో దాడి సహా ఏ దేశంలోనూ ఉగ్రదాడులను సహించబోమన్న తీర్మానం సరైనది. ఏ సభ్య దేశం పేరు, అమెరికా పేరు ప్రస్తావించకపోయినా ఈ డిక్లరేషన్ అగ్రరాజ్య ఆధిపత్యాన్ని గట్టిగానే ప్రశ్నించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని, వనరులను ఆయుధాలుగా మలిచే అమెరికా తీరును ఈసడించింది. గాజాలో ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించడం, 1967 నాటి సరిహద్దుల ఆధారంగా తూర్పు జెరూసలేం రాజధానిగా స్వేచ్ఛాయుతమైన స్థిరమైన, సార్వభౌమాధికారం కలిగిన పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయాలని పిలుపునివ్వడం ముదావహం. ఆయుధాల విచ్చలవిడి వినియోగానికి స్వస్తి పలకాలని, సాయుధ ఘర్షణల సమయంలో అణుభద్రతకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఢిల్లీ డిక్లరేషన్ నొక్కి వక్కాణించింది. భారత్, బ్రెజిల్‌లకు స్థానం కల్పిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని విస్తరించాలన్న తీర్మానం ఏళ్లతరబడి మనదేశం చేస్తున్న ప్రయత్నాలకు ఊతమిచ్చేదే.



15 దేశాల అధినేతలతో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపి, సంబంధాల బలోపేతానికి ప్రయత్నించడం సరైనదే. ఇరాన్ సుప్రీంనేత సహా అత్యున్నత నాయకత్వాన్ని ఏకపక్షంగా అమెరికా, ఇజ్రాయిల్ అంతమొందించినప్పుడు సంతాపం తెలియజేయడానికి మీనమేషాలు లెక్కించిన మోడీ ఇరాన్‌ను శాంతింపజేయడానికా అన్నట్టు ఆ దేశ అధ్యక్షుడికి ప్రాధాన్యత ఇవ్వడం కొంత మెరుగు. అతిథుల ఆహారపు అలవాట్లకు గానీ, భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపే భారతీయ ప్రత్యేకతలకు గానీ చోటులేకుండా శాకాహారానికే బ్రిక్స్ దేశాల అతిథుల విందును పరిమితం చేయడంతో ఢిల్లీ పెద్దల కురచబుద్ధి మరోసారి వెల్లడయింది. ఇరుదేశాల మధ్య ఉన్న అంతరాలను, సరిహద్దు విభేదాలను సాధారణీకరించుకోవాలన్న సంకల్పం మోడీ, జిన్‌పింగ్‌లలో కనిపించడం భారత్, చైనాలకు ప్రయోజనకరం. బహుళ ధ్రువ ప్రపంచానికి చోదక శక్తిగా వర్ధిస్తూ ఓపెన్ సోర్స్ ఎఐ కోసం జిన్‌పింగ్ చేసిన ప్రతిపాదన, కొత్త బీమా యంత్రాంగం కోసం పుతిన్ చేసిన సూచన ఆచరణలోకి రావడం అవసరం. బ్రిక్స్ ప్రారంభం నుంచీ స్పష్టమైన విధానాలు పెద్దగా రాని వేదిక నుంచి న్యూఢిల్లీలో భారత్ అధ్యక్షతన నాలుగోసారి సాగిన డిక్లరేషన్ గ్లోబల్ సౌత్ ప్రతిష్టను పెంచడం ప్రశంసనీయం. బ్రిక్స్ దేశాల ఐక్యత బహుళ ధ్రువ ప్రపంచానికి ఆశాకిరణం.



# జాతీయం-అంతర్జాతీయం





## పాక్ దౌత్యవేత్తకు భారత్ నోటీసులు

- పాక్ దౌత్యవేత్తకు భారత్ నోటీసులు
- యుద్ధ నౌకను పాక్ నౌక ఢీకొట్టటమే కారణం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఎ.ఎం.ఎస్)**

భారత నౌకను పాకిస్థాన్ నౌక ఢీకొట్టడంపై భారత ప్రభుత్వం పాకిస్తాన్ దౌత్యవేత్తకు బుధవారం నోటీసులిచ్చింది. ఇది ''ఆమోదయోగ్యం కాని'','' అనైతికమైన చర్య'' గా భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) అభివర్ణించింది.

అరేబియా సముద్రంలో సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత యుద్ధ నౌకను మంగళవారం పాక్ నౌక ఢీకొట్టిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ నౌక నిబంధనకు విరుద్ధంగా అధికవేగంగా నౌకను నడపడం వలనే ఈ ప్రమాదం జరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి నష్టం జరగలేదు. అంతర్జాతీయ జలాల్లో జరిగిన ఈ ఘటన కారణంగా పెద్దగా నష్టం వాటిల్లకపోయినప్పటికీ, పాకిస్థాన్ నౌకాదళ ప్రవర్తన 1991 ఏప్రిల్ నాటి సైనిక విన్యాసాలు, దళాల కదలికలపై ముందస్తు నోటీసుకు సంబంధించి భారత పాకిస్థాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందంలోని ఆర్టికల్ 10కి పూర్తి విరుద్ధంగా ఉంది అని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి, అన్ని సైనిక విభాగాలు తగిన జాగ్రత్తలు పాటించాలని,

ఇరుపక్షాల మధ్య ఉన్న ఒప్పందాలను గౌరవించాలని పాక్ ప్రభుత్వానికి తెలియజేయాలని పాకిస్థాన్ తాత్కాలిక దౌత్య ప్రతినిధికి సూచించినట్లు పేర్కొంది.

అలాగే ఇస్లామాబాద్‌లోని భారత తాత్కాలిక రాయబారిని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఇదే తరహా నిరసనను వ్యక్తం చేయాల్సిందిగా ఆదేశించారు.

## చెత్త నుంచి రహదారికి..

- ఆరు వేల పాల సీసాల ప్లాస్టిక్‌తో రహదారి నిర్మాణం
- మౌలిక సదుపాయంగా రీసైక్లింగ్‌కు పనికిరాని ప్లాస్టిక్
- చైనా వినూత్న ప్రయోగం.. పర్యావరణవేత్తల హర్షం

**షాంఘై, సెప్టెంబరు 16 :**



ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తున్న వేళ చైనాలో చేపట్టిన ఒక వినూత్న ప్రయోగం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వినియోగం పూర్తైన ఆరు వేలకుపైగా పాల సీసాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను రహదారి నిర్మాణంలో ఉపయోగించి కొత్త ప్రయోజనం కల్పించారు. సాధారణ రీసైక్లింగ్ వ్యవస్థలు సరిగా స్వీకరించని ప్లాస్టిక్‌ను రహదారి నిర్మాణ సామగ్రిగా మార్చడం ద్వారా వ్యర్థాలను మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగించవచ్చని ఈ ప్రాజెక్టు నిరూపించింది. 2021లో షాంఘైలోని ఈస్ట్ చైనా నివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈసీఎస్‌టీ)లో ఈ ప్రత్యేక రహదారి ప్రాజెక్టును చేపట్టారు. డౌ సంస్థ, పాల ఉత్పత్తుల బ్రాండ్ షైనీ మేడో కలిసి విశ్వవిద్యాలయ భాగస్వామ్యంతో దీనిని అభివృద్ధి చేశాయి.

పాల సీసాలు సాంకేతికంగా రీసైక్లింగ్ చేయదగినవే. అయితే వాటిలో మిగిలిపోయే పాల అవశేషాలు ప్లాస్టిక్‌ను కలుషితం చేస్తాయి. దీంతో వాటిని సేకరించి మళ్లీ ఉపయోగించడం రీసైక్లింగ్ సంస్థలకు కష్టసాధ్యంగా మారుతుంది. ఈ కారణంగా రీసైక్లింగ్ చేయదగిన ప్లాస్టిక్ అయినప్పటికీ అనేక సీసాలు తక్కువ విలువ కలిగిన వ్యర్థాలుగా పరిగణించబడుతున్నాయి. షైనీ మేడో సంస్థ ఇప్పటికే రీసైక్లింగ్‌కు అనువైన ప్యాకేజింగ్‌ను ఉపయోగిస్తున్నప్పటికీ.. వినియోగం తర్వాత సీసాల నిర్వహణ పెద్ద సవాలుగా మారిందని తెలిపింది. ముఖ్యంగా రీసైక్లింగ్ సంస్థలు తక్కువ విలువ కలిగిన ప్లాస్టిక్‌గా భావించే సీసాలకు ఉపయోగకరమైన మార్గాన్ని కనుగొనడం అవసరమైంది.

ఈ సమస్యకు డౌ సంస్థ వినూత్న పరిష్కారాన్ని సూచించింది. రీసైక్లింగ్‌కు కష్టంగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, వాటిని వినియోగానంతర రీసైకిల్ ప్లాస్టిక్‌గా మార్చింది. అనంతరం ఆ ప్లాస్టిక్‌ను ప్రత్యేక పాలిమర్‌తో మార్పు చేసిన తారు మిశ్రమంలో కలిపి రహదారి నిర్మాణానికి ఉపయోగించారు.ఈ ప్రాజెక్టులో ఆరు వేలకుపైగా ఉపయోగించిన పాల సీసాలతో పాటు ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా వినియోగించారు. దీంతో సాధారణంగా చెత్తగా మారిపోయే ప్లాస్టిక్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని రహదారిలో భాగంగా మారింది.ఈ ప్రాజెక్టు ఉద్దేశం కేవలం ప్లాస్టిక్ వ్యర్థాలను మరో రూపంలో మార్చడమే కాదు. రహదారి నిర్మాణంలో రీసైకిల్ ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల సంప్రదాయ తారు అవసరాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉందని డౌ వివరించింది. అదే సమయంలో రహదారి మన్నిక పెరిగితే దాని వినియోగ కాలం కూడా పెరగవచ్చని భావిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణంలోకి చేరకుండా నిరోధించడం, తారు వినియోగాన్ని తగ్గించడం, రహదారుల సేవా కాలాన్ని పెంచడం వంటి అంశాల ద్వారా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు, ఇంధన వినియోగం తగ్గే అవకాశముందని సంస్థ తెలిపింది.

షాంఘై ప్రాజెక్టు ఒక్కటే కాదు. ఆసియాలో రీసైకిల్ ప్లాస్టిక్‌తో రహదారుల అభివృద్ధిపై డౌ సంస్థ గత కొన్నేళ్లుగా పనిచేస్తోంది. 2017లో ఇండోనేషియాలోని డెపోక్ నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి రహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనంతరం భారత్‌లోని పూణే, బెంగళూరులో భాగస్వాములతో కలిసి ఇటువంటి రహదారి ప్రాజెక్టులపై పని చేసింది. థాయిలాండ్‌లోని సియామ్ సిమెంట్ గ్రూప్‌తో కూడా ఈ రంగంలో సహకారం అందించింది.ఈస్ట్ చైనా నివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ ప్రాజెక్టును కేవలం రహదారి నిర్మాణ ప్రయోగంగా కాకుండా.. పర్యావరణ సమస్యలకు భిన్నమైన పరిష్కారాలను కనుగొనే ఆచరణాత్మక నవనాగా భావిస్తోంది. అసాధారణ ఆలోచనలతో వ్యర్థాల సమస్యలకు పరిష్కారాలు వెతకాలనీ, వాటిని పెద్ద స్థాయిలో అమలు చేసే దిశగా విద్యార్థులు ఆలోచించాలని విశ్వవిద్యాలయం భావిస్తోంది. చెత్తకుప్పల్లో చేరాల్సిన వేలాది పాల సీసాలకు రహదారి రూపంలో కొత్త జీవితం ఇవ్వడం ద్వారా చైనా చేపట్టిన ఈ ప్రయోగం ఒక కీలక సందేశాన్ని ఇస్తోంది. సరైన సాంకేతికత, వినూత్న ఆలోచన, పరిశ్రమలువిద్యాసంస్థల భాగస్వామ్యం ఉంటే నేటి వ్యర్థమే రేపటి మౌలిక వనరుగా మారుతుందని ఈ ప్లాస్టిక్ రహదారి చాటిచెప్తోందని పర్యావరణవేత్తలు సైతం అభినందిస్తున్నారు.ఒకసారి ఉపయోగించి చెత్తబుట్టలో పడేయడం కాకుండా ప్లాస్టిక్‌కు మరో ఉపయోగకరమైన ప్రయాణాన్ని కల్పించాలన్నదే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఉత్పత్తి చేయడంవినియోగించడంపడేయడం అనే సంప్రదాయ విధానానికి బదులుగా.. వినియోగం పూర్తయిన తర్వాత కూడా ప్లాస్టిక్‌కు కొత్త ఉపయోగాన్ని కల్పించే సర్క్యులర్ ఎకానమీః భావనను ఇది ప్రతిబింబిస్తోంది.

ఒకప్పుడు పాలతో నిండిన ఆరు వేలకుపైగా సీసాలు.. వినియోగం పూర్త్యాక చెత్తకుప్పలో చేరాల్సిన ప్లాస్టిక్.. ఇప్పుడు రహదారిలో భాగమయ్యాయి! సాధారణ రీసైక్లింగ్ వ్యవస్థలు స్వీకరించడానికి వెనుకాడే ప్లాస్టిక్ వ్యర్థాలకు కొత్త ప్రయోజనం చూపిస్తూ చైనాలో చేపట్టిన ఈ వినూత్న ప్రయోగం పర్యావరణ పరిరక్షణకు సరికొత్త దారిని చూపింది. రీసైక్లింగ్‌కు సమస్యగా మారిన వేలాది సీసాలను ప్రత్యేక పద్ధతిలో శుద్ధి చేసి తారు మిశ్రమంలో కలిపి రహదారి నిర్మించారు.



## ఇజ్రాయిల్‌కు అమెరికా బాంబులు

- ఆయుధ ఒప్పందంలో భాగమే
- వాషింగ్టన్ పోస్టు నివేదికలో వెల్లడి

**వాషింగ్టన్, సెప్టెంబరు 16 :**

గాజాపై దాడుల కోసం ఇజ్రాయిల్‌కు అమెరికా బాంబులను సరఫరా చేసేందుకు సిద్ధమైంది. రాబోయే ఆయుధ ఒప్పందంలో భాగంగా ఇజ్రాయిల్‌కు శక్తివంతమైన రెండువేల పౌండ్ల బరువున్న బాంబులను అందించాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు పేరు చెప్పేందుకు నిరాకరించిన ఇద్దరు అమెరికా అధికారులు మంగళవారం తెలిపారు. 2,000 పౌండ్ల (907 కిలోల) బరువున్న బాంబులలో అనేక రకాలు ఉన్నాయి. వాటిలో కొన్ని లోతైన, భూగర్భ లక్ష్యాలను ఛేదించేలా రూపొందించగా, మరికొన్ని భూమిపైనే పేలి విస్తృత నష్టాన్ని కలిగించనున్నాయి. ఇంకా ఖరారు కాని రూ.280 కోట్ల (2.8 బిలియన్ రూపాయల) ప్యాకేజీలో భాగంగా 40,000 బాంబులు (20,000 ఎంకె84లు, 20,000 బిఎల్‌యు117లు) ఉన్నాయని ఆ అధికారులు వెల్లడించారు. ఈ ఒప్పందం గురించి కాంగ్రెస్‌కు అనధికారిక సమాచారం అందినట్లు వారు వెల్లడించారు. ఈ ఒప్పందంలో అధిక భాగానికి విదేశీ సైనిక నిధుల ద్వారా చెల్లింపు జరగనుందని అన్నారు. దీనిలో భాగంగా, అమెరికా పన్ను చెల్లింపుదారుల డాలర్లను ఇజ్రాయెల్‌కు ఇచ్చి, ఆ డబ్బుతో ఇజ్రాయెల్ తిరిగి అమెరికా నుండి ఆయుధాలను కొనుగోలు చేయనుందని వెల్లడించారు. ఈ ప్యాకేజీ గురించి 'వాషింగ్టన్ పోస్ట్' గతంలో నివేదించింది. తమ ఆయుధాలతో గాజాలో భారీ ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్న ఆందోళనలతో బైడెన్ ప్రభుత్వం రెండేళ్ల క్రితం బాంబుల పంపిణీని నిలిపివేసిన సంగతి తెలిసిందే. రెండవసారి ట్రంప్ అధికారం చేపట్టిన అనంతరం తాజాగా ఇజ్రాయిల్‌కు బాంబులను సరఫరా చేసేందుకు ఆమోదించారు. గత సంవత్సరం, ట్రంప్ ప్రభుత్వం కాంగ్రెస్ సాధారణ సమీక్షను దాటవేసి, 35,500కు పైగా బాంబులతో కూడిన సుమారు 3 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల అమ్మకానికి ఆమోదం తెలిపింది. అనంతరం జనవరిలో, ఇజ్రాయిల్‌కు ట్రంప్ ప్రభుత్వం మొత్తం 6.67 బిలియన్ల (సుమారు 667 కోట్ల) విలువైన మొదటి విడత ఆయుధాల అమ్మకాలకు ఆమోదం తెలిపింది.

## మక్కాపై దాడి చేయలేదు

- యెమెన్ హౌతీ ప్రకటన

**దుబాయి, సెప్టెంబరు 16 (ఎ.ఎం.ఎస్) :**



పవిత్ర మక్కా నగరంపై డ్రోన్ తో దాడి చేయలేదని యెమెన్ హౌతీ ప్రకటించింది. ఈ ఆరోపణలు "కల్పనలు, అబద్ధాలు" అని పేర్కొంటూ, తమ కార్యకలాపాలు ఇస్లామిక్ పవిత్ర స్థలాలకు దూరంగా ఉన్న సౌదీ సైనిక, చమురు సౌకర్యాలను లక్ష్యంగా చేసుకున్నాయని స్పష్టం చేసింది. టెలిగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో.. హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యహ్యా సరీ, సౌదీ అరేబియాలోని అల్ సౌద్ పాలనను విమర్శిస్తూ, ఈ ప్రయత్నాన్ని ఒక మోసంగా అభివర్ణించారు. అదే సమయంలో, తమ తిరుగుబాటు బృందం పవిత్ర స్థలాలకు ఎలాంటి ముప్పు కలిగించదని ఆయన స్పష్టం చేశారు. "పవిత్రమైన మక్కాను లక్ష్యంగా చేసుకున్నామన్న నేరపూరిత అల్ సౌద్ పాలన ప్రచారం చేస్తున్న కల్పనలు, అబద్ధాలు ఎవరినీ మోసగించలేవు. ఎందుకంటే, దురాచారాలతో వారే మక్కాను అపవిత్రం చేస్తున్నారు. ఆ పవిత్ర స్థలాలకు యెమెన్ నుండి ఎలాంటి ముప్పు లేదు," అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నాడు జీఎస్టీ.. నేడు యూపీఐ

- రూ. 2వేలు దాటితే
- యూపీఐ లావాదేవీలపై త్వరలో
- చార్జీల వసూలుకు కేంద్రం సన్నద్ధం
- బ్యాంకర్లతో కమిటీ ఏర్పాటు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఎ.ఎం.ఎస్) :**

నాడు..వినియోగదారులపై ఎలాంటి భారాలు పడవంటూ జీఎస్టీని తెరపైకి తెస్తున్నప్పుడు మోడీ సర్కార్ బుకాయించింది. అంతా ఉత్పత్తి చేసే కంపెనీ యాజమాన్యమే భరిస్తుందనటంతో దేశ ప్రజలు గుడ్డిగా నమ్మారు. కానీ జరిగిందేంటీ..? యాజమాన్యంతో కేంద్రం లాలూచీ పడింది. జీఎస్టీ భారమంతా వినియోగదారుని నెత్తిన రుద్దేసింది. అచ్చం అదే విధంగా ఇప్పుడు యూపీఐ లావాదేవీలపైనా కేంద్రం ఇలాంటి ఎత్తుగడే వేస్తున్నది. డిజిటల్ చెల్లింపుల రూపంలో వేలకోట్ల లావాదేవీలు జరుగుతుండడంతో.. వినియోగదారులను బాదేసి ఖజానా నింపుకుందామనే ఆలోచన చేసింది. ఉపాధి, ఆదాయాల్లేక నానా ఇబ్బందులు పడుతున్న జనాన్ని పీల్చిపిప్పి చేసేలా చార్జీల భారాన్ని అమల్లోకి తేనున్నది. మరోవైపు ఈ నిర్ణయం అమెరికా ఒత్తిడి మేరకే చేపడుతున్నట్టు స్పష్టమవుతోంది.యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే పలు డిజిటల్ చెల్లింపులపై ఇప్పటివరకు ఉన్న ఉచిత విధానానికి మోడీ సర్కార్ స్వస్తి చెప్పాలని నిర్ణయించింది. రూ.2,000 కంటే తక్కువ మొత్త[illegible]రిగే లావాదేవీలకు ఎటువంటి చార్జీలు ఉండవని చెబుతున్నప్పటికీ.. అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే వ్యాపార చెల్లింపులపై (పీ2ఎం), మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ప్రాసెసింగ్ చార్జీలను ప్రవేశపెట్టేందుకు చట్టపరమైన మార్గం సుగమం చేస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి పార్లమెంటులో ఇటీవల 'టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు2026' ద్వారా 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్2007'లోని సెక్షన్ 10ఎకు సవరణ చేశారు. దీని ప్రకారం రూ.2,000 వరకు చేసే యూపీఐ, రూపే డెబిట్ కార్డ్ చెల్లింపులకు ఎలాంటి చార్జీలు వర్తించవు. అయితే ఈ పరిమితిని దాటిన వ్యాపార లావాదేవీలపై చార్జీలు విధించేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, వివిధ సంఘాల ప్రతినిధులతో కూడిన 22 మంది సభ్యుల 'యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ' త్వరలోనే సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుందని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం దేశంలో 55 కోట్లకు పైగా ప్రజలు యూపీఐని ఉపయోగిస్తున్నారు. జులై 2026 ఒక్క నెలలోనే ఏకంగా 2,366 కోట్ల లావాదేవీలు జరిగి రూ. 29.9 లక్షల కోట్ల విలువైన బదిలీలు నమోదయ్యాయి. రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు లేదా ఎండీఆర్ విధించడానికి



కేంద్ర ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా పేమెంట్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్ర మోడీ భారత్‌లోని జీరో ఎండీఆర్ విధానాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. యూపీఐ లావాదేవీల పరిమాణం పరంగా రూ.2,000 దాటినవి కేవలం 5 శాతమే అయినప్పటికీ.. మొత్తం లావాదేవీల విలువలో అవి దాదాపు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయని రాహుల్ గాంధీ వెల్లడించారు. వినియోగదారుల నుంచి నేరుగా చార్జీలు వసూలు చేయకపోయినా.. వ్యాపారులు ఈ భారాన్ని చివరికి పెరిగిన ధరల రూపంలో సాధారణ ప్రజలపైనే రుద్దుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందని, ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల పన్ను పేరుతో ప్రజల పొదుపును హరిస్తున్నారని మండిపడ్డారు. రూ.5,000 లావాదేవీలపై రూ.25, రూ.10,000 లావాదేవీలపై రూ.50 వరకు అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించక పోగా మోడీ ప్రభుత్వం ప్రజల జేబులు ఖాళీ చేయడానికి కొత్త మార్గాలను వెతుకుతోందని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ఏదైనా ఎండీఆర్ వర్తిస్తే అది కేవలం నిర్దిష్ట వర్గానికి చెందిన పెద్ద వ్యాపార లావాదేవీలపై మాత్రమే ఉంటుందని.. వినియోగదారులు నేరుగా ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని మంత్రి సీతారామన్ పేర్కొన్నారు.

భారతదేశపు యూపీఐ మార్కెట్‌లోనూ అమెరికా సంస్థలైన గూగుల్ పే, వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫోన్‌పే ఇప్పటికే 80 శాతానికి పైగా లావాదేవీలను నియంత్రిస్తున్నాయి. ఏ ఒక్క యాప్ కూడా 30 శాతానికి మించి మార్కెట్ వాటా కలిగి ఉండకూడదన్న ఎన్‌పీసీఐ నిబంధనను కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీంతో ఈ నిబంధన అమలును ప్రభుత్వం డిసెంబర్ 2026 వరకు వాయిదా వేస్తూ వచ్చింది. దీనికితోడు డేటా లోకలైజేషన్ నిబంధనలను కూడా అమెరికా కంపెనీలు తప్పుబడుతున్నాయి.భారత ప్రజాధనంతో నిర్మితమైన డిజిటల్ మౌలిక సదుపాయాలలో విదేశీ కంపెనీలు ఇంతటి ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నప్పటికీ.. అమెరికా మాత్రం తమ వీసా, మాస్టర్‌కార్డ్ కంపెనీల లాభాల కోసం భారత్‌పై ఒత్తిడి పెంచుతూనే ఉంది. అమెరికా వాణిజ్య ఒత్తిళ్లకు తలొగ్గి ఉచిత సేవలకు స్వస్తి పలకడం లేదా నిబంధనలను సడలించడం భారత డిజిటల్ సార్వభౌమత్వానికి మంచిది కాదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా ఒత్తిళ్లకు కాకుండా భారత వినియోగదారులు, వ్యాపారులు, బ్యాంకులు, ఎన్‌పీసీఐ ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర విధానాలు ఉండాలని సూచిస్తున్నారు.భారతదేశంలో కోట్లాది మంది వినియోగిస్తున్న యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటివరకు పూర్తిగా ఉచితంగా కొనసాగుతున్న యూపీఐ లావాదేవీల విధానంలో కీలక మార్పులు చేస్తూ ఎన్‌పీసీఐ మంగళవారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం రూ.2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే వ్యాపార చెల్లింపులపై 0.4 శాతం మేర మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తించనుంది. ఈ కొత్త నిబంధనలు వచ్చే నెల అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. రూ.2,000 దాటిన వ్యక్తి నుంచి వ్యాపారికి (పీ2ఎం) చెల్లింపులపై మాత్రమే ఎండీఆర్ చార్జీలు వర్తిస్తాయని ఎన్‌పీసీఐ తెలిపింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పీ2పీ) లావాదేవీలపై చార్జీలుండవు.యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు టర్నోవర్ కలిగిన చిన్న వ్యాపారులకు ఈ చార్జీల నుంచి పూర్తి మినహాయింపునిచ్చారు. అలాగే రూ.2,000 లోపు ఉండే అన్ని వ్యాపార చెల్లింపులు, రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలు కూడా యథావిధిగా ఉచితంగానే జరగనున్నాయి. ఒకవేళ లావాదేవీల విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే ఎండీఆర్‌ను గరిష్టంగా రూ.300కు పరిమితం చేశారు. కొన్ని ప్రత్యేక రంగాలకు భిన్నమైన విధానాన్ని ప్రకటించారు. రైల్వేలు, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధన రంగాలు, వ్యవసాయ ముడి సరుకులకు సంబంధించి రూ.2,000 దాటిన లావాదేవీలపై శాతం లెక్క కాకుండా కేవలం రూ.5 ఎండీఆర్ వసూలు చేస్తారు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్ల చెల్లింపులకు గరిష్టంగా రూ.300 వరకు పరిమితం చేస్తూ కేవలం 0.02 శాతం మాత్రమే ఎండీఆర్ విధించనున్నారు. వసూలైన ఎండీఆర్‌లో 5 శాతాన్ని చిన్న వ్యాపారుల్లో డిజిటల్ సేవలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక నిధిగా కేటాయించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

యూపీఐ, రూపే వ్యవస్థల వల్ల తమ దేశానికి చెందిన వీసా, మాస్టర్‌కార్డ్ వంటి దిగ్గజ సంస్థల వ్యాపారం దెబ్బతింటోందని అమెరికా మరో ప్రధాన ఆరోపణ. ఉచిత యూపీఐ సేవలు, రూపే కార్డులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల తమ కార్డ్ నెట్‌వర్క్‌లు భారీగా ఫీజు ఆదాయాన్ని కోల్పోతున్నాయని వాషింగ్టన్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. బ్రెజిల్ దేశానికి చెందిన ఉచిత చెల్లింపు వ్యవస్థ పిక్స్ పై కూడా అమెరికా ఇలాగే ఒత్తిడి తెచ్చి..

మాట వినకపోవడంతో ఆ దేశ ఉత్పత్తులపై 25 శాతం దాకా అదనపు సుంకాలను విధించిన సంగతి విదితమే. ఆ తరహాలోనే భారత్‌పైనా ఒత్తిడి పెంచుతోందని ఇటీవల సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఇరాన్ యుద్ధంతో సైనిక, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం



**వాషింగ్టన్, సెప్టెంబరు 16 (ఎ.ఎం.ఎస్) :**

ఇరాన్‌ను చావుదెబ్బ కొట్టామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు గొప్పలు చెప్పినప్పటికీ టెహ్రాన్‌పై ఆ ప్రభావం ఎంతుందో తెలియదు కానీ అగ్రరాజ్యంపై మాత్రం తీవ్రంగానే ఉందని తెలుస్తోంది. ఇరాన్ యుద్ధం వల్ల అమెరికా సైనిక, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడినట్టు పెంటగాన్ నివేదిక వెల్లడించింది. అధునాతన ఆయుధాల కొరత ఏర్పడటమే కాకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలకు భారీ నష్టం వాటిల్లిందని తేల్చింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30వరకు జరిగిన పరిణామాలపై పెంటగాన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఓ నివేదిక రూపొందించారు. రక్షణ, విదేశాంగ శాఖలు, ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలు వెల్లడించిన విషయాలను అందులో పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో ఆస్తి నష్టం 184 మిలియన్ డాలర్లు కాగా, దౌత్యపరమైన ఖర్చుల కోసం 113 మిలియన్ డాలర్లు, అత్యవసర చర్యల కోసం 80 మిలియన్ డాలర్లు వెచ్చించినట్టు తెలిపింది. గల్ఫ్, ఐరోపా దేశాల్లో అమెరికన్లను స్వదేశానికి తరలించేందుకు 11 మిలియన్ డాలర్లు ఖర్చయినట్టు పేర్కొంది. ఇరాన్ యుద్ధం కోసం మొత్తంగా 37.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్టు జులైలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. అదే విధంగా గల్ఫ్‌లోని అమెరికా సైనిక, దౌత్య కార్యాలయాలపై ఇరాన్ దాడుల తీవ్రత కూడా ఎక్కువగానే ఉన్నట్టు పెంటగాన్ నివేదిక స్పష్టం చేసింది.

## ఎన్నికలే లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణ

- ఏఐసీసీ కార్యదర్శులతో రాహుల్, వేణుగోపాల్ భేటీ
- రాష్ట్రాలపై పట్టు పెంచుకునే వ్యూహం
- పార్టీ బలోపేతంపై అధిష్ఠానం దృష్టి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఎ.ఎం.ఎస్):**

కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ప్రక్షాళనకు కసరత్తు ప్రారభమైంది. వరుస పరాజయాలు, రాష్ట్రాల్లో బలహీనపడుతున్న పార్టీ యంత్రాంగం, రానున్న ఎన్నికల నేపథ్యంలో అధిష్టానం సంస్థాగత వ్యవస్థను పునర్వ్యవస్థీకరించే పనిలో పడింది. అందులో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మంగళవారం నాడిక్కడ 10 జనపథ్ లో ఏఐసీసీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. రాష్ట్రాల వారీగా పార్టీ పరిస్థితి, సంస్థాగత నిర్మాణం, నాయకత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో పార్టీకి ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించినట్టు సమాచారం. ఇటీవల కాంగ్రెస్ అధిష్టానం చేపట్టిన వరుస నియామకాలు పార్టీ సంస్థాగత పునర్నిర్మాణంలో భాగంగానే కనిపిస్తున్నాయి. పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమించడంతోపాటు, ఇప్పటికే సంస్థాగత బాధ్యతలు నిర్వహించిన నేతలకు మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజల్లో ఉండేలా పార్టీ వ్యవస్థను రూపొందించాలన్న లక్ష్యంతో నాయకత్వం ముందుకు సాగుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సచిన్ పైలట్‌కు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పంజాబ్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా, గతంలో ఆ బాధ్యతలు నిర్వహించిన భూపేష్ బఘేల్‌ను అసోం ఇన్‌చార్జిగా నియమించారు. రణదీప్ సింగ్ సుర్జేవాలాకు గుజరాత్ బాధ్యతలు అప్పగించారు. కర్నాటక అదనపు బాధ్యతలను ఆయన కొనసాగించనున్నారు. సుఖ్‌దేవ్ భగత్‌కు ఛత్తీస్‌గఢ్, సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర, పివి మోహన్‌కు ఆంధ్రప్రదేశ్ బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే ప్రచార రాజకీయాలను దాటి, గ్రామస్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్‌కు ప్రధాన సవాలు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో క్షేత్రస్థాయి పార్టీ కార్యకలాపాలు, రాష్ట్రాల వారీగా సంస్థాగత పరిస్థితి, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఏఐసీసీ కార్యదర్శి బివి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్‌గా నియమించడం కూడా సంస్థాగత వ్యవస్థను చురుగ్గా మార్చే ప్రయత్నంలో భాగంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సంజయ్ దత్‌కు హర్యానా బాధ్యతలు అప్పగించారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాల్లో పార్టీకి రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా నిలిచే సామర్థ్యాన్ని పెంచుకోవడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. పార్టీ యంత్రాంగాన్ని క్రియాశీలం చేయడం, ప్రజా సమస్యలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లడం, ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడం, పార్టీ శ్రేణులను ఉద్యమాల వైపు మళ్లించడం వంటి అంశాలపై అధిష్టానం దృష్టి సారించినట్లు సమాచారం. ఇటీవల కొందరు ఏఐసీసీ కార్యదర్శులకు రాజ్యసభ అవకాశాలు కల్పించడం కూడా నాయకత్వం సంస్థాగతంగా పనిచేస్తున్న నేతలకు ప్రాధాన్యత ఇస్తున్న సంకేతంగా భావిస్తున్నారు. ప్రణవ్ ఝా, క్రిస్టోఫర్ తిలక్, మన్సూర్ అలీ ఖాన్ పేర్లు ఈ సందర్భంగా తెరపైకి వచ్చాయి.తాజా నియామకాల్లో సామాజిక ప్రాతినిధ్యానికి కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులను కీలక రాష్ట్రాల బాధ్యతల్లోకి తీసుకురావడం ద్వారా





ఆయా వర్గాల్లో పార్టీకి ఉన్న దూరాన్ని తగ్గించుకోవాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

సంస్థాగత మార్పులు కేవలం పదవుల మార్పిడిగా కాకుండా పార్టీ సామాజిక పునాదిని విస్తరించే ప్రక్రియగా ఉండాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.

తాజా సమావేశంతో కాంగ్రెస్‌లో సంస్థాగత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రాల వారీగా పనితీరును సమీక్షించి, అవసరమైన చోట నాయకత్వ మార్పులు, కొత్త బాధ్యతలు, సంస్థాగత పునర్వ్యవస్థీకరణ చేపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే నాయకత్వ మార్పులతో మాత్రమే పార్టీకి పూర్వ వైభవం వస్తుందా? లేక క్షేత్రస్థాయిలో నిరంతర రాజకీయ పోరాటం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, బలమైన సంస్థాగత నిర్మాణం అవసరమా? అన్నది కాంగ్రెస్ ముందున్న అసలు సవాలు. తాజా సమావేశాలు ఈ సవాలును అధిగమించేందుకు అధిష్టానం చేస్తున్న కసరత్తుకు సంకేతంగా కనిపిస్తున్నాయి.

## బీజేపీకి ఎదురుదెబ్బ

- స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ ఓటమి

**జైపూర్, సెప్టెంబరు 16 (ఎ.ఎం.ఎస్):**



రాజస్తాన్‌లో అధికారంలో ఉన్న బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ నష్టాలను చవిచూసింది. అయితే స్వల్ప మెజారిటీతో ఊపిరి పీల్చుకుంది. మొత్తం 10,200 వార్డులలో బీజేపీ 4,171, కాంగ్రెస్ 3,597 స్థానాలను గెలుచుకున్నాయి. స్వతంత్రులు 2,250 స్థానాలను గెలుచుకున్నారు. ఇతర పార్టీలలో ఆప్ 42, ఆర్ఎల్‌పి 63, బీఎస్పీ 19, బీఏపీ 8 స్థానాలను గెలుచుకున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ బీజేపీ నాయకురాలు వసుంధర రాజే సింధియా ప్రాతినిధ్యం వహిస్తున్న ఝల్వార్ నగర పాలకలో కాంగ్రెస్, బీజేపీని ఓడించింది. 45 వార్డులకు గాను కాంగ్రెస్ 29 గెలుచుకోగా, బీజేపీ 13 స్థానాలకే పరిమితమైంది. ఆప్ 1, స్వతంత్రులు 2 గెలిచుకున్నారు. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ప్రాతినిధ్యం వహిస్తున్న భరత్‌పూర్ కార్పొరేషన్‌లో స్వతంత్రులకు మెజారిటీ ఉంది. మొత్తం 65 స్థానాలకు గాను 26 మంది స్వతంత్రులే ఉన్నారు. బీజేపీకి 20, కాంగ్రెస్‌కు 7, బీఎస్పీ, ఆర్ఎల్‌పిలకు చెరో సీటు లభించింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఉపాధ్యాయుల పాత్ర కీలకం: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్



**జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**జనగామ, సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి) :**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్నందున గుణాత్మక విద్య అందించాలని ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదురుగా గల జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా సైన్స్ అంశాలను బోధించారు. పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో బాస్కెట్ బాల్ మైదానాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠాలతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, విలువలు, క్రమశిక్షణ నేర్పించాలని, కష్టమైన సబ్జెక్టులపై అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సీ), భవిత కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో గౌసియా బేగం, ఎంఈఓ ప్రకాష్, హెచ్ఎం హాలియా, ఉపాధ్యాయులు

## ప్రత్యేక అవసరాల పిల్లలకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం



**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి) :**

ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు నాణ్యమైన సహాయ ఉపకరణాలు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో సమగ్ర శిక్ష, 'అలింకో' సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయ ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శిబిరానికి వచ్చిన పిల్లలకు వైద్యులు సరేన పద్ధతిలో పరీక్షలు నిర్వహించి అర్హులను గుర్తించాలని సూచించారు. తల్లిదండ్రులు ఓపికగా ఉండి నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని, ఇక్కడ గుర్తించిన వారికి త్రిసైకిళ్లు, వీల్ చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, కాలిపర్స్ వంటి ఉపకరణాలను త్వరలోనే అందిస్తామని తెలిపారు. సుమారు 149 మంది పిల్లలు హాజరైన ఈ శిబిరంలో పాల్గొన్న వారికి, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజనం, తాగునీరు వంటి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్. ప్రకాష్, సీఎంఓ నాగరాజు, అలింకో వైద్య సాంకేతిక

## రేగళ్ల తండా ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**పరిసరాల అపరిశుభ్రతపై అసంతృప్తి.. మెనూ అమలులో నిర్లక్ష్యంపై వార్డెన్‌కు షోకాజ్ నోటీసు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని రేగళ్ల తండాలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన అక్కడ చెత్తాచెదారం, అపరిశుభ్రత కనిపించడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని ఎస్ఎస్‌సీ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్...ఎస్ఎస్‌సీలో ఉన్న విద్యార్థుల సంఖ్య, గత ఏడాది ఉత్తీర్ణత శాతం, విద్యార్థుల విద్యా ప్రగతికి సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పాఠశాల వంట గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్.. విద్యార్థులకు అందుతున్న వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, భోజనం తదితర సౌకర్యాలను పరిశీలించారు. వంటశాల, నిల్వ గదులను తనిఖీ చేసి అక్కడ నిల్వ ఉన్న సరుకులు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వంటశాలలోని ఆర్వో నీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడాన్ని గమనించిన ఆయన.. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, తాగునీరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. బుధవారం మెనూలో చికెన్ అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులకు వడ్డించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తనిఖీల్లో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ పిలుపు



**ఈనెల 18, 19వ తేదీల్లో జర్నలిస్టుల దీక్షలను విజయవంతం చేయండి**

**నల్లగొండ నగర జర్నలిస్టులంతా దీక్షలలో భాగస్వాములు కావాలి**

**ఇంటి స్థలాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కదలిరండి**

**ఈ 30 ఏళ్ల పోరాటంలో విజయమే లక్ష్యంగా కలిసి నడుద్దాం**

**నల్లగొండ జిల్లా సెప్టెంబర్ 26(వుదయం ప్రతినిధి):**

నల్లగొండ పట్టణ కేంద్రంలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో ఈనెల 18,19వ తేదీల్లో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జరిగే జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మామిడి మహేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత 30 సంవత్సరాలుగా నల్లగొండ లో పనిచేసే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో జర్నలిస్టులు తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి చెందిన జర్నలిస్టులు ఇంటి స్థలంతో పాటు ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నల్లగొండ నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టుల బాధలను ప్రభుత్వం ఇప్పటికైనా అర్థం చేసుకొని ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18,19వ తేదీల్లో రెండు రోజులపాటు జరిగే రిలే నిరాహార దీక్షలో నల్లగొండ పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, చిన్న పత్రికల జర్నలిస్టులు లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 18వ తేదీన ప్రతిపక్ష పార్టీల నాయకులు దీక్షలకు సంఘీభావం తెలియజేస్తారని, 19వ తేదీన దీక్షా శిబిరాన్ని అధికార పార్టీ నేతలు ప్రజాప్రతిని సందర్శించి మద్దతు పలకనున్నారని తెలిపారు. నల్లగొండ లో జరిగే దీక్షలకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున వచ్చి సంఘీభావం తెలియజేయాలని కోరారు

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 16(వుదయం జిల్లా ప్రతినిధి):**

భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రీప్రైమరీ పాఠశాలలను జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక వసతులను పరిశీలించారు.వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాహనాలు ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల ప్రవేశాలను దాదాపు 50 శాతం పెంచడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ వసతులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, ఇంజనీర్లు కావాలనే తమ ఆకాంక్షలను వెల్లడించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ప్రీప్రైమరీ పాఠశాలలో చిన్నారులకు అందిస్తున్న అభ్యాసన పద్ధతులు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ మరుగుదొడ్లను కూడా పరిశీలించారు.పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పాఠశాలకు కిచెన్ షెడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు రుచికరంగా, నాణ్యంగా భోజనం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ లలిత, సర్పంచ్ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్ టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలి



**– రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టీకే. శ్రీదేవి**

**హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి/ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కమిషనర్ వెంకన్న, అధికారులతో మాట్లాడిన సిడిఎంఎ**

**హనుమకొండ, సెప్టెంబర్ 16 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

గ్రేటర్ వరంగల్ మహా నగరానికి సంబంధించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ప్రాజెక్ట్ కు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి.కే శ్రీదేవి అన్నారు.

బుధవారం హైదరాబాద్ నుండి గ్రేటర్ వరంగల్ మహా నగరంలో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్ సంబంధిత అంశాలు, టెండర్ ప్రక్రియ, పనులు చేపట్టే విధానంపై వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కమిషనర్ టి. వెంకన్న, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి.కే శ్రీదేవి మాట్లాడుతూ... గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కు రూపొందించిన డిపిఆర్ కు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా క్రోడీకరించి, అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి 15 రోజుల్లోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి టెండర్ల ఆహ్వానానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు సిడిఎమ్ఏకు వివరించారు. ప్రాజెక్టు కు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, సిపిఓ రవీంద్ర రాడేకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి చర్యలు వేగవంతం చేయాలి



**ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలి**

**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి) :**

లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలు తదితర పునరావాస ప్రయోజనాలు కల్పించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పునరావాస ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాఅదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం నగరంలో పాత డిఆర్డీవో కార్యాలయం ఆవరణ జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం , సెప్టెంబర్ 17 (వుదయం బ్యూరో):**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, నోటీసులు అందుకున్న వారిలో ఏ, బి, సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు.

అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## పారదర్శక ఓటరు జాబితా తయారీకి
## రాజకీయ పార్టీలు సహకరించాలి



**-జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**

**మహబూబాబాద్,సెప్టెంబర్ 16 (వుదయం) :**

పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...నోటీసుల జారీ & విస్తృత ప్రచారం: షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు జిల్లాలో సుమారు 88,800 మందికి నోటీసులు అందించామన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన గుర్తింపు కార్డులతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న బూత్ లెవెల్ అధికారులను సంప్రదించి తమ ఓటును భద్రపరుచుకోవాలని కోరారు. బిఎల్ఏల భాగస్వామ్యం: అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ద్వారా ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు భద్రపడేలా చూడాలన్నారు. ఓట్ల తొలగింపు పై స్పష్టత: నిబంధనలకు విరుద్ధంగా ఎవరి ఓటునూ తొలగించబోరని కలెక్టర్ స్పష్టం చేశారు. మరణించినవారు, వేరే ప్రాంతాలకు మారినవారు, డబుల్ ఓట్లు, మార్పులుచేర్పులు మరియు కొత్త ఓటరు నమోదు కోసం సంబంధిత ఫారమ్‌లు పూర్తి చేసి బిఎల్ఓలకు అందించాలన్నారు. బిఎల్ఓలకు రెమ్యూనరేషన్: వివిధ పార్టీల ప్రతినిధుల సూచనలపై స్పందిస్తూ, బూత్ లెవెల్ అధికారుల రెమ్యూనరేషన్‌కు సంబంధించి తక్షణ చర్యలు తీసుకున్నామని, త్వరలోనే వారికి వేతనాలు అందజేస్తామని తెలిపారు. ఆన్‌లైన్ సేవలు: డ్రాఫ్ట్ నోటిఫికేషన్, ఓటరు జాబితా మరియు ఇతర వివరాల కోసం ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చని సూచించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రతినిధి సురేష్ నాయుడు, బిఆర్ఎస్ నుండి మార్నేని వెంకన్న, బిజెపి నుండి శ్యాం సుందర్ శర్మ, టిడిపి నుండి పి.బి. రామారావు, బిఎస్పీ నుండి ఎల్. విజయ్ కాంత్, సిపిఐ నుండి విజయ్ సారధిలతో పాటు మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏఓ పవన్ కుమార్, మహబూబాబాద్ తహసీల్దార్ రాజేశ్వర్ మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉల్లాస్ పరీక్షల లక్ష్యాన్ని పూర్తి చేయాలి



**ప్రతి మహిళ పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోండి.**

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

**వరంగల్ జిల్లా సెప్టెంబర్ 16. (వుదయం ప్రతినిధి):**

జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా సెప్టెంబర్ 20న నిర్వహించనున్న ఉల్లాస్ పరీక్షలను విజయవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఉల్లాస్ పోర్టల్‌లో నమోదైన ప్రతి మహిళ పరీక్షకు హాజరయ్యేలా మండల స్థాయిలోని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులకు ముందస్తుగా అవగాహన కల్పించి, పరీక్షకు హాజరయ్యేలా చూడాలన్నారు. మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లను పెంచి, జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ నాగపద్మజ, డీఈఓ రంగయ్య నాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, డీఎంసీ రేణుక, ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్ సదానందం, జిల్లా ఉల్లాస్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాక్సినేషన్ సేవలు పక్కాగా అందాలి



**– డిఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి**

**వరంగల్, సెప్టెంబర్ 16(వుదయం):**

కేశవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, లక్ష్మీపురం సబ్ సెంటర్‌లో నిర్వహించిన ఇమ్యూనైజేషన్ సెషన్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి హెచ్ సిలో రికార్డులను పరిశీలించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్నింటినీ సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. లక్ష్మీపురం సబ్ సెంటర్‌లో వ్యాక్సినేషన్ రిజిస్టర్లు, సెషన్ నిర్వహణను పరిశీలించిన ఆయన మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం టీకాలు, అర్హులైన చిన్నారులు, గర్భిణులందరికీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలి.

ఇమ్యూనైజేషన్ సెషన్‌కు ముందే 'డ్యూ లిస్ట్' (Due List) ప్రకారం లబ్ధిదారులను గుర్తించి సెషన్‌కు వచ్చేలా మొబిలైజ్ చేయాలి. మెరుగైన సేవలకోసం స్థానిక ప్రజలకు నిరంతరం నాణ్యమైన వైద్యాంశాలను అందిస్తూ సేవల ప్రమాణాలను మరింత మెరుగుపరచాలి.

ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సేవలో వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ ముందుండాలి



**విద్యానగర్ లో నూతన కార్యాలయం ప్రారంభం**

**సూర్యాపేట, సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి):**

పేదవారికి సేవ చేయడంలో వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ ముందుండాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు మొరిశెట్టి లక్ష్మాధి, ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో బుధవారం వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కార్యాలయాన్ని వారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతోమంది పేద విద్యార్థులు విద్య, వైద్యం, అగ్రికల్చర్ వంటి ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి అండగా ఉండేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం కూడా చేయని పనులను స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయని కొనియాడారు. వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మహంకాళి రవీందర్ రావు మాట్లాడుతూ.. ప్రథమంగా పేద ప్రజలకు సేవలు అందించేందుకు సూర్యాపేటలో కార్యాలయం ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల చంద్రశేఖర్, గౌరవ సలహాదారులు రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చల్లా సత్యనారాయణ, కార్యదర్శి ఖమ్మంపాటి రేణుబాబు, కోశాధికారి బచ్చు పురుషోత్తం, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, ఈసీ సభ్యులు మొలుగూరి శోభారాణి, పల్లెల ప్రసాద్ రావు, సుంకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుధారాణి, అమరేందర్ రెడ్డి, బొడ్డుపల్లి సతీష్, గజ్జి నవీన్, ఉయ్యాల నర్సయ్య, మామిడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా చారిత్రక, సాంస్కృతిక విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి**

**భూపాలపల్లి: సెప్టెంబర్ 16 (వుదయం విలేకరి):**

ఈ నెల 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చాంబర్ లో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటక ప్రాధాన్యత, జిల్లా చారిత్రక, సాంస్కృతిక విశిష్టతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచనలతో అదనపు కలెక్టర్ జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. నోడల్ అధికారి ఆధ్వర్యంలో జిల్లా పర్యాటక అధికారి, డిపిఆర్వో, డీఈఓ, ఇంటర్మీడియట్, డిపిఓ, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు, జిల్లా సైన్స్ అధికారి సభ్యులుగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటికే ఈ నెల 15న మండల స్థాయి పోటీలు నిర్వహించగా, 22న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, నాటిక, చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపిస్తామని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించే పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆమె కోరారు. కార్యక్రమాలను నోడల్ అధికారి పర్యవేక్షణలో సంబంధిత కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి రఘు, డిపిఆర్వో శ్రీనివాస్, డీఈఓ లలిత, ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న, డిపిఓ శ్రీలత, జిల్లా సైన్స్ అధికారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## మద్యం తాగితే.. స్టీరింగ్ పట్టొద్దు

- గణపతి నిమజ్జనం వేళ డ్రైవర్లకు సీఐ వార్నింగ్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి):**
గణపతి నిమజ్జనం సందర్భంగా మద్యం సేవించి ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునీల్‌కుమార్ హెచ్చరించారు. నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.బుధవారం ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సుమారు 70 మంది ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్‌పై గణపతి విగ్రహం ఉన్న సమయంలో విద్యుత్ వైర్లు, లైట్లు, చెట్లు తదితరాలను గమనిస్తూ అప్రమత్తంగా వాహనం నడపాలని తెలిపారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి డ్రైవర్ తన ట్రాక్టర్‌తో అందుబాటులో ఉండాలని సూచించారు.గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ కోరారు.

## బుగ్గారం మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటన...

- పలు నిర్మాణ భవనాలు జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ...

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి)**
బుగ్గారం మండలంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బుధవారం పర్యటించి పలు అభివృద్ధి పనులు నిర్మాణంలో ఉన్న భవనాలు జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆయా పనుల పురోగతిని పరిశీలించి నిర్మాణ నాణ్యతలను సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా చిన్నాపూర్ గ్రామంలోని వీవో భవనాన్ని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించిగా ఈ భవన నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ( ఎంజిఎన్ఆర్ఇజిఎస్) ద్వారా 10 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు అనంతరం చిన్నాపూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు పంచాయతీ భవన నిర్మాణానికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా 20 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు అనంతరం బుగ్గారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీ హెచ్ సి) భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు ఈ భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 1.43 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు అధికారులు



వివరించారు నిర్మాణ పనుల నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు అలాగే నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంజూరైన నిధులను నిబంధనల మేరకు సక్రమంగా వినియోగిస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు

**జిల్లా పరిషత్ పాఠశాల ఆకస్మిక తనిఖీ**

**బుగ్గారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు**

పాఠశాలలోని 10వ తరగతి గదిలో విద్యార్థులతో పాటు 20 నిమిషాలు ఉపాధ్యాయుడు బోధిస్తున్న సైన్స్ పాఠ్యంశాన్ని నిశితంగా పరిశీలించారు తరగతి గదిలో ప్రతి విద్యార్థి శ్రద్ధతో విద్య నేర్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధనా సౌకర్యాలు తరగతి గదులు ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల విద్య ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు పాఠశాలలోని గ్రంథాలయ భవన నిర్మాణానికి ఎం పి ఎల్ ఏ డి ఎస్ నిధుల ద్వారా 25 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు విద్యా సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు

ఈ పర్యటనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ డిఈవో కె రాము ఈఈపిఆర్ ఎన్ లక్ష్మణరావు డీఈఈ (పీఆర్) సబ్ డివిజన్ ధర్మపురి కె గోపాల్ డీఈవో బుగ్గారం ఎంపీడీఓ ఎం సుమంత్ బుగ్గారం తహసిల్దార్ వినోద్ ఎంపీఓ స్థానిక ప్రజా ప్రతినిధులు ఏఈఈ (పీఆర్) ఏపీఎం ఏపీవో తదితర అధికారులు పాల్గొన్నారు



## ముస్లిం మత పెద్దలతో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS సమావేశం

**నిర్మల్ జిల్లా 16 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**
నిర్మల్ జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో మరియు సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో ప్రజల మధ్య ఉన్న సోదరభావం, పరస్పర సహకారం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు.ముస్లిం మత పెద్దలు తమ చిన్ననాటి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు. గతంలో గణేష్ ఉత్సవాల సమయంలో హిందూ సోదరులతో కలిసి పాల్గొన్న సందర్భాలను గుర్తుచేసుకుంటూ, నిర్మల్‌లో ప్రజల మధ్య ఉన్న స్నేహభావం, సోదరభావం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లు, తమకు ఉన్న సూచనలు మరియు సమస్యలను మత పెద్దలు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సూచనలు, అభ్యర్థనలను జిల్లా ఎస్పీ సానుకూలంగా విని, ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసు శాఖ అందుబాటులో ఉంటుందని, అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.ప్రజలందరూ తనకు సమానమేనని, ఎవరికైనా ఏదైనా సమస్య లేదా ఇబ్బంది ఎదురైతే తనను సంప్రదించవచ్చని, వారి సమస్యలను విని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఉత్సవాలు, శోభాయాత్ర మరియు నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రజలందరి సహకారంతో నిర్మల్ జిల్లాలో శాంతి, సోదరభావం మరియు పరస్పర గౌరవంతో గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPSతో పాటు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సమ్మయ్య మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 30లోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ప్రతి రైతు సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- డిజిటల్ పంటల సర్వే లేక ఏ ఒక్క రైతు కూడా సన్న రకం ధాన్యం బోనస్ కోల్పోకూడదు*
- రైతులతో సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తి చేయాలి*
- డిజిటల్ పంటల సర్వేపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్*



**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి)**
ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను వేగవంతం చేసి, సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డిజిటల్ పంటల సర్వేపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న డిజిటల్ పంటల సర్వే పురోగతి, రైతుల సాగు వివరాల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సెప్టెంబర్ 30లోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సన్న రకం ధాన్యంసాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని తెలిపారు. డిజిటల్ పంటల సర్వే పూర్తికాకపోవడం వల్ల సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న ఏ ఒక్క రైతు కూడా బోనస్ కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతుకు సంబంధించిన పంట వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. రైతుల నుంచి అవసరమైన వివరాలను సేకరించి, సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా జాప్యం ఉంటే వెంటనే గుర్తించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎంపిక చేయబడిన వాలంటీర్లను పర్యవేక్షిస్తూ,ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా డిజిటల్ పంటల సర్వేను పూర్తిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే విద్యా బోధన చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత.**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి)**
ప్రభుత్వం పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం గన్నారంలోగల తెలంగాణ మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను ఆకసికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంటశాల, సరుకుల నిల్వ గది, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో పఠనా సామర్థ్యాన్ని





నిర్వహించి వారికి అర్థమయ్యే రీతిలో పాటలను బోధించాలని, విద్యార్థులు 100 శాతం గురుకులంలో ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, గురుకుల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్ లో రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం



- 49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం
- ప్రభుత్వ పాఠశాలల బలాపేతం ఈ పథకం యొక్క ముఖ్య లక్ష్యం
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి):**
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు వెళ్లకుండా వారికి నాణ్యమైన పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించడమే ముఖ్య ఉద్దేశంతో ఈ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుంది. కరీంనగర్ మార్కెట్ యార్డ్ లో తెలంగాణ ప్రభుత్వం హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్నర్ గారు కలిసి సుమారు 8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మరియు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్ లో ఏర్పాటుచేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఒంటరి పున్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు నిధులు వంటి ఆస్తులు ఉండేవి ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమే అన్నారు. ఉన్నత చదువులు చదివిన కుటుంబాల మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని గురించి అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడు అని పోషకాహారాలతో కూడిన అల్పాహారాన్ని అందించడం ద్వారా ఏకాగ్రత సామర్థ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని ఈ కార్యక్రమం ద్వారా మధ్య పేద మధ్యతరగతి తరగతి కుటుంబాలకు ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా ఆర్థికంగా సమయపరంగా ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. కరీంనగర్లో ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా సుమారు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని తెలిపారు 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు 11 జూనియర్ కళాశాలకు ఈ బ్రేక్ ఫాస్ట్ సేవలు అందుతాయని తెలియజేశారు. కరీంనగర్ హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గలకు అల్పాహారం అందుతుంది. వారంలో ఆరు రకాల అల్పాహారాలను ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అందజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1772,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతి పాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆదనపు కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆకుల నరసన్న,ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

## కళా భారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలి



**కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నిజామాబాద్ సెప్టెంబర్ 16 :**
జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ స్థలంలో నిర్మిస్తున్న కళా భారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. బుధవారం ఆయన ఆడిటోరియం పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వేడుకల కోసం అధునాతన సదుపాయాలతో గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదు అంతస్తులతో నిర్మిస్తున్న భవన సముదాయం పనుల వివరాల గురించి ఆర్ అండ్ బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేదిక, రెండు బ్యాంకెట్ హాల్స్, సుమారు 1400 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీ పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఫ్రేమ్ వర్క్ పూర్తయినందున మిగతా పనులను కూడా వేగవంతంగా జరిపించాలని కలెక్టర్ సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలో సరైన వేదికలు లేనందున కళాభారతి ఆడిటోరియం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నాణ్యతతో జరిగేలా చూడాలన్నారు. పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సూచించారు.



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అనువైన స్థలాల పరిశీలన అన్ని హంగులతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయాల నిర్మాణాల కోసం ఎంపిక చేసిన స్థలాలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం పరిశీలించారు. గుండారం గ్రామంతో పాటు, నాగారం నందిగుట్ట ప్రాంతాల్లోని స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆర్ అండ్ బీ ఈ.ఈ ప్రవీణ్, రెవెన్యూ శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.






## శాంతిభద్రతలు,మహిళల భద్రతపై ప్రత్యేక నిఘా పెట్టాలి

**రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 16(వుదయం ప్రతినిధి)**
రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ స్టేషన్ ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ జాడి శ్రీధర్, మందమర్రి సిఐ పర్స రమేష్ లు సిపి అంబర్ కిషోర్ ఝా కు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. సిపి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ తో కలిసి స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, 5ఎస్ విధానం అమలుపై అధికారులకు సూచనలు చేశారు.స్టేషన్‌లో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, పెట్రోలింగ్‌పై వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.హైవే,q రైల్వేస్టేషన్, కొత్త కాలనీల నేపథ్యంలో శాంతిభద్రతలు, రహదారి, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రైలు, రోడ్డు మార్గాల్లో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా పెంచాలని సూచించారు. కొత్త కాలనీల్లో వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ బ్లూకోట్స్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యటించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ బాగుందని అభినందిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ!





- సామ్, మామ్, ఎస్‌యూడబ్ల్యూ పిల్లలపై ప్రత్యేక దృష్టి.
- ప్రతి నెలా ఎత్తు, బరువు నమోదు తప్పనిసరి.
- అంగన్‌వాడీల్లో మెనూ ప్రకారం వేడి భోజనం.
- కలెక్టర్ గరిమ అగ్రవాల్.

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 16 (వుదయం ప్రతినిధి) :**
జిల్లాలో పోషణ మాసం కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9 నుంచి అక్టోబరు 8 వరకు నిర్వహించనున్న 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలపై బుధవారం ఐడీఓసీలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు.అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెలా తప్పనిసరిగా నమోదు చేసి, వివరాలను అంగన్‌వాడీ యాప్‌లో పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. సామ్, మామ్, ఎస్‌యూడబ్ల్యూ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వారి ఇళ్లకు వెళ్లి పోషకాహారం, సంరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

బాలామృతం, బాలామృతం ప్లస్ అందించాలని తెలిపారు,ఎదుగుదల లోపం, ఇతర ఆరోగ్య సమస్యలున్న పిల్లలను డీఈఐసీ కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి అదనపు పోషకాహారం అందించడంతోపాటు వైద్యశాఖ సమన్వయంతో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.'మన అంగన్‌వాడీ.. మన బాధ్యత'లో భాగంగా అన్ని కేంద్రాల్లో లైట్లు,

ఫ్యాన్లు, ఆర్వో వాటర్ తదితర వసతులు కల్పించాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వేడిగా అందించాలని ఆదేశించారు.ఈ నెల 21న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, డీపీఓ అఫ్జల్ బేగం, డీసీఎస్ఓ డీఎం గోపాల్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి గణేష్ మండపాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్





**కామారెడ్డి, సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి):-**
వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వినాయక చవితి వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసు అధికారులు చేపడుతున్న చర్యలను ఆయన అభినందించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తూ పండుగను ఆనందోత్సాహాలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు,

భక్తులు పాల్గొన్నారు. గణేష్ నిమజ్జనం రూట్ మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గణేష్ నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనం కోసం రూపొందించిన రూట్ మ్యాప్‌ను ప్రత్యేక బస్సులో ప్రయాణిస్తూ పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా గణేష్ విగ్రహాల ఊరేగింపుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ మళ్లింపులు,

భద్రతా ఏర్పాట్లపై అధికారులు సమీక్షించారు. ప్రధాన మార్గాల్లో భక్తులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులకు సహకరించి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, తహసిల్దార్ హిమబిందు, టౌన్ సీఐ నరహరి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- నారాయణపేట ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య

నారాయణపేట సెప్టెంబర్ 16(వుదయం ప్రతినిధి)



రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు సైబర్ నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని నారాయణపేట ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన వుదయం ప్రతినిధితో మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలు, విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి అవసరమైన పత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, లింకులు, నకిలీ పెట్టుబడి పథకాలు, కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే సందేశాలను నమ్మరాదని హెచ్చరించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని లేదా అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు సమాచారం అందించాలని తెలిపారు. సమయానికి ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించడంతో పాటు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం ద్వారా ఆర్థిక నష్టాలను నివారించవచ్చని ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య తెలిపారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత సమాజ నిర్మాణానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

- అపశృతులకు తావులేకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ టి. శ్రీనివాసరావు
- బీచుపల్లి, నది అగ్రహారం ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు

గద్వాల, సెప్టెంబర్ 16 (వుదయం కరస్పాండెంట్)



వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్., అధికారులను ఆదేశించారు. బుధవారం బీచుపల్లి కృష్ణా నది పుష్కర ఘాట్లు, గద్వాల నది అగ్రహారం పుష్కర ఘాట్లను కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనానికి భారీ సంఖ్యలో భక్తులు, విగ్రహాలతో వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.
భారీ విగ్రహాలు తరలించే వాహనాలు సులభంగా ఘాట్లకు చేరుకునేలా తాత్కాలిక రహదారులను చదును చేసి, అవసరమైన చోట్ల మట్టి, మొరం, రాళ్లతో రహదారులను బలోపేతం చేయాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా తగినంత విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు, చిన్న విగ్రహాలు, భారీ విగ్రహాలతో వచ్చే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసి, బారికేడింగ్‌తో పాటు సమర్థవంతమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలోకి అనవసర వాహనాలను అనుమతించకుండా, భక్తుల రద్దీని నియంత్రిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

**అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలి**

నిమజ్జన సమయంలో అనుకోని పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా జేసీబీలు, క్రేన్లు, రోలర్లు, అగ్నిమాపక వాహనాలు, 108 అంబులెన్స్ సేవలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు.
నదిలో భద్రత కోసం మత్స్యకారులు, గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా విధుల్లో నియమించి, నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఏర్పాట్లలో వినియోగించే వాహనాలు, యంత్రాల వినియోగానికి సంబంధించిన డ్యూటీ వివరాలు, సిబ్బంది హాజరు, సంతకాలు, రోజువారీ కార్యకలాపాల రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.
అన్ని శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అంశాన్ని ముందుగానే పర్యవేక్షించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా విజయవంతం చేయాలని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఏఈఈ సతీష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎస్ఈ కి వినతి పత్రం అందజేసిన బి కే ఎస్

నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 16(వుదయం ప్రతినిధి)

భారతీయ కిసాన్ సంఘ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో రైతులకు కనీసం 18 గంటల నాణ్యమైన విద్యుత్తును అందించాలని కోరుతూ జిల్లా సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, బి. కె. ఎస్ నాయకులు ఎస్ ఈ కి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ గత కొంతకాలంగా వ్యవసాయ పొలాలకు సరైన సమయంలో విద్యుత్ అందడం లేదని ఉన్నత స్థాయి అధికారులు వెంటనే స్పందించి పంట పొలాలకు నాణ్యమైన విద్యుత్తును అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి భౌరంపేట మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు పోకల యాదగిరి, జిల్లా కార్యదర్శి కాటం అయిలేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దంతూరి కుమారస్వామి, జిల్లా కార్యాలయ ప్రముఖ్ రావి నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పిన్నపురెడ్డి ,సుధీర్ రెడ్డి ,పడమటి నర్సింహారెడ్డి, బర్మా జంగయ్య, జాలిగామ మల్లయ్య, తుర్కపల్లి మండల అధ్యక్షులు కడియాల అశోక్, రాజాపేట మండల అధ్యక్షులు పారుపల్లి సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ అంశాలకు ప్రథమ ప్రాధాన్యత

- ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దు..
- ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు రూపకల్పన..
- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి..
- క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి..
- త్వరలో నూతన సబ్ స్టేషన్లు, నందిగామ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం..
- ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయండి..
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- నియోజకవర్గస్థాయి ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం

పటాన్చెరు (వుదయం):



ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన తాగునీరు సరఫరా, నిరంతర విద్యుత్ పంపిణీ, పారిశుధ్యం, తదితర అంశాల్లో అలసత్వం వహించవద్దని.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నత అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. బుధవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్, పటాన్చెరు బల్దియా డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్లు, విద్యుత్, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల శాఖల అధికారులతో వివిధ అంశాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో 345 కోట్ల రూపాయలతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కిష్టారెడ్డి పేట, అమీన్పూర్, తెల్లాపూర్ పరిధిలో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు తరగతులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధునిక వసతులు.. అత్యాధునిక సౌకర్యాలతో వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా పవర్ ట్రాన్స్ఫార్మర్లు, నూతన సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో పోచారం, లకడారం సబ్ స్టేషన్లు ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. నూతన కాలనీలలో పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.
శిథిలావస్థకు చేరుకున్న స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని.. అవసరమైతే సొంత నిధులతో స్తంభాలు కొనుగోలు చేసి ఇస్తానని అధికారులకు తెలిపారు.
అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. టెండర్లు పూర్తయి శంకుస్థాపన చేసిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, గుమ్మడిదల, జిన్నారం మున్సిపాలిటీల పరిధిలో 75 కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. 50 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగిలిన పనులు త్వరలో పూర్తి చేయనున్నట్లు కమిషనర్లు తెలిపారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు.. అవసరమైతే బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. పన్ను సవరణ అంశంలో ప్రజలకు భారం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసినప్పుడే ప్రజల నమ్మకాన్ని పొందుతామని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని.. అభివృద్ధిలో కలిసి పనిచేయాలని కోరారు.పటాన్చెరు, గుమ్మడిదల మండలాల పరిధిలోని గ్రామాలలో ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. పటాన్చెరువు మండల పరిధిలోని నందిగామ గ్రామంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.
ప్రభుత్వ శాఖల అధికారులు ప్రతి నెలకు ఒకసారి అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహిస్తూ.. సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని.. నిధుల కొరత ఉంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

## వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



మహబూబ్ నగర్ సెప్టెంబర్ 16(వుదయం ప్రతినిధి)

దేవరకద్ర మున్సిపాలిటీలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం గుర్తించిన చెరువులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం పరిశీలించారు. నిమజ్జనానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.వినాయక విగ్రహాల నిమజ్జనం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ కమిషనర్, ఎం.పి.డి.ఓ., మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. సౌజన్య

సిద్దిపేట, సెప్టెంబర్ 16 (వుదయం బ్యూరో)

ప్రజలు తమ హక్కులు, బాధ్యతలతో పాటు చట్టపరమైన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఎంతైనా అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. సౌజన్య పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ (హైదరాబాద్), సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి వర్సెస్ ఛైర్మన్ జి. సుదర్శన్ ఆదేశాల మేరకు, సిద్దిపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మిట్టపల్లి గ్రామంలో బుధవారం రైతు వేదికలో "చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీమతి కె. సౌజన్య మాట్లాడుతూ... ముఖ్యంగా రైతులు తమకు సంబంధించిన వివిధ చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, న్యాయ పరిరక్షణ మరియు ఉచిత న్యాయ సాయం గురించిన వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, ప్రజలు తమ సమస్యలను సంస్థ దృష్టికి తీసుకువచ్చి చట్టపరమైన సహాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట III టౌన్ సీఐ టి. లక్ష్మి బాబు, మిట్టపల్లి ఏవో డి. శ్రీనాథ్, సిద్దిపేట అర్బన్ ఆర్ఐ కె. నవీన్ కుమార్, మిట్టపల్లి సర్పంచ్ సిహెచ్. శ్రీనివాస్, పొండవుపురం సర్పంచ్ ఎ. శంకర్, మిట్టపల్లి ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ జి. రమేష్ తో పాటు పెద్ద ఎత్తున రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బండపల్లి గ్రామ పంచాయతీకి ₹30,000 విలువైన మైక్ సెట్ విరాళం



వనపర్తి సెప్టెంబర్ 15 (వుదయం ప్రతినిధి)

బండపల్లి గ్రామ పంచాయతీకి మైక్ సెట్ వితరణబండపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీకి 30 వేల విలువ గల మైక్ సెట్ ను దాతలు కొమారి రఘుపతి నాయుడు మాజీ ఉప సర్పంచ్ అదే విధంగా జ్ఞానమూర్తి సూర్యనారాయణ వీరాంజనేయులు,శివకుమార్, రాముడు కలిసి ఇప్పించడం జరిగింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం జరిగిన, అలాగే గ్రామంలో పండుగల సందర్భంగా గ్రామ ప్రజలకు భక్తి భావాలు పెంపొందించుటకు ఇట్టి మైకులు ఉపయోగించుకోవాలని, గ్రామపంచాయతీ సెక్రటరీ వసంత,సర్పంచి గారి ఆధ్వర్యంలో ఇట్టి మైకు ను వినియోగించుకుని కార్యక్రమాలు నిర్వహించుకోవాలని దాతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉసేనమ్మ లక్ష్మయ్య నాయుడు,నాగరాజు వార్డ్ మెంబర్, తిరుపతయ్య,నరసింహ, శివ కృష్ణ, బలరాం, సుధాకర్, బాల గణేష్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## 80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాలు కూల్చాలా?

- రూ.18 కోట్ల నిధులు తెచ్చింది నేను.. ఫిర్యాదులతో పనులు ఆపించేది స్థానిక ఎమ్మెల్యే
- కూల్చివేతలు లేకుండానే బైపాస్ రోడ్డు అభివృద్ధి చేస్తాం: జగ్గారెడ్డి

సంగారెడ్డి వుదయం :

సంగారెడ్డి పట్టణ బైపాస్ రోడ్డు అభివృద్ధిపై రాజకీయంగా మాటల యుద్ధం మొదలైంది. ప్రజలు, వ్యాపారులకు ఆస్తి నష్టం కలగకుండా రోడ్డు అభివృద్ధి చేపట్టాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులతో కలిసి బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు బైపాస్ రోడ్డును కాలినడకన పరిశీలించారు. రహదారి విస్తీర్ణాన్ని అధికారులతో కొలతలు తీయించి, అభివృద్ధి పనులపై చర్చించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ బైపాస్ రోడ్డు అభివృద్ధి కోసం తాను రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. అయితే రోడ్డు విస్తరణ పేరుతో భవనాలు, దుకాణాలు, మెట్లు కూల్చివేసి ప్రజలకు నష్టం కలిగించే విధానం సరికాదన్నారు.

**80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాలా?**

80 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడితే సుమారు 180 భవనాలను తొలగించాల్సి వస్తుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో భవనాలను కూల్చివేస్తే యజమానులకు కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని, అది ఆచరణలో సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. కూల్చివేతలు లేకుండానే 50 అడుగుల రహదారిని అభివృద్ధి చేసే అవకాశం ఉందని తెలిపారు.

**ఫిర్యాదులతో పనులు నిలిపివేస్తున్నారు**

తాను రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే అధికారులకు ఫిర్యాదులు చేస్తూ పనులను అడ్డుకుంటున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు.

**ప్రజల మధ్యకు రావాలి**

స్థానిక ఎమ్మెల్యేకు నిజంగానే 80 అడుగుల రోడ్డు అవసరమని భావిస్తే బైపాస్ రోడ్డుపై ప్రజల మధ్యకు వచ్చి తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ఇళ్లు, దుకాణాలు తొలగించి ప్రజలకు ఆస్తి నష్టం కలిగించడం కాకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రహదారి అభివృద్ధి చేయాలన్నదే తన ఉద్దేశమన్నారు.బిల్డింగ్ యజమానులు, ఫుట్ పాత్ వ్యాపారులకు నష్టం లేకుండా, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా బైపాస్ రోడ్డు అభివృద్ధి చేపట్టాలని అధికారులకు సూచించారు.



## మాయమైపోతున్నాడమ్మో... మనిషి అన్నవాడు!

- వికారాబాద్‌లో వృద్ధుడి గోడు నుంచి తెలంగాణ సమాజం ముందున్న పెద్ద ప్రశ్న వరకు

వికారాబాద్ సెప్టెంబర్ 16 (వుదయం బ్యూరో)

ఒకప్పుడు ఇంట్లో వృద్ధుడు ఉంటే అది కుటుంబానికి బలం. తల్లిదండ్రులు ఉంటే పిల్లలకు ధైర్యం. తాతయ్య, అమ్మమ్మలు ఉంటే మనవళ్లకు అనుభవాల పాఠశాల. కానీ కాలం మారుతోంది. పిల్లలు చదువులు, ఉద్యోగాల కోసం నగరాలు, ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్తున్నారు. కుటుంబాలు చిన్నవుతున్నాయి. ఈ మార్పు సహజమే అయినా, వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండ ఎవరు అనే ప్రశ్న మాత్రం తీవ్రమవుతోంది. వికారాబాద్ జిల్లాలో తాజాగా వెలుగులోకి వచ్చిన వృద్ధుడి గోడు ఈ ప్రశ్నను సమాజం ముందుంచింది.

**ఆస్తి పంచిన తండ్రి... చివరికి అండ కోసం అధికారుల వద్దకు!**

పరిగి మండలం లక్నాపూర్‌కు చెందిన హన్మంత్‌రెడ్డి తన ఇద్దరు కుమారులకు చెరో ఏడెకరాల చొప్పున భూమి ఇచ్చినట్లు వార్తా కథనం పేర్కొంది. భార్య మరణించిన తర్వాత కుమారుల వద్ద ఉంటున్నానని, తనను ఇంటి నుంచి బయటకు పంపించారని, సరైన ఆహారం అందడం లేదని ఆయన అధికారులను ఆశ్రయించినట్లు కథనాలు తెలిపాయి. తనకు మిగిలిన భూమిని అప్పగిస్తే దాన్ని కౌలుకు ఇచ్చుకుని వచ్చిన ఆదాయంతో జీవిస్తానని ఆయన కోరినట్లు వార్తల్లో వచ్చింది. ఈ ఆరోపణలు సంబంధిత అధికారులు, చట్టపరమైన వ్యవస్థ పరిశీలించాల్సిన అంశాలు. అయితే ఈ ఘటన మన ముందుంచే సామాజిక ప్రశ్న మాత్రం పెద్దది. జీవితాంతం పిల్లల కోసం కష్టపడిన తండ్రి వృద్ధాప్యంలో “నేను ఎలా బతకాలి?” అని అడగాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి?



**వృద్ధాప్యం శాపం కాకూడదు**

వృద్ధాప్యం ఎవరికీ తప్పదు. ఈరోజు తల్లిదండ్రులుగా ఉన్నవారు రేపు వృద్ధులు అవుతారు. అందుకే వృద్ధుల సమస్యను కుటుంబ సమస్యగా మాత్రమే కాకుండా సామాజిక సమస్యగా చూడాలి. పిల్లలు దూరంగా ఉంటే పొరుగువారు, బంధువులు, స్థానిక సంస్థలు, ఆరోగ్య సిబ్బంది, పోలీసులు తమ పరిధిలో సహకరించే వ్యవస్థ ఉండాలి. ఒంటరిగా నివసించే వృద్ధుల భద్రత, ఆరోగ్యం, అత్యవసర సంప్రదింపు వివరాలపై కుటుంబాలు ముందుగానే శ్రద్ధ చూపాలి.

**మార్పల్లి ఘటన కూడా మరో హెచ్చరిక**

2025 ఫిబ్రవరిలో వికారాబాద్ జిల్లా మార్పల్లిలో 60 ఏళ్ల మహిళ మృతదేహం అనుమానాస్పద పరిస్థితుల్లో లభించిన ఘటన వార్తల్లోకి వచ్చింది. భర్త మరణించిన తర్వాత ఆమె ఒంటరిగా జీవిస్తున్నట్లు వార్తా కథనం పేర్కొంది. ఆమె మృతదేహం బావిలో లభించగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనను కుటుంబ నిర్లక్ష్యానికి నేరుగా ఉదాహరణగా నిర్ధారించడం సరికాదు. అయితే ఒంటరిగా నివసించే వృద్ధుల భద్రత ఎంత సున్నితమైన అంశమో మాత్రం ఇది గుర్తుచేస్తుంది.

**ఒంటరితనం... కనిపించని ప్రమాదం**

ఆకలి కనిపిస్తుంది. అనారోగ్యం కనిపిస్తుంది. గాయం కనిపిస్తుంది. కానీ ఒంటరితనం కనిపించదు. ఫోన్ మోగకపోవడం, తలుపు తట్టే మనిషి లేకపోవడం, అనారోగ్య సమయంలో నీళ్లు అందించే వ్యక్తి లేకపోవడం, పండుగ రోజున కూడా ఒంటరిగా ఉండటం—వృద్ధుల జీవితంలో ఇవన్నీ తీవ్ర ప్రభావం చూపే పరిస్థితులు. మనిషికి ఆహారం ఎంత అవసరమో, ఆప్యాయత కూడా అంతే అవసరం.

**ఆస్తి ఇవ్వడం బాధ్యతను ముగించదు**

తల్లిదండ్రులు భూములు ఇస్తారు. ఇళ్లు కడతారు. పిల్లల చదువులకు ఖర్చు చేస్తారు. అప్పులు చేస్తారు. చివరికి తమకున్న ఆస్తిని కూడా పిల్లలకు అప్పగిస్తారు. కానీ ఆస్తి పంచడంతో తల్లిదండ్రుల పట్ల బాధ్యత ముగియదు. ఆస్తి పత్రంపై సంతకం ఒకటి... తల్లిదండ్రుల పట్ల బాధ్యత మరొకటి.

**ప్రభుత్వం మాత్రమే కాదు... సమాజం కూడా**

ఒంటరిగా నివసించే వృద్ధులను గుర్తించడం, వారి అత్యవసర సంప్రదింపు వివరాలు నమోదు చేయడం, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం, అవసరమైనప్పుడు పోలీసు లేదా వైద్య సహాయం అందేలా చూడడం వంటి చర్యలను స్థానిక సంస్థలు బలోపేతం చేయాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఆరోగ్య సిబ్బంది, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, పొరుగువారు కలిసి పనిచేస్తే వృద్ధులకు ఒక సామాజిక భద్రతా వలయం ఏర్పడుతుంది.

**పిల్లలకు డబ్బు సంపాదించడం మాత్రమే నేర్పకండి**

పిల్లలు పెద్ద చదువులు చదవాలి. మంచి ఉద్యోగాలు పొందాలి. ఆర్థికంగా ఎదగాలి. కానీ అదే సమయంలో తల్లిదండ్రులను గౌరవించడం, వృద్ధులను ఆదరించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, సమాజం పట్ల బాధ్యతగా ఉండడం కూడా నేర్పాలి. విద్య ఉద్యోగాన్ని ఇవ్వాలి... విలువలు మనిషిని మనిషిగా నిలబెట్టాలి.

**వికారాబాద్ ఘటన ఇచ్చే పాఠం**

లక్నాపూర్ వృద్ధుడి గోడు ఒక కుటుంబ సమస్యగా మాత్రమే మిగిలిపోకూడదు. వృద్ధుల భద్రతపై ముందుగానే ఆలోచించాల్సిన అవసరాన్ని ఇది గుర్తుచేస్తోంది. వారు సమస్య చెప్పేంత వరకు వేచి ఉండకూడదు. వారి ఆరోగ్యం, ఆర్థిక భద్రత, నివాస పరిస్థితి, కుటుంబ సంబంధాలు గురించి ముందుగానే శ్రద్ధ తీసుకోవాలి. వృద్ధాప్యంలో వారికి ముఖ్యంగా కావాల్సింది కేవలం డబ్బు కాదు—మనిషి తోడు.

**ఇది మనందరి భవిష్యత్తు**

ఈరోజు వృద్ధులను చూస్తూ “వాళ్ల సమస్య” అనుకుంటే రేపు అదే వయసులో మనం కూడా ఉండవచ్చు. తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న పరిస్థితులు మన భవిష్యత్తుకు హెచ్చరికలు. వృద్ధుల గౌరవం గురించి మాట్లాడటం అంటే కేవలం గత తరాన్ని గౌరవించడం కాదు—మన భవిష్యత్తును గౌరవించడం. చనిపోయిన తర్వాత బంధువులు పరుగెత్తుకుంటూ రావచ్చు. అంతిమ సంస్కారాలు ఘనంగా చేయవచ్చు. సంతాప సభలు పెట్టవచ్చు. కానీ బతికున్నప్పుడు తల్లిదండ్రుల పక్కన కూర్చోవడం, వారి మాట వినడం, అనారోగ్యంలో సేవ చేయడం, ఒక్కసారి “నేను ఉన్నాను” అని చెప్పడం—ఇవే నిజమైన మానవత్వానికి గుర్తులు. ఆస్తులు మిగులుతాయి. డబ్బు మిగులుతుంది. ఇళ్లు, భూములు మిగులుతాయి. కానీ మనిషి బతికున్నప్పుడు చూపించిన ప్రేమే అతని జీవితానికి అసలైన విలువ.

**చివరికి మిగిలేది ఆస్తి కాదు... ఆప్యాయత!**

తల్లిదండ్రులు ఉన్నప్పుడే పలకరించండి. వృద్ధులు ఉన్నప్పుడే వారి చేతిని పట్టుకోండి. ఒంటరిగా ఉన్నవారికి “మీకు మేమున్నాం” అని చెప్పండి. ఎందుకంటే మనిషి సంపాదించేది కేవలం డబ్బు కాదు. మనిషి సంపాదించాల్సింది మనుషుల్ని.
మానవత్వం మాయమవ్వకూడదు... మనిషిలో “మనిషి” బతికే ఉండాలి!

ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్టు

## పూడిక, జమ్ముతో పేరుకు పోయిన D-26 కాలువ..

- పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన

నాగర్ కర్నూల్, సెప్టెంబరు 16 (వుదయం ప్రతినిధి):

డి26 కాలువకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని తాడూరు మండలం గుంతకోడూరు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తాలోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.25 కి.మీ. పొడవైన డి26 కాలువలో కేవలం ఐదు కి.మీ. మేర మాత్రమే నీరు ప్రవహిస్తోందని, మిగతా ప్రాంతంలో పూడిక, జమ్ము పేరుకుపోవడంతో నీరు ముందుకు సాగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పూడిక తొలగించి నీటిని విడుదల చేయాలని కోరారు.కలెక్టర్ ఆదేశించినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ‘దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా మా పరిస్థితి ఉంది’ అని ఆవేదన వ్యక్తం చేశారు.నీరు అందకపోతే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు



# విపత్తుల వేళ తక్షణ స్పందన కీలకం: కలెక్టర్ అంకిత్

- యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్
- చాతకొండలో తొలి విడతగా 120 మందికి శిక్షణ
- మూడు సంవత్సరాలకు రూ.5 లక్షల బీమా సదుపాయం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి )**

విపత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపదమిత్రలు కీలక పాత్ర పోషించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ లోని ఆరవ బెటాలియన్ తెలంగాణ ప్రత్యేక పోలీసు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆరవ బెటాలియన్‌కు చేరుకున్న కలెక్టర్ అంకిత్‌కు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భౌగోళిక, వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి వరదలు, ఆకస్మిక వరదలు, పట్టణ ప్రాంతాల్లో నీటిముంపు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున స్థానికంగా శిక్షణ పొందిన యువత అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. విపత్తుల సమయంలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక అప్రమత్తత, సమయస్ఫూర్తి, పరిస్థితులను వేగంగా అంచనా వేసే సామర్థ్యం, సరైన నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా ప్రామాణిక నిర్వహణ విధానాలు, సమాచార ప్రసారం, రక్షణ పరికరాల వినియోగం, బృంద సమన్వయం తదితర అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. విపత్తు నిర్వహణ కేవలం తరగతి గదిలో నేర్చుకునే అంశం కాదని, క్షేత్రస్థాయిలో నిరంతర సాధన, కృత్రిమ విపత్తు విన్యాసాల ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. శిక్షణను పూర్తి ఏకాగ్రతతో తీసుకుని, నేర్చుకున్న అంశాలను పదేపదే సాధన చేసి జిల్లాకు ఉపయోగపడేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అవసరమైన రక్షణ పరికరాలు, సామగ్రిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**తొలి నిమిషాలు అత్యంత కీలకం**

ఆరవ బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ మాట్లాడుతూ విపత్తు సంభవించిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమని అన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు వేగంగా స్పందించి ప్రాథమిక సహాయక చర్యలు చేపట్టగలరని తెలిపారు.

శిక్షణలో బోటు నిర్వహణ, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, పైకి ఎక్కడం, కిందికి దిగడం, పర్వతారోహణ, వివిధ రకాల ముడుల వినియోగం వంటి ప్రాయోగిక అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. ఏదైనా అంశం స్పష్టంగా అర్థం కాకపోతే శిక్షకులను అడిగి తెలుసుకుని, పదేపదే సాధన చేయడం ద్వారా పూర్తి నైపుణ్యం, ఆత్మవిశ్వాసం సాధించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ఆపద మిత్రలకు శిక్షణ సామగ్రిని అందజేశారు. విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకు వచ్చిన యువతకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఆపదమిత్రకు మూడు సంవత్సరాల కాలానికి రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు.



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 416 మంది ఆపదమిత్రలకు శిక్షణ ఇవ్వనున్నామని, ఇందులో భాగంగా తొలి విడతగా 120 మందికి శిక్షణ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాల మేరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రాలు, జాతీయ సేవా పథకం, మై భారత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ తదితర సంస్థల ద్వారా ఎంపికైన యువతకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

**22 వరకు శిక్షణ**

సెప్టెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు జరిగే శిక్షణలో విపత్తుల రకాలు, ప్రకృతి మరియు మానవ తప్పిదాల వల్ల సంభవించే విపత్తులు, విపత్తులకు ముందు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, విపత్తుల సమయంలో స్పందన, అనంతరం చేపట్టాల్సిన సహాయక చర్యలు, ప్రథమ చికిత్స, రక్షణ పరికరాల వినియోగం, బోటును అమర్చడం, విడదీయడం, ప్రారంభించడం, నిర్వహించడం, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, పర్వతారోహణ, వివిధ రకాల ముడుల వినియోగం తదితర అంశాలపై సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజా, సహాయ కమాండెంట్ మరియా దాస్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, శిక్షకులు, ఆపదమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణసాగర్ ఆర్ఐటీఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

- ఐటీఐ పాసైన అభ్యర్థులకు ప్రముఖ
- పరిశ్రమల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు




**బూర్గంపాడు/భద్రాచలం, 16/9/26 వుదయం ప్రతినిధి:**

భద్రాచలం ఆర్ఐటీఐ భద్రాచలం (కృష్ణసాగర్)లో ఐటీఐ పాసైన అభ్యర్థులకు వివిధ పరిశ్రమలు, సంస్థల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా (PMNAM) నిర్వహించనున్నట్లు ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆర్ఐటీఐ కృష్ణసాగర్‌లో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తి చేసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పరిశ్రమల్లో ప్రాక్టికల్ శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అనుభవం పొందేందుకు అప్రెంటిస్‌షిప్ మేళా మంచి అవకాశంగా ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన ఐటీఐ పాసైన అభ్యర్థులు ముందుగా www.apprenticeshipindia.in వెబ్‌సైట్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసిన సకల కాపీతో పాటు బయోడేటా ఫారం, సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఐటీఐ ఉత్తీర్ణతకు సంబంధించిన సర్టిఫికెట్లు తదితర అవసరమైన పత్రాలను వెంట తీసుకుని అప్రెంటిస్‌షిప్ మేళాకు హాజరు కావాలని కోరారు. ఈ మేళాకు ఐటీసీ పేపర్‌బోర్డ్ లిమిటెడ్, భద్రాచలం, ఫిమాకం ఇండియా లిమిటెడ్, లక్ష్మీపురం, మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్, జహీరాబాద్, మేధా సర్వో డ్రైవ్, హైదరాబాద్, డైనమిక్ టూల్స్ లిమిటెడ్, హైదరాబాద్ తదితర ప్రముఖ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంస్థల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణకు సంబంధించిన అవకాశాలను అర్హులైన అభ్యర్థులు తెలుసుకోవడంతో పాటు తమ విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలకు అనుగుణంగా అవకాశాలను పొందేందుకు ఈ మేళా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఐటీఐలో పొందిన సాంకేతిక విద్యను పరిశ్రమల్లో ప్రాక్టికల్‌గా ఉపయోగించుకోవడానికి అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పరిశ్రమల పని విధానం, యంత్రాల నిర్వహణ, సాంకేతిక అంశాలు, పని భద్రతా ప్రమాణాలు వంటి అంశాలపై ప్రత్యక్ష అనుభవం పొందేందుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. అప్రెంటిస్‌షిప్ ద్వారా పొందే ప్రాక్టికల్ అనుభవం భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కృష్ణసాగర్ ప్రభుత్వ ఆర్ఐటీఐలో నిర్వహించనున్న ఈ అప్రెంటిస్‌షిప్ మేళాను అర్హులైన ఐటీఐ పాసైన అభ్యర్థులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు కోరారు. అభ్యర్థులు ముందుగానే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు కృష్ణసాగర్ ప్రభుత్వ ఆర్ఐటీఐకి చేరుకుని మేళాలో పాల్గొనాలని ఆయన సూచించారు.

## గణేష్ నగర్ గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**చర్ల, సెప్టెంబర్ 16: (వుదయం ప్రతినిధి)**



చర్ల మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపంలో అర్చకులు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యేకు గణేష్ నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, చీమలమర్రి మురళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, కొసరాజు రాజా, పోలిన లంకరాజు, ముమ్మనేని అరవింద్, పొట్రు బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 21న ఛలో భద్రాచలం ఐటీడీఏ మార్చ్‌ను జయప్రదం చేయాలి

**చర్ల, సెప్టెంబర్ 16: (వుదయం ప్రతినిధి)**



సెప్టెంబర్ 21న తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఛలో భద్రాచలం ఐటీడీఏ ఆదివాసీ మార్చ్‌ను జయప్రదం చేయాలని తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, కరపత్రాలను బుధవారం చర్లలోని తుడుందెబ్బ కార్యాలయ ఆవరణలో ఆదివాసీ ఉద్యమ వీరుడు కోమరం భీమ్ విగ్రహం ముందు చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు వాసం ముసలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆదివాసీల సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఐటీడీఏలను నిర్వీర్యం చేస్తున్నారని, ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారని విమర్శించారు.

తాజా పోలీస్ రిక్రూట్‌మెంట్‌లోనూ ఆదివాసీ నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. జీవో 109 ప్రకారం ఆదివాసీలకు కేటాయించాల్సిన 75 శాతం వాటాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో 1960 వడ్డీ వ్యాపార నిషేధ చట్టం అమల్లో ఉన్నప్పటికీ, వలస గిరిజనేతరులు వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 21న జరిగే ఐటీడీఏ మార్చ్‌కు ఆదివాసీ ప్రజలు, యువత, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాసం ముసలయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వాల్లే శ్రీకాంత్, సీనియర్ నాయకులు పూనెం వరప్రసాద్, మండల అధ్యక్షులు తాటి రామకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం రవికిరణ్, కోశాధికారి కలం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సోడి రవీంద్ర, సహాయ కార్యదర్శి తుర్రం ఆదినారాయణ, ఆర్గనైజేషన్ సెక్రటరీ తాటి శ్రీను, మడప అనిల్ కుమార్, సోడి సందీప్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వంట కార్మికుల ఒక్కరోజు దీక్ష

**యాదాద్రి భువనగిరి, వుదయం ప్రతినిధి**



మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న 10వేల వేతనం వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన వంట కార్మికులు ఒక్కరోజు దీక్షను ఇమ్రాన్ పూలమాలలు వేసి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం వండి పెడుతూ ఎంతో కీలకమైన సేవలు అందిస్తున్న వంట కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన తొమ్మిది నెలల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, అలాగే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వంట కార్మికులకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం ఇస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తీసుకురావడం వల్ల స్థానికంగా పనిచేస్తున్న వేలాది మంది వంట కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, అందువల్ల సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేసి ప్రస్తుతం ఉన్న మధ్యాహ్న భోజన పద్ధతినే కొనసాగించాలని అన్నారు. గతంలో పనిచేసిన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి, ఎటువంటి రాజకీయ వేధింపులకు గురిచేయకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా ప్రభుత్వం మెస్ ఛార్జీలను పెంచి, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కేటాయించాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మరింత విస్తృతమైన ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, జిల్లా కోశాధికారి సామల శోభన్ బాబు, మధ్యాహ్న భోజన వంట కార్మికుల జిల్లా అధ్యక్షులు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, నాయకులు రాజమణి బచ్చమ్మ, శ్యామ్, పద్మ, రజిత, మంజుల, అరుణ, లీలా, అండాలు, సుమీల, వరమ్మ, వీరాస్వామి, మంజుల, హరిత, శ్యామల, రజిత, పాల్గొన్నారు.

## లక్ష్యాలను సాధించేందుకు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



- ఎస్పీ నరసింహ
- పీఎం శ్రీ జడ్పీ హైస్కూల్ లో ఎక్స్ పర్ట్ టాక్ కార్యక్రమం

**సూర్యాపేట , సెప్టెంబర్ 16 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ సూచించారు. సూర్యాపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ లో నిర్వహించిన "ఎక్స్ పర్ట్ టాక్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని క్రమశిక్షణతో శ్రమించాలి. చదువు ఉద్యోగం కోసమే కాదు, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునే సాధనం. పీఎం శ్రీ పాఠశాలగా ఎంపిక కావడం విద్యార్థులకు గొప్ప అవకాశం, దాన్ని విజయంగా మలుచుకోవాలి. విద్యార్థులు సమాజానికి సేవ చేసే మహావృక్షాలుగా ఎదగాలి. మహిళలు, బాలికల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. సమస్యలు ఉంటే షీ టీమ్స్, భరోసా కేంద్రాలను సంప్రదించాలి. అపరిచితులకు ఓటిపి, పిన్, పాస్ వర్డ్, బ్యాంక్ వివరాలు చెప్పవద్దు. ఉచితాలు, ఆన్ లైన్ ఆఫర్ల పేరుతో వచ్చే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసపోతే వెంటనే 1930 హెల్ప్ లైన్ కు ఫోన్ చేయాలి. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మంచి లక్ష్యాలు ఉన్నవారితో స్నేహం చేయాలి. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, సైబర్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు యాదవేందర్ రెడ్డి, సాయిరాం, హరికృష్ణ, భరోసా ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్ఐ నీలిమ, హెచ్ఎం గోలి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇసుక లారీలతో ఆర్అండ్‌బీ రహదారి పూర్తిగా ధ్వంసం

- కన్నాయిగూడెంలో కూటమి నాయకుల ఆందోళన
- రూ.3.48 కోట్లతో నూతన రహదారి నిర్మాణం.. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఐటీడీఏ పీవో హామీ

**కన్నాయిగూడెం, 16/9/26 వుదయం ప్రతినిధి:**





తెలంగాణ నుంచి తరలిస్తున్న ఇసుక లారీల భారీ రాకపోకల కారణంగా కన్నాయిగూడెం పరిధిలోని ఆర్అండ్‌బీ రహదారి పూర్తిగా ధ్వంసమైందని కూటమి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ భారీ సంఖ్యలో ఇసుక లారీలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి తీవ్రంగా దెబ్బతిని పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని తెలిపారు. రహదారి గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు గోతులను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసిన సమయంలో గోతుల్లో నీరు చేరడంతో అవి కనిపించకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని స్థానికులు తెలిపారు. రహదారి పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రహదారి దుస్థితిపై స్పందించిన కూటమి నాయకులు ఇసుక లారీలను అడ్డుకుని కొంతసేపు నిలుపుదల చేసి నిరసన చేపట్టారు. ప్రజల ప్రాణాలే తమకు ముఖ్యమని పేర్కొంటూ రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టడంతో పాటు భారీ ఇసుక లారీల రాకపోకలపై తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. రహదారిపై ఏర్పడిన గోతులను వెంటనే పూడ్చడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయం ఐటీడీఏ పీవో శుభం నోబ్డాల్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించారు. నూతన రహదారి నిర్మాణ పనుల కోసం రూ.3.48 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వారం రోజుల్లో నూతన రహదారి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన రహదారి నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. అయితే నూతన రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ప్రస్తుత రహదారిపై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కూటమి నాయకులు కోరారు. భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో ఇసుక లారీలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఎటపాక ప్రాంతంలో కూడా రహదారిపై ఏర్పడిన గోతులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ముష్టి శ్రీనివాస్ స్పందించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా తన సొంత ఖర్చులతో రహదారి గోతులకు తాత్కాలిక మరమ్మతులు చేపించారు. గోతులను పూడ్చే చర్యలు చేపట్టి వాహనదారులకు కొంతమేర ఇబ్బందులు తగ్గించే ప్రయత్నం చేశారు. ప్రజలు ప్రతిరోజూ ఉపయోగించే ప్రధాన రహదారులు అధ్వానంగా మారితే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర సేవల వాహనాలు, రోగులను తరలించే వాహనాలు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రహదారి గోతుల కారణంగా వాహనాలు ఆలస్యంగా వెళ్లే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు గంగాధర్, జనసేన మండల అధ్యక్షుడు మరాసు, బీజేపీ ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మూడే సతీష్ నాయక్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు అధికారులను కోరారు. అలాగే భారీ ఇసుక లారీల రాకపోకలపై తగిన నియంత్రణ చర్యలు తీసుకుని రహదారులు మరింత దెబ్బతినకుండా అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కూటమి నాయకులు కోరారు.



## అన్నదానం

**యాదాద్రి భువనగిరి, 16/09/2026**

భువనగిరి గంజ్‌లోని భజరంగ్ వ్యాయామశాల గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాలను స్వీకరించారు. నవరాత్రుల తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ సుమారు 1,000 మంది భక్తులకు అన్నప్రసాదం అందించడం భజరంగ్ వ్యాయామశాల ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ రోజు అన్నదాన కార్యక్రమాన్ని 34వ వార్డు కౌన్సిలర్ సరగడ రాజ్యలక్ష్మి అమర్ గారి సహకారంతో, వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నజీర్ గారు హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో గొర్రెంకల శివశంకర్, ఎగునూరి దశరథ, సత్యనారాయణ, సరగడ కరుణ్, కే. వెంకటేష్, దత్తు యాదవ్, అక్షిత్, సరగడ రాము, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప దేవాలయంలో అన్నదానం

**అనంతగిరి సెప్టెంబర్ 16 వుదయం**

తెలంగాణా శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో 2026 సంక్రాంతి పండగ నుండి ప్రారంభం అయిన ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ ముప్పై ఆరవ (36), బుధవారం కిష్టాపురం వాస్తవ్యులు లక్ష్మాల వెంకటప్పయ్య – జానమ్మ దంపతుల సహకారంతో నిర్వహించారు ఈ కార్యకమం లో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, ఉపసర్పంచ్ గవిని రామకృష్ణ, ఆశీర్వాదం, ఖాశిం, శోభన్, బానోతు శివాజీ, గరిడేపల్లి ఉపేందర్, నరసింహారావు, భక్తులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొని స్వామి ని దర్శించి అన్నప్రసాదము స్వీకరించినారు.



## కార్యకర్త కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

**చండూరు, సెప్టెంబర్ 16 (వుదయం):**

మునుగోడు నియోజకవర్గ నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి ఉదారత చాటుకున్నారు. చండూరు పురపాలిక పరిధిలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొమ్మకంటి సత్యనారాయణ తల్లి బొమ్మకంటి రామలింగమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం పెద్దకర్మ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.50,000 ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకుల ద్వారా అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బరకల బిక్షమయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షులు గండు వెంకట్ గౌడ్, మాజీ మండల ఉపాధ్యక్షులు వంగూరు యాదయ్య యాదవ్, వడ్డేపల్లి భాస్కర్, సయ్యద్ జావిద్, పాలకూరి నాగరాజు గౌడ్, సొల్లేడు నరసింహ ముదిరాజ్, పంగ రామకృష్ణ యాదవ్, దేవా, జల్ల శీను, బొమ్మకంటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన పంతంగి నాగయ్యను పరామర్శించిన కమల్ రాజు

**మధిర, సెప్టెంబర్ 16, వుదయం, ప్రతినిధి:**





ఇటీవల ప్రమాదానికి గురైన మాజీ వార్డు సభ్యులు పంతంగి నాగయ్యను మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పరామర్శించారు. నాగయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కమల్ రాజుతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, మాజీ శివాలయం కమిటీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, చీదిరాళ్ల రాంబాబు, కృష్ణ నాయక్ తదితరులు నాగయ్యను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## గణేష్ నవరాత్రుల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహా అన్నదానం

**మండల అధ్యక్షుడు కీత వెంకన్న**

**చిలుకూరు సెప్టెంబర్ 16: ( వుదయం )**



మండల పరిధిలోని రామాపురంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు కీత వెంకన్న, ఇంటి వద్ద గల వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని పి సిసి డెలిగేట్ మెంబర్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నదానం మహా పుణ్యకార్యం అని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా వెంకన్న నవరాత్రి ఉత్సవాలు ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేమూరి సతీష్, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, ఎస్ఐ మోహన్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, వివిధ పార్టీల నాయకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 18న కుదునూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రహదారి దిగ్బంధం

**చర్ల, సెప్టెంబర్ 16:(వుదయం ప్రతినిధి)**



భద్రాచలం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న శుక్రవారం ఉదయం 10 గంటలకు చర్ల మండలం కుదునూరు గ్రామంలో నిర్వహించే ధర్నా, ప్రధాన రహదారి దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో–కన్వీనర్ ఐనవోలు పవన్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానెం రామకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారిందని, ముఖ్యంగా భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారి ప్రమాదకరంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇసుక లారీల రాకపోకలతో దెబ్బతిన్న రహదారులను తక్షణమే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తాలిపేరు కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని, తాలిపేరు నీరు వృథాగా పోకుండా చెరువులను నింపాలని కోరారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానెం రామకృష్ణ హాజరవుతారని తెలిపారు. రహదారుల పునర్నిర్మాణం కోసం చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి కనీసం 10 మంది నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దొడ్డి తాతారావు, ఐనవోలు పవన్ కోరారు.

## నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

**కోదాడలో మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి**

**మునగాల, సెప్టెంబర్ 16 (వుదయం):-**



కోదాడ పట్టణంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని మునగాల మండల వార్డు మెంబర్స్ ఫోరం అధ్యక్షుడు సూరేపల్లి ఉప్పలయ్య కోరారు. ప్రైవేట్ రంగంలోని ప్రముఖ సంస్థల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగం పొందేందుకు మంచి అవకాశమని పేర్కొన్నారు. మునగాల మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉప్పలయ్య పిలుపునిచ్చారు.

## ఘనంగా నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు

**చర్ల, సెప్టెంబర్ 16: (వుదయం ప్రతినిధి)**



చర్ల మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలను నాయి బ్రాహ్మణ సేవా సంఘం 500/82 ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మచ్చా రామారావుతో పాటు నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. ముందుగా కులదైవం ధన్వంతరి స్వామికి పూజలు నిర్వహించి, నాయి బ్రాహ్మణ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తోటపల్లి రమణ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల సంప్రదాయ క్షౌరవృత్తిని పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో తోటపల్లి శ్రీనివాసరావు, కోండ్రు హరీష్, గోరంట్ల శ్రీనివాసరావు, సుంకర రాజేష్, అయినవిల్లి శ్రీను, నేదునూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. సంఘ సభ్యులు, మహిళలు, యువత, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# చక్కని ఆరోగ్యం

## పనీర్ శరీరానికి మేలే చేస్తుంది..


### కానీ ఈ పొరపాట్లు చేయవద్దు



శాకాహారంలో ప్రోటీన్ కోసం ఎక్కువ మంది ముందుగా గుర్తుకు తెచ్చుకునే ఆహారం పనీర్. కూరలు, స్నాక్స్, సలాడ్స్‌లో విరివిగా ఉపయోగించే ఇది పోషకాలతో నిండినదే. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే పనీర్‌ను ఎలా వండుతాం, ఎలా నిల్వ చేస్తాం, ఎంత మోతాదులో తీసుకుంటాం అన్నదానిపై దాని ప్రోటీన్ లాభం ఆధారపడి ఉంటుంది. కొన్ని చిన్న పొరపాట్లు దీని పోషక విలువలను తగ్గిస్తాయి. అధిక మంటపై పనీర్‌ను ఎక్కువసేపు వండడం ఒక సాధారణ తప్పు. అధిక ఉష్ణోగ్రత వల్ల పాలలోని ప్రోటీన్ల నిర్మాణం మారుతుంది. దీని వల్ల ప్రోటీన్ పూర్తిగా నశించకపోయినా, శరీరం దాన్ని సులభంగా గ్రహించే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. అందుకే పనీర్‌ను తక్కువ మంటపై సున్నితంగా వండడం మంచిది.డీప్ ఫ్రై..ఇక డీప్ ఫ్రై చేయడం కూడా మరో పెద్ద పొరపాటు. నూనెలో వేయించిన పనీర్ రుచిగా ఉన్నప్పటికీ, అది ఎక్కువ కొవ్వు, క్యాలరీలను చేరుస్తుంది. ఫలితంగా ప్రోటీన్-టు-కాలరీ నిష్పత్తి తగ్గుతుంది. అంటే ప్రోటీన్ లభించినా, అవసరానికి మించిన కొవ్వు శరీరంలో చేరుతుంది. అందుకే గ్రిల్ చేయడం, ఎయిర్ ఫ్రై చేయడం లేదా తక్కువ నూనెలో వేయించడం ఉత్తమ ఎంపికలు.

మరొక ముఖ్యమైన విషయం పనీర్ నాణ్యత. మార్కెట్‌లో లభించే ప్యాకేజ్డ్ లేదా ప్రాసెస్ చేసిన పనీర్‌లో కొన్ని సందర్భాల్లో యాడిటివ్స్ ఉంటాయి, లేదా పాల ఘన పదార్థాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల తాజాగా ఇంట్లో తయారుచేసిన పనీర్ లేదా నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేయడం మంచిది.నిల్వ కూడా ముఖ్యమే..పనీర్‌ను కేవలం మైదా లేదా రిఫైన్డ్ కార్బొహైడ్రేట్స్‌తో కలిపి తినడం కూడా ఒక పొరపాటు. ఇలాంటి ఆహారం త్వరగా ఆకలి పెరగడానికి కారణమవుతుంది. ఫలితంగా ప్రోటీన్ ఉపయోగం తగ్గుతుంది. పనీర్‌ను ఫైబర్ ఉన్న కూరగాయలు, గింజలు, సంపూర్ణ ధాన్యాలతో కలిపి తింటే శరీరానికి మరింత ప్రయోజనం ఉంటుంది. ఇక పనీర్ నిల్వ విధానం కూడా చాలా ముఖ్యం. సరైన విధంగా నిల్వ చేయకపోతే అది త్వరగా పాడైపోవడం మాత్రమే కాదు, పోషక విలువ కూడా తగ్గుతుంది. ఫ్రిజ్‌లో నీటిలో ఉంచి రెండు రోజుల్లోపు ఉపయోగించడం మంచిది. బయట ఎక్కువసేపు ఉంచడం లేదా ఉష్ణోగ్రత మార్పులకు గురిచేయడం మంచిది కాదు.ఎంత మోతాదులో తీసుకోవాలి..అంతేకాకుండా పనీర్ మోతాదు విషయంలో కూడా జాగ్రత్త అవసరం. సాధారణంగా 100-150 గ్రాముల పనీర్ తీసుకోవడం సరిపోతుంది. ఇందులో సుమారు 18-20 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది, ఇది శరీరానికి అవసరమైన ప్రోటీన్ వినియోగాన్ని తీరుస్తుంది. ఒకేసారి ఎక్కువగా తీసుకోవడం కంటే రోజంతా విభజించి తీసుకోవడం ఉత్తమం. పనీర్ ఒక మంచి ప్రోటీన్ వనరు అయినప్పటికీ, దాన్ని ఎలా వాడుతున్నామన్నదే ముఖ్యమైనది. చిన్నచిన్న అలవాట్లను సరిచేసుకుంటే పనీర్ ద్వారా పూర్తి పోషక లాభాలను పొందవచ్చు. ఆరోగ్యకరమైన వంట విధానాలు, సరైన మోతాదు, మంచి నిల్వ పద్ధతులను పాటిస్తే పనీర్ నిజంగా డైట్‌లో ఉత్తమ ఆహారంగా మారుతుందని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.

## రాత్రి పూట వద్దు



వేసవి కాలం వచ్చిందంటే చాలు.. దాహార్తిని తీర్చుకోవడానికి పుచ్చకాయలను తింటుంటాం. పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కానీ, అది ఏ సమయంలో తింటున్నామనేదే ముఖ్యం. ముఖ్యంగా రాత్రి 7 గంటల తర్వాత ఏ రకమైన పండ్లు తీసుకోకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

పుచ్చకాయలో 94 శాతం నీరు, లైకోపీన్, పొటాషియం వంటి అద్భుతమైన పోషకాలు ఉంటాయి.అయితే, ఇది కొద్దిగా ఆమ్ల గుణాన్ని కలిగి ఉంటుంది. రాత్రి వేళ మన శరీరం విశ్రాంతి స్థితిలో ఉన్నప్పుడు ఇది జీర్ణక్రియను మందగింపజేస్తుంది. మన జీర్ణవ్యవస్థ అత్యంత చురుగ్గా ఉన్న సమయంలో (మధ్యాహ్నం 12 నుంచి 1 గంటల మధ్య) పుచ్చకాయ తినడం ఉత్తమం. ఆయుర్వేదం ప్రకారం కూడా రాత్రి పూట పుచ్చకాయ తినడం మంచిది కాదు. రాత్రి పూట మెటబాలిజం తకువగా ఉంటుంది.ఈ సమయంలో అధిక చకెర, నీరు ఉండే పుచ్చకాయ తింటే పొట్ట భారంగా అనిపించడం, గ్యాస్ పట్టేయడం లాంటి సమస్యలు వస్తాయి. పుచ్చకాయలో నీటి శాతం ఎకువ. రాత్రి పడుకునే ముందు దీన్ని తింటే పదే పదే మ*త్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దీనివల్ల నిద్రకు భంగం కలుగుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో రాత్రి పూట బిర్యానీ వంటి భారీ భోజనం చేయడం ఒక సంస్కృతిగా మారింది. ఇలాంటి భారీ భోజనం తర్వాత పండ్లు తినడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐబీఎస్ లేదా గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు రాత్రి పూట పుచ్చకాయకు దూరంగా ఉండాలి. చక్కరవ్యాధితో బాధపడేవారు, బరువు తగ్గాలనుకునే వారు సైతం దూరంగా ఉండటమే మేలు.

## ‘మారథాన్’కు సిద్ధమవుతున్నారా?

ఈ రోజుల్లో చాలామంది ఆరోగ్యానికే మొదటి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో భాగంగానే వయసుతో సంబంధం లేకుండా జాగింగ్, రన్నింగ్.. వంటివి చేస్తున్నారు. కొంతమంది మరో అడుగు ముందుకేసి మారథాన్‌లలోనూ పాల్గొంటున్నారు. ఈ క్రమంలో – పరుగు వల్ల కేవలం శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు. అయితే మొదటిసారి మారథాన్‌లలో పాల్గొనే వారు మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఫలితంగా గాయాల బారిన పడకుండా ఉండచ్చంటున్నారు. మరి, ఆ జాగ్రత్తలేంటో తెలుసుకుందామా...

మారథాన్‌లో పాల్గొనే ముందు ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా ఉండడం ముఖ్యం. కాబట్టి ముందు ఓసారి హెల్త్ చెకప్ చేయించుకొని, డాక్టర్ సలహాలు తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇలా శారీరకంగా సిద్ధపడినప్పుడే గాయాల పాలయ్యే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. మొదటిసారి రన్నింగ్ చేసేవారు వేగంగా, తొందరగా లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఫలితంగా మోకాళ్ల నొప్పులు, కండరాలు పట్టేయడం, కీళ్ల నొప్పులు.. వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ముందు నుంచే మారథాన్‌కు సిద్ధం కావాలి. ఈ క్రమంలోనే ప్రాక్టీస్ చేసేటప్పుడు.. ఒకేసారి లక్ష్యానికి గురిపెట్టకుండా.. కొద్దికొద్దిగా లక్ష్యాన్ని చేరుకునేలా సాధన చేయాలి. ఉదాహరణకు.. మొదటి వారమంతా కిలో మీటర్ రన్నింగ్ సాధన చేస్తే.. రెండో వారం అదనంగా మరో కిలోమీటర్ కలుపుకొని రెండు కిలోమీటర్లు పరిగెత్తేలా ప్రాక్టీస్ చేయాలి. ఇలా వేగం పెంచుకుంటూ పోయినప్పుడు లక్ష్యసాధన సులభమవుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గాయాల బారిన పడే అవకాశాలూ తగ్గుతాయంటున్నారు. వ్యాయామానికి ముందు వార్మప్ చేయడం మనకు తెలిసిందే..! ఇదే నియమం మారథాన్‌కు సిద్ధమయ్యే వారికీ వర్తిస్తుందంటున్నారు నిపుణులు. వార్మప్ చేయడం వల్ల ఆయాసపడకుండా ఉండడంతో పాటు.. గాయాల పాలయ్యే ప్రమాదం నుంచి కూడా తప్పించుకోవచ్చని చెబుతున్నారు. అయితే వార్మప్‌లో భాగంగా.. కండరాలు, కీళ్ల సామర్థ్యాన్ని పెంచేలా డైనమిక్ స్ట్రెచెస్ వ్యాయామాలకు ప్రాధాన్యమివ్వడం మంచిదంటున్నారు. మారథాన్ అంటే.. కొంతమంది వార్మప్ చేసి.. పరుగు సాధన చేస్తే సరిపోతుందనుకుంటారు. కానీ, శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలంటే వీటితో పాటు సైక్లింగ్, స్విమ్మింగ్, బరువులెత్తే వ్యాయామాలు.. వంటివి కూడా వర్కవుట్ రొటీన్‌లో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా శరీరంలోని కండరాలు దృఢంగా మారడంతో పాటు పూర్తి ఫిట్‌గా తయారుకావచ్చు. తద్వారా మారథాన్ లక్ష్యాన్ని చేరుకోవడం మరింత సులువవుతుంది. మారథాన్ సాధనలో భాగంగా.. రన్నింగ్ చేయడం వల్ల శరీరంలో ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతుంటాయి. అందుకు తగ్గట్టుగా ఆహారం తీసుకుంటేనే శరీరం తిరిగి దృఢంగా, ఉత్సాహంగా మారుతుంది. కాబట్టి తీసుకునే ఆహారంలో కూడా మార్పులు చేర్పులు చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్.. వంటి పోషకాలు ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేసుకోవాలంటున్నారు. అలాగే డీహైడ్రేషన్‌కి గురి కాకుండా ఉండేందుకు.. సరిపడినన్ని నీళ్లు తాగడం కూడా ముఖ్యమే! రన్నింగ్ చేసేటప్పుడు కేవలం శారీరకంగానే కాదు.. మానసికంగానూ దృఢంగా ఉండడం ముఖ్యం. ఈ క్రమంలో మనసులో ప్రతికూల ఆలోచనలు రాకుండా జాగ్రత్తపడాలి. ఇందుకోసం యోగా, ధ్యానం మేలు చేస్తాయి. అలాగే ఇతరులతో మాట్లాడేటప్పుడు కూడా సానుకూల అంశాలకే ప్రాధాన్యమివ్వాలి. ఇవన్నీ మారథాన్‌కు అన్ని విధాలుగా సంసిద్ధం చేస్తాయి అని చెబుతున్నారు నిపుణులు.



## ప్రెగ్నెన్సీలో.. నిద్ర పట్టడం లేదా?

గర్భిణుల్లో తలెత్తే సమస్యల్లో నిద్ర లేమి ఒకటి. నెలలు నిండుతున్న కొద్దీ పొట్ట పెరగడంతో ఆయాసంగా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. తద్వారా నిద్ర పట్టదు. అయితే జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడడం అంత కష్టమేమీ కాదంటున్నారు నిపుణులు. మరి అవేంటో చూద్దాం రండి. ప్రెగ్నెన్సీ సమయంలో ఏ పనీ చేయకుండా పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలనుకుంటారు కొంతమంది. అయితే అది కరెక్ట్ కాదంటున్నారు నిపుణులు. ప్రెగ్నెన్సీ సంబంధిత సమస్యలుండి, డాక్టర్లు సలహా ఇస్తే తప్ప పూర్తి విశ్రాంతి తీసుకోవడం సరి కాదంటున్నారు. ఈ క్రమంలో తేలిక పాటి వ్యాయామం ఇటు మీకు, అటు మీ కడుపులోని బిడ్డకు మేలు చేస్తుందంటున్నారు. దీనివల్ల మీరు రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారు. రాత్రి కూడా హాయిగా నిద్ర పడుతుంది. అలాగని రాత్రి పడుకునే ముందు కాకుండా.. వైద్యులు సూచించిన సమయంలో ఎక్సర్‌సైజ్ చేయడానికి తగిన సమయాన్ని కేటాయించుకోవాలి. ఒత్తిడి, ఆందోళన.. వంటివి కూడా రాత్రి పూట నిద్ర పట్టకుండా చేస్తాయి. ఇంట్లో, ఆఫీసులో ఉండే పలు సమస్యలు, ప్రసవం గురించిన భయాలు.. నిద్రలేమికి దారితీస్తాయి. అయితే దీనివల్ల మీకు, కడుపులో పెరుగుతున్న మీ బిడ్డకు మంచిది కాదు.. కాబట్టి ఒత్తిడిని దూరం చేసుకొని హాయిగా నిద్రపోయే మార్గాలేంటో నిపుణుల్ని అడిగి తెలుసుకొని పాటించాలి. రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోవడం వల్ల నిద్ర పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే పడుకునే ముందు టీవీ చూడటం, సెల్‌ఫోన్, కంప్యూటర్ వంటి గ్యాడ్జెట్స్‌కు దూరంగా ఉండాలి. వీలైతే గోరువెచ్చని నీటితో స్నానం చేయడం, గోరువెచ్చటి పాలు తాగడం.. వంటి అలవాట్ల వల్ల కూడా చక్కటి ఫలితాలుంటాయంటున్నారు నిపుణులు. అలాగే పడుకోవడానికి కనీసం గంట ముందు తల, కాళ్లను సున్నితంగా మసాజ్ చేయించుకుంటే నరాలు ఉత్తేజితమై హాయిగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు.



## వేడిగా ఉందని..

ఎండలు దంచికొడుతున్నాయి. ఎండా వేడిమి నుంచి తట్టుకునేందుకు చాలా మంది ఏసీలకు పని చెప్పేస్తున్నారు. అయితే ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కువగా ఏసీల్లో ఉంటే కచ్చితంగా కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా ఒబేసిటీ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని అంటున్నారు. వాతావరణంలో మార్పులు, అధికంగా ఏసీ వినియోగం వంటివి తీవ్రమైన ఆరోగ్య దుష్ప్రయోజనాలుగా మారుతాయని పేర్కొంటున్నారు.శారీరక చురుకుదనం తగ్గిపోతుంది:గదుల్లో గడిపే వ్యక్తులు ఎక్కువగా ఒకే చోట కూర్చుంటారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలో కాలరీల వినియోగం తగ్గిపోతుంది. దీని వలన తక్కువ సమయంలోనే బరువు పెరిగే అవకాశాలు పెరుగుతాయి. క్రమంగా అది ఒబేసిటీ, డయాబెటిస్ వంటి రోగాలకు దారి తీస్తుంది.ఆహార అలవాట్లు మారిపోతాయి:చల్లని వాతావరణం మనలో చిరుతిళ్లు తినాలనే ఆకాంక్షను పెంచుతుంది. ఆకలిలేని సమయంలోనూ మనం ఎదో ఒకటి తినే అవకాశం ఉంది. దీని ఫలితంగా, అవసరానికి మించి కాలరీలు తీసుకోవడం జరుగుతుంది. క్రమంగా మన శరీరంలో ఎక్కువ కొవ్వు పెరిగిపోవడం, బరువు పెరిగిపోవడం వంటివి జరుగుతాయి.శాస్త్రీయ పరిశోధనలు ఏమి చెబుతున్నాయి? కొన్ని అధ్యయనాల ప్రకారం, ఏసీ వాతావరణంలో ఎక్కువసేపు ఉండే వ్యక్తులు, సగటు వ్యక్తుల కంటే జీవక్రియ రేటు తక్కువగా ఉంటుందని గుర్తించారు. ఇది కాలక్రమేణా ఊబకాయం, డయాబెటిస్, హృదయ సంబంధిత సమస్యలు వంటి ఆరోగ్య సమస్యల ఛాన్సులను పెంచుతుందని చెబుతున్నారు.ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:-ఏసీ ఉన్నా చురుకుగా ఉండండి: ప్రతి అరగంటకు కనీసం 5 నిమిషాలు నడవడం లేదా చిన్న శారీరక కార్యకలాపం చేయడం మంచిది.-ఆహారాన్ని నియంత్రించండి: ఆకలి లేకపోయినా చిరుతిళ్లు తినడం తగ్గించండి. ఆరోగ్యకరమైన ఆహారపు ఎంపికలు చేయండి.-సహజమైన గాలి ప్రవాహాన్ని ప్రోత్సహించండి: సాధ్యమైనంతవరకూ ఏసీ అవసరం లేకుండా ఫ్యాన్‌లు లేదా సహజ గాలి ద్వారా శరీరాన్ని చల్లబరచుకునే ప్రయత్నం చేయండి.



## మన దేహం షుగర్ వ్యాధికి చిక్కొద్దంటే!

షుగర్ వ్యాధి.. దాని పేరులోనే తీపిదనం ఉంది. కానీ ఇది తియ్యటి విషంలా మనిషి ప్రాణాలను తోడేస్తుంది. ఎందుకంటే ఈ వ్యాధి ప్రారంభం నుంచి తీవ్రమయ్యే వరకు శరీరంలో ఎలాంటి ఇబ్బందులు అనిపించవు. ఫలితంగా వ్యాధిని గుర్తించే వీలు ఉండదు. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే రోగం బయటపడుతుంది. అంటే రోగికి ఏదైనా తీవ్రమైన అనారోగ్య సమస్య వచ్చినప్పుడు గానీ, లేదా శస్త్రచికిత్సలు చేసే సమయంలో గానీ షుగర్ ఉన్నట్లుగా తెలిసొస్తుంది. అంటే వ్యాధి బయటపడే సమయానికి జరగరాని నష్టం జరిగిపోతుందన్నమాట. అందుకే దీనిని వైద్య పరిభాషలో స్వీట్ పాయిజన్‌గా పరిగణిస్తారు. అసలు మధుమేహం అంటే ఏంటి? అది ఎందుకు వస్తుంది? మధుమేహం వల్ల కలిగే అనర్థాలు, అది రాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించాల్సిన చికిత్స తదితర అంశాలపై నేటి ఊపిరిలో తెలుసుకుందాం.ప్రస్తుతం షుగర్ వ్యాధి చాలామందిలో సర్వసాధారణమైపోయింది. వ్యాధి ఉన్నట్లు తెలియకపోవడం వల్ల ఎందరో రోగులు మొదటి వ*డు దశలు దాటి డేంజర్ జోన్‌లోకి వచ్చేస్తున్నారు. ఈ రుగ్మతను ప్రారంభ దశలో గుర్తించగలిగితే.. దానిని నియంత్రించవచ్చు. అంతేకాకుండా వ్యాధి వచ్చే అవకాశాలను ముందుగానే అంచనావేసి, వ్యాధి రాకుండా అరికట్టవచ్చు. కానీ, 80 శాతం మంది రోగులు వ*డు దశల తర్వాతే వ్యాధి ఉన్నట్లు తెలుసుకొని ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మధుమేహానికి మనదేశం ప్రపంచ రాజధానిగా మారింది. అవగాహన లేమి, పాశ్చాత్య ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవన శైలి తదితర కారణాలతో రోజురోజుకూ డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరిగిపోతున్నది.రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంమధుమేహం అనేది మన శరీరంలో వ*డు రకాల పదార్థాలు పెరగడం వల్ల వస్తుంది. అవి గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్. వీటినే సాధారణ చక్కెరలుగా పిలుస్తారు. ఈ పదార్థాలు మనం తినే ఆహారంలో ఉండి తీపిదనాన్ని అందిస్తాయి. సాధారణంగా శరీరం పలు రకాల సంక్లిష్ట పిండి పదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. అయితే రక్తంలో ఉండే గ్లూకోజ్ స్థాయి పెరగడంతో ‘ప్యాంక్రియాటిక్ బీటా’ కణాలు ఇన్సులిన్‌ను విడుదల చేస్తాయి. విడుదలైన ఇన్సులిన్ సమక్షంలో బీటా కణాలు శక్తిని ఉత్పన్నం చేయడానికి గ్లూకోజ్‌ను వినియోగించుకుంటాయి. ఇక ఫ్రక్టోజ్ విషయానికి వస్తే ఇది పండ్లలో, తీపి పానీయాలు, చల్లని పానీయాలలో లభిస్తుంది. ఫ్రక్టోజ్ వల్ల ఊబకాయం, కాలేయంలో కొవ్వు, ఇన్సులిన్ నిల్వలు పెరుగుతాయి.సుక్రోజ్ మనం వినియోగించే సాధారణ చక్కెర. ఇది చెరుకు నుంచి తయారవుతుంది. ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లు ఉంటాయి. ఈ వ*డు పదార్థాలు ఒక గ్రాముకు సమాన మోతాదులో క్యాలరీలను అంటే శక్తిని విడుదల చేస్తాయి. శరీరంలో అధికంగా శక్తి విడుదల కావడంతో అది కొవ్వుగా మారి పేరుకుపోతుంది. ఫలితంగా శరీరంలోని ప్రధాన భాగాలైన గుండె, కిడ్నీలతో పాటు కండరాలకు రక్తం సరఫరా సన్నగిల్లుతుంది. అంతే కాకుండా కొవ్వు పెరిగిపోవడంతో ఊబకాయం కూడా వచ్చేస్తుంది. శరీరంలో తీపి పదార్థాల వల్ల అధికశక్తి విడుదల అవుతున్నందున ఈ వ్యాధిని చక్కెర వ్యాధి లేదా మధుమేహ వ్యాధి అని పిలుస్తారు. డయాబెటిస్ 2 రకాలుప్రధానంగా డయాబెటిస్ రెండు రకాలు. అందులో ఒకటి టైప్-1 డయాబెటిస్, రెండోది టైప్-2 డయాబెటిస్. ఎక్కువ మందిలో కనిపించేది టైప్-2 డయాబెటిసే. హార్మోన్లలో మార్పుల వల్ల కొంతమంది గర్భిణుల్లో షుగర్ స్థాయిలు పెరిగే అవకాశాలు ఉంటాయి. ఈ విధంగా గర్భధారణ సమయంలో డయాబెటిస్ రావడాన్ని జస్టేషనల్ డయాబెటిస్ అంటారు.టైప్-1 డయాబెటిస్: ఇది ఒక ఆటోఇమ్యున్ వ్యాధి. అంటే రోగి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ ప్యాంక్రియాస్‌లోని ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలపై పొరపాటున దాడి చేసి, వాటిని నాశనం చేస్తుంది. దీంతో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోయి శరీరంలో చక్కెర స్థాయిలు పెరిగిపోతాయి. టైప్-1 డయాబెటిస్‌కు కచ్చితమైన కారణాలు చెప్పలేం. జెనెటికల్‌గా కానీ, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల కారణంగా కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం లేకపోలేదు.

టైప్-2 డయాబెటిస్: ప్రస్తుతం ఉన్న డయాబెటిస్ రోగుల్లో 90 శాతం మంది టైప్-2 బాధితులే. జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగానే దీని బారినపడుతున్నారు. ప్యాంక్రియాస్ తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేనప్పుడు లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సమగ్రంగా వినియోగం కాకపోవడం వల్ల టైప్-2 డయాబెటిస్ వస్తుంది. అంతేకాకుండా ఊబకాయం వల్ల కూడా ఇది సంభవిస్తుంది. దీనివల్ల చిన్న రక్తనాళాలు, పెద్ద రక్తనాళాలు ప్రభావితం అవుతున్నాయి. మన భారతీయులకు ఇన్సులిన్ రెసిస్టెన్స్ అధికంగా ఉంటుంది. టైప్-2 డయాబెటిస్ కారణంగా సెంట్రల్ ఒబేసిటీ అధికంగా వస్తుంది. అంటే పొట్ట వద్ద ఎక్కువగా కొవ్వు పెరుగుతుంది. దీనివల్ల విసరల్ ఫ్యాట్ కూడా అధికంగా పేరుకుపోతుంది. ఇదిలా ఉండగా ఊబకాయం లేకుండా సన్నగా ఉన్నవారిలో కూడా డయాబెటిస్ వస్తున్నది. దానికి కారణం విసరల్ ఫ్యాట్ అనేది ఎక్కువగా ఉండటమే.డయాబెటిస్ రావడానికి ప్రధాన




కారణాలువంశపారంపర్యంగా. జీన్ ఎన్విరాన్‌మెంట్ ఇంటరాక్షన్ (ఏపీ జెనెటిక్స్). వ్యాయామం లేకపోవడం. పిండి పదార్థాలు ఎక్కువగా, ప్రొటీన్‌లు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం.జీన్ డైల్యూషన్ లేకపోవడం.. అంటే ఒకే తెగకు చెందిన వారిని వివాహం చేసుకోవడం వల్ల జన్యువులు మరింత బలపడతాయి. అదే ఒక తెగ వారు మరో తెగకు చెందిన వారిని వివాహం చేసుకోవడం వల్ల జీన్ డైల్యూషన్ జరుగుతుంది. జీన్ డైల్యూషన్ వల్ల డయాబెటిస్ ముప్పు తగ్గుతుంది.జంక్ ఫుడ్, గ్రామీణ వాతావరణం తగ్గి, పట్టణ వాతావరణం పెరగడం.జీవన శైలి, ఆహారపు అలవాట్లు.కలిగే అనర్థాలు డయాబెటిస్ వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ముఖ్యంగా కాలేయం, కిడ్నీ, గుండె లాంటి ప్రధాన అవయవాల వద్ద కొవ్వు పేరుకుపోతుంది. దీనివల్ల ఈ అవయవాలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మన దేశంలో 10.5 శాతం ప్రివిలెన్స్ ఆఫ్ డయాబెటిక్ ఉండగా తెలంగాణలో 18 శాతంగా ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉంటున్నది. డయాబెటిస్‌ను నియంత్రణలో పెట్టకపోతే అది రక్తనాళాలపై ప్రభావం చూపుతుంది. చిన్న రక్తనాళాలపై ప్రభావం చూపితే కళ్లు, కిడ్నీలు దెబ్బతింటాయి. పెద్ద రక్తనాళాలు ప్రభావితం అయితే గుండె, పాదాలు దెబ్బతింటాయి.

## రూ.500కు లభించే బ్యాగ్.. రూ.8.3 లక్షలా..!

లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్‌కు చెందిన ఓ బ్యాగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'నవరాత్రి' పేరుతో రూపొందించిన ఈ బ్యాగ్ ధర ఏకంగా రూ.8.3 లక్షలు ఉండటమే దీనికి కారణం. ఈ బ్యాగ్ డిజైన్ గుజరాత్ వీధుల్లో కనిపించే సంప్రదాయ బ్యాగులను పోలి ఉందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అతి తక్కువ ధరకు లభించే బ్యాగ్‌కు భారీ ధర నిర్ణయించడంపై చర్చ మొదలైంది. ముఖ్యంగా భారతీయ సంప్రదాయ కళలు, హస్తకళలను విదేశీ లగ్జరీ బ్రాండ్లు ఉపయోగించుకుంటున్నాయని నెటిజన్లు మండిపడుతున్నారు.




# బడ్జెట్ ధరలో ఒప్పో నుంచి K14 Lite స్మార్ట్‌ఫోన్.. ఫీచర్లివే!




ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ ఒప్పో దేశీయ మార్కెట్‌లోకి కొత్త స్మార్ట్‌ఫోన్ కే14 లైట్ (Oppo K14 Lite)ను లాంచ్ చేసింది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఆక్టాకోర్ ప్రాసెసర్‌తో వస్తోంది. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ ధరలు పెరుగుతున్న వేళ.. బడ్జెట్ ధరలో మంచి బ్యాటరీతో స్మార్ట్‌ఫోన్ కావాలనుకునే వారికి ఇది ఒక ఆప్షన్ కానుంది. ఫీచర్లు పరిశీలిస్తే.. ఆండ్రాయిడ్ 16తో కూడిన కలర్‌ఓఎస్ 16పై పనిచేస్తుంది. Unisoc T7250 ఆక్టా కోర్ ప్రాసెసర్ అమర్చారు. 6.75 అంగుళాల హెచ్‌డీ+ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేట్, 900 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. డిస్‌ప్లే ప్యానెల్ ఫ్లాష్ టచ్, ఆయిలీ-హ్యాండ్ టచ్, గ్లోవ్ టచ్ ఫీచర్లను అందిస్తుందని ఒప్పో చెబుతోంది.

ఫోన్ వెనుక వైపు 13 ఎంపీ ప్రధాన కెమెరా, ముందువైపు 5 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఏఐ క్లియర్ ఫేస్, ఏఐ స్మార్ట్ ఇమేజ్ మ్యాటింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. గూగుల్ జెమినై, గూగుల్‌ఏఐ అసిస్టెంట్ సపోర్టుతో వస్తోంది. IP64 రేటింగ్ ఉంది. 7000mAh బ్యాటరీ, 15W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సపోర్టుతో వస్తోంది.

ధర విషయానికొస్తే.. 4GB+64GB వేరియంట్ ధర రూ.16,999గా కంపెనీ నిర్ణయించింది. ఫెదర్ పర్పుల్, స్టోన్ బ్రౌన్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో నేటి నుంచే విక్రయాలకు రానున్నట్లు కంపెనీ తెలిపింది. లాంచ్ ఆఫర్‌లో భాగంగా ఎంపిక చేసిన బ్యాంక్ హోల్డర్స్‌కు రూ.వెయ్యి డిస్కౌంట్ అందిస్తోంది. మూడు నెలల పాటు నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ కూడా ఉంది.

# కేంద్ర క్యాబినెట్ గుడ్‌న్యూస్.. EPF వేతన పరిమితి పెంపు




కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల భవిష్యనిధి (EPF) గరిష్ఠ వేతన పరిమితి పెంపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రూ.15వేలుగా ఉన్న పరిమితిని రూ.25వేలకు పెంచేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

ఈపీఎఫ్ వేతన పరిమితి పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. జీవన వ్యయం పెరిగినప్పటికీ దాదాపు 12 ఏళ్లుగా గరిష్ఠ వేతన పరిమితి పెరగలేదు. 2014లో చివరిసారిగా రూ.6500 నుంచి రూ.15వేలకు పెంచారు. దీంతో వేతన పరిమితి పెంచాలని కొన్నేళ్లుగా కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల అదనంగా 51 లక్షలకు పైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనుందని, వీరంతా ఈపీఎఫ్‌ఓ పరిధిలోకి వస్తారని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దీనిపై కేంద్రం ఏటా రూ.11,339 కోట్లు వెచ్చించనుందని చెప్పారు. ప్రస్తుతం, నెలకు రూ.15వేలు కంటే ఎక్కువ వేతనంతో ఉద్యోగంలో చేరే కొత్త ఉద్యోగి ఆటోమేటిక్‌గా ఈపీఎఫ్ పరిధిలోకి రావడం లేదు. తప్పనిసరి ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఈడీఎల్ఐ ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిమితిని రూ.25 వేలకు పెంచడం వల్ల రూ.15,000– రూ.25,000 వేతన శ్రేణిలో గణనీయమైన సంఖ్యలో ఉద్యోగులు చట్టబద్ధమైన సామాజిక భద్రతా పరిధిలోకి వస్తారు.

# జియో రీఛార్జ్‌పై ఏడాది పాటు కాన్వా ఫ్రీ..?




ప్రముఖ విజువల్ డిజైన్ ప్లాట్‌ఫామ్ కాన్వాతో రిలయన్స్ జియో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద జియో వినియోగదారులు, ఏడాది పాటు ఉచితంగా కాన్వా ప్రీమియం వెర్షన్ వినియోగించుకోవచ్చు. అర్హులైన జియో వినియోగదారులు కాన్వా ప్రో లేదా కాన్వా ప్రో లైట్ సబ్‌స్క్రిప్షన్‌ను ఏడాది పాటు ఎటువంటి రుసుము లేకుండా పొందొచ్చు. మైజియో యాప్ ద్వారా ఈ ఆఫర్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. రూ.349, రూ.399 ప్రీపెయిడ్ ప్లాన్లతో కాన్వా ప్రో లైట్, కాన్వా ప్రో సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. ఈ రెండు ప్రీపెయిడ్ ప్లాన్లతో పాటు రూ.349 కంటే ఎక్కువ విలువ కలిగిన 2జీబీ హైస్పీడ్ డేటా కలిగిన అన్ని ప్రీపెయిడ్ ప్లాన్లపైనా కాన్వా ప్రో లైట్ సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా అందిస్తున్నట్లు జియో తెలిపింది. మైజియో యాప్ ద్వారా ఆఫర్‌ను యాక్టివేట్ చేసుకున్నాక ప్రో, ప్రో లైట్ ప్రయోజనాలను వినియోగించుకోవచ్చు. కాన్వాప్రో లైట్ ద్వారా 50 జీబీ, కాన్వా ప్రోలో 100 జీబీ క్లౌడ్ స్టోరేజీ కూడా లభిస్తుంది. ఈ ఆఫర్ సెప్టెంబర్ 16 నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇక రూ.399 రీఛార్జ్‌పై 28 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. రోజుకు 2.5 జీబీ డేటా చొప్పున మొత్తం 70 జీబీ డేటా లభిస్తుంది. అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు వినియోగించుకోవచ్చు. జియో హాట్‌స్టార్ మొబైల్, జియో ఏఐక్లౌడ్ వంటి సదుపాయాలు లభిస్తాయి. రూ.349 ప్లాన్‌పై రోజుకు 2జీబీ చొప్పున మొత్తం 56 జీబీ డేటా, అపరిమిత కాల్స్, 100 ఎస్సెమ్మెస్‌లు, జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, జియోఏఐ క్లౌడ్ సదుపాయాలు పొందొచ్చు.


# రాబిన్ హుడ్‌తో పోల్చిన పేటీఎం సీఈఓ




యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధించడాన్ని పేటీఎం వ్యవస్థాపకుడు, సీఈఓ విజయ్ శేఖర్ శర్మ స్వాగతించారు. సామాన్యులకు, చిరు వ్యాపారులకు ఊరట కల్పిస్తూ 'రాబిన్ హుడ్' విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. రూ.2 వేలు పైబడిన నిర్దిష్ట లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తూ ఎన్‌పీసీఐ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆయన ఓ టీవీ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ''ఇతర చెల్లింపుల వ్యవస్థలకు చాలా రోజులుగా ఛార్జీలు వర్తిస్తున్నాయి. ఇప్పటివరకు యూపీఐ వ్యవస్థ చాలా వరకు ప్రభుత్వ సాయంపైనే నడుస్తోంది. పెద్ద పెద్ద ఇ-కామర్స్ సంస్థలు, పెద్ద రిటైల్ చైన్‌లు చేసే పెద్ద లావాదేవీలపై ఛార్జీలు విధించడం ద్వారా వచ్చే ఆదాయం.. సాధారణ వినియోగదారులకు, చిన్న వ్యాపారులకు యూపీఐని ఎప్పటికీ ఉచితంగా అందించడానికి సహాయపడుతుంది. ఈ నిర్ణయం యూపీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది. ఏదో ఒకరోజు ఈ రుసుము వర్తిస్తుందని ముందుగా ఊహించినదే. చిరు వ్యాపారుల ప్రయోజనాలను కాపాడుతూ ఛార్జీలపై నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది'' అని విజయ్ శేఖర్ శర్మ అన్నారు.

ఎండీఆర్ ఛార్జీల ప్రకటన నేపథ్యంలో పేటీఎం వంటి పలు ఫిన్‌టెక్ కంపెనీల షేర్లు లాభపడ్డాయి. పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ స్టాక్ ఇంట్రాడేలో ఏకంగా 7.24 శాతం లాభపడి రూ.1856.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. వన్‌మొబిక్విక్ సిస్టమ్స్ లిమిటెడ్ షేర్లు కూడా 5.96 శాతం, పైన్‌ల్యాబ్స్ 2.68 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే, లాభాల స్వీకరణతో పేటీఎం లాభాలు పరిమితం కాగా.. మొబిక్విక్, పైన్‌ల్యాబ్స్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



## మూడో టీ20.. బెంచ్‌పై ఉన్నోళ్లకు ఛాన్స్: శ్రేయస్ అయ్యర్

అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే భారత్ కైవసం చేసుకుంది. గురువారం ఆఖరి మ్యాచ్ జరగనుంది. తొలి రెండు మ్యాచులకూ ఒకే జట్టుతో బరిలోకి దిగింది. దీంతో వైభవ్ సూర్యవంశీకి అవకాశం రాలేదు. అయితే, సిరీస్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన టీమ్‌ఇండియా తుది జట్టు ఎంపిక విషయంలో ఓ స్పష్టతతోనే ఉంది. ఈ నేపథ్యంలో బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లకు అవకాశం ఇస్తామని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వెల్లడించాడు. వరుసగా రెండు సిరీస్‌లు ఓడిన తర్వాత.. అయ్యర్ నాయకత్వంలో టీమ్‌ఇండియా సొంతం చేసుకున్న తొలి సిరీస్ ఇదే. 'టీ20 జట్టు సారథిగా నా ప్రయాణం మొదట్లో కాస్త క్లిష్టంగా ఉంది. వరుసగా రెండు సిరీస్‌లూ కోల్పోయాం. ఇప్పుడు మళ్లీ విజయాల బాట అందుకొన్నాం. గతంలో జరిగిన దాని గురించి ఎక్కువగా ఆలోచించను. ఈ క్షణాలను ఆస్వాదించడంపైనే దృష్టి పెడతా. గత ఇంటర్వ్యూలోనూ ఇదే మాట చెప్పా. ఇప్పుడు అఫ్గాన్‌పై ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయాలు సాధించాం. చివరి మ్యాచ్‌లోనూ అదే పునరావృతం చేసేందుకు ప్రయత్నిస్తాం.

# భారత్ వేదికగానే ఐపీఎల్ 2027 మినీ వేలం!

ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఈ ఏడాది ఆఖరి నెలలో మినీ వేలం జరగనుంది. అయితే, దీనిని విదేశాల్లో కాకుండా.. భారత్ వేదికగానే నిర్వహించనున్నారు. గత మూడుసార్లూ విదేశాల్లోనే ఈ వేలం జరిగిన సంగతి తెలిసిందే. దుబాయ్, జెడ్డా, అబుధాబి వేదికగా నిర్వహించారు. అయితే, విదేశాల్లో వేలం నిర్వహణకు పలు సవాళ్లు ఉన్నాయని ఫ్రాంచైజీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీంతో మంగళవారం జరిగిన సమావేశంలో గవర్నింగ్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వేదిక, తేదీ ఖరారు చేయలేదు. మరోవైపు వచ్చే ఏడాది మెగా వేలం మాత్రం విదేశీ గడ్డపైనే నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మహిళల ప్రిమియర్ లీగ్ (WPL) వేలం అక్టోబర్ 29న జరిగే అవకాశం ఉంది. కోచి వేదికగా వేలం నిర్వహించనున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఐపీఎల్ మినీ వేలానికి కోచినే వేదిక అయ్యే అవకాశం ఉంది. ఆక్షన్ కోసం వచ్చే ఫ్రాంచైజీల సిబ్బంది వసతికి దాదాపు 100 గదుల వరకు అవసరం. అందుకు అనుగుణంగా ఏర్పాట్లను బీసీసీఐ పర్యవేక్షించనుంది.

మహిళల ప్రిమియర్ లీగ్ 2027 సీజన్(WPL 2027) మ్యాచులకు కొత్త వేదిక రానుంది. వారణాసి స్టేడియంలో మ్యాచులను నిర్వహించాలని చర్చ జరిగినట్లు సమాచారం. వచ్చే ఏడాది జనవరి నాటికి స్టేడియం అందుబాటులోకి వస్తుంది. ముంబయిలోని బ్రాబోర్న్ మైదానం, వడోదరలోని కోటంబి స్టేడియంతో పాటు వారణాసిలోనూ మ్యాచులను నిర్వహించే అవకాశం ఉంది.

ఐపీఎల్‌లో ఇంపాక్ట్ రూల్‌ను కొనసాగించాలా? వద్దా? అనే దానిపై ఇంకా సందిగ్ధత నెలకొంది. దీనిపై వచ్చే నెలలో జరగనున్న ఐపీఎల్ (IPL) గవర్నింగ్ కమిటీ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇంపాక్ట్ రూల్‌పై ఇప్పటికే పలువురి నుంచి వ్యతిరేకత వస్తోంది.




# కోపం తెచ్చిన తంటా..

యూఎస్ ఓపెన్‌లో హ్యాట్రిక్ కొట్టి సంబరాలు చేసుకుందామని భావించిన సబలెంకాకు రిబకినా నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఫైనల్‌లో ఆమెను ఓడించిన రిబకినా టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. దీంతో సబలెంకా కోపం తారస్థాయికి చేరింది. మ్యాచ్ ముగిసిన వెంటనే తన రాకెట్‌ను విరగ్గొట్టేసింది. అంతకుముందు మ్యాచ్‌లోనూ టెన్నిస్ బంతులను ఎలా పడితే అలా కొట్టేసింది. ఈ క్రమంలో ఓ కెమెరా మెన్‌కు బంతి తాకే ప్రమాదం కాస్తలో తప్పింది. దీంతో యూఎస్ ఓపెన్ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు సబలెంకాకు 7500 డాలర్లు (దాదాపు రూ. 7.15 లక్షలు) ఫైన్ విధించారు.

యూఎస్ ఓపెన్ సెమీఫైనల్స్ సమయంలోనే రిబకినా అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. ఇక ఫైనల్‌లో గెలవడంతో పాయింట్లు భారీగానే వచ్చాయి. వీరిద్దరి మధ్య వ్యత్యాసం దాదాపు 2100 పాయింట్లకుపైనే ఉంది. తాజాగా అప్‌డేట్ చేసిన ర్యాంకుల పట్టికలో.. రిబకినా 9,901 పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు చేరుకుంది. సబలెంకా 7,875 పాయింట్లతో రెండోస్థానానికి పడిపోయింది. వీరి తర్వాత జెస్సికా పెగులా (7,265), కోకో గాఫ్ (7,244), మిర్రా ఆండ్రీవా (5,743) ఉన్నారు.



గాయం కారణంగా యూఎస్ ఓపెన్‌లో యానిక్ సినర్ పాల్గొనలేదు. అయినా అతడి టాప్ ర్యాంక్‌పై ప్రభావం పడలేదు. ప్రస్తుతం 11,500 పాయింట్లతో సినర్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. యూఎస్ ఓపెన్ విజేత అలెగ్జాండర్ జ్వెరెవ్ (9,690) రెండో ర్యాంకులో నిలిచాడు. వీరి తర్వాత కార్లోస్ అల్కరాస్ (5,560), బెన్ షెల్టన్ (4,680), అగర్ (3,890) ఉన్నారు. అత్యధిక గ్రాండ్‌స్లామ్‌ల విజేత నొవాక్ జకోవిచ్ (2,980) టాప్ -10 నుంచి నిష్క్రమించడం గమనార్హం. ప్రస్తుతం అతడు 11వ స్థానంలో ఉన్నాడు.

# వసతి సమస్యే కాదు.. కంటైనర్లను అలవాటు చేసుకున్నాం: శరత్ కమల్

ఆసియా క్రీడలకు వేళైంది. ఇప్పటికే భారత జంబో టీమ్ జపాన్‌కు చేరుకుంది. అయితే, అక్కడ వసతి సదుపాయాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. చిన్న కంటైనర్లలో అథ్లెట్లకు బస కల్పించడం సరైంది కాదని వ్యాఖ్యలు వినిపించాయి. ఈ క్రమంలో భారత డిప్యూటీ చెఫ్ ది మిషన్ శరత్ కమల్ అక్కడి వసతులపై స్పందించాడు. తమకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని.. కంటైనర్లను భారత అథ్లెట్లు త్వరగానే అలవాటు చేసుకుంటారని తెలిపాడు. మొత్తం 501 మంది అథ్లెట్లు, 265 మంది అధికారులతో కూడిన భారత్ బృందం ఆసియా క్రీడల కోసం వెళ్లింది. 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఆటగాళ్ల కోసం భారత్‌లోనే కొన్ని కంటైనర్లను ఏర్పాటు చేశాం. అందులో ఉండేలా తర్ఫీదు ఇచ్చాం. కాబట్టి, ఆసియా క్రీడల సందర్భంగా అథ్లెట్లు ఎలాంటి ఇబ్బంది పడరని అనుకుంటున్నా. అక్కడ ఉన్న క్రూయిజ్ షిప్స్ వంటి నమూనాలను ఇక్కడ తయారు చేయించి వినియోగించాం. ప్లేయర్లూ అలవాటు చేసుకున్నారు. అయితే, వారు కొన్నింటిని ఆశించడం తప్పులేదు. వారికి నచ్చజెప్పాం. ఇక్కడ అన్నింటికంటే ముఖ్యమైంది నాణ్యమైన ప్రదర్శన ఇవ్వడం. టీటీలో కనీసం ఒక్క మెడల్ అయినా గెలుచుకోవాలి. గత ఎడిషన్‌లో మహిళల విభాగంలో ఒకటి గెలిచాం. ఈసారి ఆ సంఖ్య పెరిగితే బాగుంటుంది. పురుషుల డబుల్స్‌లో మనుష్, మానవ్ బాగా ఆడుతున్నారు. ఇప్పుడు వారిద్దరూ ప్రపంచంలోనే నంబర్ 2 జోడీ. మెడల్ గెలిచే అవకాశాలు ఎక్కువే'' అని శరత్ వెల్లడించారు. సెప్టెంబర్ 19 నుంచి ఆసియా గేమ్స్ మొదలవుతాయి. ఈసారి కూడా క్రికెట్‌లో రెండు పతకాలు భారత్‌కే వస్తాయనేది విశ్లేషకుల అంచనా.




# పొట్టి కప్‌లో బంగ్లా బహిష్కరణపై నివేదిక

భారత్ వేదికగా జరిగిన గత టీ20 ప్రపంచ కప్‌ను బంగ్లాదేశ్ రాజకీయ వైరుధ్యంతో బహిష్కరించింది. అయితే.. దానికి కారణం ఎవరో తాజాగా దర్యాప్తు నివేదికలో బయటపడింది. బంగ్లా క్రికెట్ బోర్డు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ దర్యాప్తు చేపట్టింది. ఆ వివరాలను కమిటీ సభ్యుడు ఫైజల్ దస్తగిర్ వెల్లడించారు. ''బంగ్లాదేశ్ గత వరల్డ్ కప్‌లో పాల్గొనకపోవడంపై దర్యాప్తు చేశాం. సంబంధిత వ్యక్తులతో జరిపిన చర్చలు, మీడియా కథనాలు, ఇతర వివరాల ఆధారంగా చూస్తే అప్పటి యువజన, క్రీడా వ్యవహారాల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఇందుకు ప్రధాన కారకుడిగా చెప్పొచ్చు. అప్పటి ప్రభుత్వంతోపాటు ఆయన దీనికి బాధ్యులు. వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ ఆడి ఉండాల్సింది. కానీ, నజ్రుల్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు'' అని దస్తగిర్ తెలిపారు. ప్రస్తుత బోర్డు ఛైర్మన్ తమీమ్ ఇక్బాల్ కూడా బంగ్లాదేశ్ టీ20 ప్రపంచ కప్‌లో ఆడితే బాగుండేదని ఇటీవల వ్యాఖ్యానించాడు. భారత వ్యతిరేకిగా నజ్రుల్‌పై ముద్ర ఉంది. అందుకే, భారత్వేదికగా జరిగిన వరల్డ్ కప్ కోసం బంగ్లా జట్టును పంపించకూడదని బలంగా అనుకున్నాడు. భద్రతను సాకుగా చూపించిన అతడు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తొలుత బుకాయించాడు. ఆ తర్వాత టీ20 ప్రపంచ కప్‌లో ఆడకూడదని ప్లేయర్లు, కోచ్‌లు, జాతీయ జట్టు బోర్డు నిర్ణయించినట్లు ప్రకటన చేశాడు. ఇప్పుడు బంగ్లా బోర్డు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ మాత్రం అందుకు భిన్నంగా నివేదిక ఇచ్చింది.



వుదయం సినిమా
MOVIE TIME!

# ప్రభాస్ 'ఫౌజీ'కి మరోసారి బ్రేక్..



**వుదయం సినిమా:** ప్రభాస్ అభిమానులు ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్న 'ఫౌజీ' సినిమాకు సంబంధించి రిలీజ్ డేట్‌పై మరోసారి చర్చ మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తామని మేకర్స్ జూలైలో ఆఫీషియల్‌గా ప్రకటించారు. అయితే తాజాగా ఈ డేట్ నుంచి సినిమా తప్పుకున్నట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను 2027 జనవరి 26న రిపబ్లిక్ డే రోజున రిలీజ్ చేయబోతున్నట్లు మళ్ళీ వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో అసలు 'ఫౌజీ' ఎప్పుడు థియేటర్లలోకి వస్తుంది? డిసెంబర్ రిలీజ్ ఎందుకు కష్టంగా మారింది? కొత్తగా వినిపిస్తున్న రిలీజ్ డేట్ నిజమేనా అనే ప్రశ్నలు మళ్ళీ మొదలయ్యాయి.ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం 'ఫౌజీ' డిసెంబర్ 3 రిలీజ్ నుంచి వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే నిర్మాతల నుంచి మాత్రం ఇప్పటివరకు కొత్త రిలీజ్ డేట్ గురించి ఎలాంటి ప్రకటనా రాలేదు. సినిమా ఆలస్యానికి ప్రధాన కారణాల్లో విజువల్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఉన్నట్లు పరిశ్రమలో చర్చ జరుగుతోంది. హను రాఘవపూడి తన సినిమాల్లో విజువల్ డీటెయిలింగ్, పీరియాడిక్ సెటప్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టే దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. 'ఫౌజీ' కూడా 1940ల నేపథ్యంలోని కథగా రూపొందుతుండటంతో మేకింగ్ పరంగా పెద్ద స్థాయిలో పని జరుగుతోంది. అందుకే తొందరగా విడుదల చేయడం కంటే తుది అవుట్‌పుట్‌కు అవసరమైన సమయం తీసుకోవాలని టీమ్ భావిస్తున్నట్లు రిపోర్టులు చెబుతున్నాయి. దీంతో 2027 జనవరి 26న 'ఫౌజీ'ని రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేయొచ్చనే ప్రచారం కూడా వినిపిస్తోంది. అయితే ఈ డేట్ కి సంబంధించి ఇప్పటివరకు మైత్రి మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి జనవరి 26ను ప్రస్తుతానికి ఒక రిలీజ్ బజ్‌గా మాత్రమే చూడాలి.ఇదిలా ఉంటే ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ కాప్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' (Spirit) ప్రపంచవ్యాప్తంగా 2027 మార్చి 5న థియేటర్లలో విడుదల కాబోతోంది.

## వైరల్‌గా మారిన న్యాచురల్ స్టార్, కయాదు లోహార్ బ్రాండ్ న్యూ పోస్టర్



**వుదయం సినిమా:** న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.తాజాగా మేకర్స్ నాని, కయాదు లోహార్‌ను ఇంటెన్స్ రొమాంటిక్ అవతార్‌లో ప్రజెంట్ చేస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.పోస్టర్‌లో నాని రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, కయదు లోహార్ కూడా ఇంటెన్స్ అవతార్‌లో కనిపించారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడి.. సిగరెట్స్ ను లైటర్‌తో వెలిగించుకుంటున్న విజువల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. చుట్టూ ఉన్న డార్క్, ఇంటెన్స్ వాతావరణం మధ్య ఈ సన్నివేశం వారి మధ్య ఉన్న బాండింగ్‌ను డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇందులో హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు హైలైట్‌గా ఉండబోతున్నాయి. జడల్ & సుబ్బు..ప్రేమ ఇంతకుముందెన్నడూ చూడనంత ప్రత్యేకంగా ఉండబోతుంది.'ది ప్యారడైజ్' సెన్సార్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుంది.రేపటి నుంచి మిగతా భాషల్లో ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేస్తున్నారు. రేపు హీరో నాని చెన్నై వెళ్తున్నారు.ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

## 'బా బా బ్లాక్ షీప్' నుంచి సెకండ్ సాంగ్



**వుదయం సినిమా:** అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 9న సినిమా రిలీజ్ అవుతుంది. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ , విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళ్వీ మల్హోత్రా, కశ్యప్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.మేఘాలయా రాష్ట్రంలో పూర్తిగా చిత్రీకరణను జరుపుకున్న తొలి దక్షిణాది సినిమా ఇదే కావటం విశేషం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, రీసెంట్‌గా రిలీజైన 'ఆజా మేరీ జాని' సాంగ్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'వెవెలా ఊహలే చూపినా..'ను రిలీజ్ చేశారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ఈ పాటను విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు.'వెవెలా ఊహలే చూపినా..' సాంగ్ నేపథ్యం విషయానికి వస్తే..తమకు కావాల్సిన ఓ అరుదైన బాక్స్ కోసం విలన్ గ్యాంగ్ వెతుకుతుంటుంది. అది హీరో, హీరోయిన్ దగ్గర ఉందని వారు భావిస్తుంటారు. అదే సమయంలో వాళ్లు విలన్స్ కంటపడతారు. మరోవైపు హీరో చేతిలో గన్ ఉంటుంది..అది ఊహించని రీతిలో పేలుతుంది. దీంతో హీరోహీరోయిన్‌లపై గ్యాంగ్ రివర్స్ ఫైరింగ్ స్టార్ట్ చేస్తారు. ఈ నేపథ్యంలో రేట్రో స్టైల్లో 'వెవెలా ఊహలే చూపినా..' సాంగ్ ప్లే అవుతుంటుంది.ఎలక్ట్రానిక్ కిలి, ఆర్కాడో సంగీత సారథ్యంలో ఈ సాంగ్‌ను కిట్టు విస్సాప్రగడ రాయగా..శ్రీ సాగర్ పాడారు. పాటను మళ్లీ మళ్లీ వినాలనిపించేలా డిఫరెంట్ బ్యాక్ డ్రాప్, మ్యూజిక్‌తో ఆసాంతం ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా..చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ ''ఇప్పటి వరకు రిలీజైన మా బా బా బ్లాక్ షీప్ మూవీ టీజర్, అజా మేరీ జాని సాంగ్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు 'వెవెలా ఊహలే చూపినా..' అనే సాంగ్‌ను మీ ముందుకు తీసుకొస్తున్నాం. డిఫరెంట్ స్టైల్లో సాగే పాట ఇది. ఈ సాంగ్‌ను రిలీజ్ చేసిన మా అనిల్ రావిపూడిగారికి థాంక్స్.

## 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' హైలీ ఎంటర్టైనింగ్ టీజర్

**వుదయం సినిమా:** హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు.సెప్టెంబర్ 30 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ETV Winలో 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' స్ట్రీమింగ్ కానుంది.తాజాగా మేకర్స్ టీజర్ రిలీజ్ చేశారు. హర్ష ఫాదర్ ఎవరినైనా ప్రేమించమని చెప్పే సన్నివేశంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. టీజర్‌లో ఫన్ అలరించింది. హర్ష టైమింగ్ అదిరిపోయింది. హైపర్ ఆది పంచులు మరో హైలైట్‌గా నిలిచాయి.జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి ఇతర కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు.అజయ్ అరసాడ సంగీతం ఫన్‌ను మరింత ఎలివేట్ చేసింది. చిత్రానికి శక్తి అరవింద్ సినిమాటోగ్రఫీ అందించారు. జానీ షేక్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, లిఖిత్ లీ ఎడిటర్‌గా, సాయి ప్రావలిక కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పీవీజీ విశ్వనాథ్ లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు.తారాగణం: హర్ష చెముడు, హైపర్ ఆది, జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, రూప శ్రావ్య, శ్రీ విద్యా, ప్రేమ్ సాగర్, వాసు ఇంటూరి, మహేందర్, జబర్దస్త్ గోపి.



## ఏ నిమిషానికి ఏమి జరుగునో నుంచి పాట విడుదల

**వుదయం సినిమా:** రాజు వెడ్స్ రాంబాయ్ చిత్రంతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అఖిల్ రాజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఏ నిమిషానికి ఏమి జరుగునో'. ఒక విభిన్నమైన సస్పెన్స్ థ్రిల్లర్ రూపొందిస్తున్న ఈ సినిమాలో రతిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సాయితేజ దర్శకుడు. లక్కీ మీడియా, కేడీ అండ్ కో బ్యానర్స్‌పై బెక్కెం వేణుగోపాల్, దీవెల శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణనంతర పనులు జరుపుకుంటోన్న ఈ చిత్రం ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.కాగా ఈ చిత్రం నుంచి కృష్ణకాంత్ రచించిన ఏదో బాగుందే అనే లిరికల్ వీడియోను ప్రముఖ యువ కథానాయకుడు శ్రీవిష్ణు విడుదల చేశారు.



## 'కాగితం పడవలు' ప్రీరిలీజ్



**వుదయం సినిమా:** వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్లుగా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ లవ్‌స్టోరీ 'కాగితం పడవలు'. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, T. R. ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నేను ఈ వేడుకకు రావడానికి కారణం డైరెక్టర్ తుకారాం. 'ఫలక్‌నుమా దాస్' అసిస్టెంట్ డైరెక్టర్స్ కావాలని కాస్టింగ్ కాల్ పెట్టాను. అప్పుడు వచ్చిన డైరెక్టర్ తుకారాం. తనకి ఇష్టమైన సినిమా 'ఒసేయ్ రాములమ్మ' అని చెప్పాడు. నిజంగా అలాంటి ఆన్సర్ నేను ఎవరి దగ్గర వినలేదు. తర్వాత కొంతకాలం పని చేశాక తను సొంతగా డైరెక్టర్ చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడని నాకు అర్థమై, తన ప్రయత్నాలు చేసుకోమని పంపించాను. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు మా జర్నీ కొనసాగుతుంది.

## 'పాటకు ప్రాణం'.. ఘనంగా ప్రారంభోత్సవం



**వుదయం సినిమా:** హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం 'పాటకు ప్రాణం' హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు సురేందర్ రెడ్డి, ప్రముఖ హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీతానికి, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కనున్న ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్నారు. ఈ మ్యూజికల్ ఫిల్మ్‌లో యువ నటులు సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. సీనియర్ నటుడు తనికెళ్ల భరణి కీలక పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు రాజీవ్ కనకాల, అనితా చౌదరి, రఘు కారుమంచి, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుందని దర్శక నిర్మాత హేమల్ తుమ్మపూడి తెలిపారు. వైవిధ్యమైన కథాంశంతో, సంగీతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆస్మాన్ టీజర్ లాంచ్

**వుదయం సినిమా:** శ్రీమతి. కొండారు శ్రీనివాసరావు సమర్పణలో శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్ మీద మేఘాంశ్ శ్రీహరి హీరోగా రామ్ నందన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆస్మాన్'. ఈ సినిమాని వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మిస్తున్నారు. శ్రీహరి జయంతి సందర్భంగా రిలీజ్ చేసిన మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. మేఘాంశ్ శ్రీహరి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం నాడు టీజర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కి రా కింగ్ మంచు మనోజ్, శివాత్మిక రాజశేఖర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో..రా కింగ్ మంచు మనోజ్ మాట్లాడుతూ .. 'నా తమ్ముడు మేఘాంశ్ 'ఆస్మాన్' కోసం రావడం ఆనందంగా ఉంది. శ్రీహరి అంకుల్ మమ్మల్ని ఎత్తుకుని పెంచారు. నేను మేఘాంశ్‌ని ఎత్తుకున్నాను (నవ్వుతూ). సినిమా ఉన్నంత కాలం రియల్ స్టార్ శ్రీహరి గారు ఉంటారు. మేఘాంశ్‌ని నేను ఎలా చూడాలని అనుకున్నానో టీజర్‌లో అలా కనిపించాడు. టీజర్ నాకు చాలా నచ్చింది. ప్రశాంత్ గారి బీజీఎం అదిరిపోయింది. అరబిక్‌లో కూడా ఈ సినిమాని రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. 'ఆస్మాన్' గొప్ప హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. నా తమ్ముడు మేఘాంశ్‌ను అందరూ ఆదరించి మంచి విజయాన్ని ఇవ్వాలని ఆశిస్తున్నాను' అని అన్నారు.మేఘాంశ్ శ్రీహరి మాట్లాడుతూ .. ''ఆస్మాన్' కోసం వచ్చిన మనోజ్ అన్నకి, శివాత్మికకు థాంక్స్. 'ఆస్మాన్' మూవీని ఎంజాయ్ చేస్తూ చేశాను. షోయబ్ గారితో ఆల్రెడీ ఓ మూవీ చూస్తున్నాను. షోయబ్ గారి వల్లే ఈ చిత్రం ఈ స్థాయిలో వచ్చింది. రాయంచ అద్భుతంగా నటించారు. రామ్ నందన్ ఈ సినిమాని గొప్ప స్థాయిలో తెరకెక్కించారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.